అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

గురువారం 10-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 172 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50


## నోరు అదుపులో పెట్టుకో..

### బీజేపీ ఎంపీ దూబే వ్యాఖ్యలపై సీపీఐ (ఎం) ఆగ్రహం

**న్యూఢిల్లీ :** బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నోరు అదుపులో పెట్టుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. లోక్‌సభలో చర్చ సమయంలో బీజేపీ ఎంపీ దూబే సీపీఐ (ఎం) పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. సిపిఐ(ఎం) పార్టీని ఉద్దేశిస్తూ.. 'దేశ ద్రోహ పార్టీ' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ.. పొలిట్‌బ్యూరో బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘిస్తూ.. తన వాదనను వాస్తవమని నిరూపించేందుకు వేలాది మెయిల్స్‌ను రికార్డు చేయాలని చూశారు. ఈ విధంగా చేయడం ద్వారా ఆయన ఆరోపణలు అవాస్తవమని రుజువయ్యాయని ...9లో



# నేడు అవిశ్వాసంపై ఓటింగ్

### ప్రధాని మోడీ హాజరయ్యేనా?

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై నేడు (గురువారం) ఓటింగ్ జరగనుంది. పార్లమెంట్‌కు రాకుండా ఉన్న ప్రధాని మోడీని సభకు రప్పించి, మాట్లాడించడానికి ఒక సాధనమే ఈ అవిశ్వాస తీర్మానమని ప్రతిపక్షాలు మొదటి నుంచి చెబుతున్నాయి. అది నేడు నెరవేరనుంది. అవిశ్వాస తీర్మానంపై ప్రధాని మోడీ నేడు సమాధానం ఇవ్వాల్సి ఉన్నది. అయితే ఈ తీర్మానంపై జరిగే ఓటింగ్‌లో ...2లో

### 'అవినీతికి ప్రతిరూపం ఇండియా కూటమి'

- కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ



కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడుతూ అవినీతి, వారసత్వ రాజకీయాలు దేశాన్ని విడిచిపెట్టిపోవాలన్నారు. "మీది ఇండియా కాదు, అవినీతికి ...2లో

### మణిపూర్ సీఎంను మార్చాల్సిన అవసరం లేదు

- బీరెన్‌కు అమిత్‌షా సమర్థన



మణిపూర్‌లో హింసను అరికట్టడంలో పూర్తిగా విఫలం అయిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమర్థించారు. బుధవారం ...2లో

### మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలి

- అన్ని రంగాల్లో తెలంగాణ నెంబర్ 1
- కేంద్రం నయా పైసా సాయం చేయటం లేదు : బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు



మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత నామా నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగు నీటి వంటి రంగాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని, కేంద్రం మాత్రం నయాపైసా సాయం చేయడం లేదని విమర్శించారు. కొత్తగా ...9లో



## మణిపూర్‌లో భారతమాత హత్య

### అందుకే ప్రధాని మోడీ మణిపూర్ వెళ్లలేదు : కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్

మణిపూర్‌లో మహిళలను హత్య చేయడమంటే, భారత మాతను హత్య చేయడమేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అందుకే ప్రధాని మోడీ మణిపూర్ వెళ్లలేదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష కూటమి 'ఇండియా' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బుధవారం రెండోరోజు కూడా చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'భారత్ అంటేనే ఓ గొంతు. భారత్ మన ప్రజల గొంతుక. అది ప్రజల హృదయ స్పందన. అలాంటి గొంతుకను మీరు( బీజేపీ ప్రభుత్వం) మణిపూర్‌లో హత్య చేశారు. అంటే భారత మాతను మీరు మణిపూర్‌లో ...2లో



## సంపదపై సమాన హక్కు ఇవ్వండి

### దేశంలో వెలిగిపోతున్నది ఆ నలుగురే

- ప్రజలపై విపరీత భారాలు..కార్పొరేట్లకు రాయితీలు
- బీజేపీ ప్రభుత్వ విధానాలపై క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాలు
- మోడీ కార్మిక, రైతు వ్యతిరేకి
- ఇందిరా పార్కు వద్ద ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మహాపడావ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని అంటున్నది గదా..దమ్ముంటే దేశ సంపదపై ప్రజలందరికీ సమాన హక్కు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దేశంలో నేడు కేవలం నలుగు వ్యక్తులు మాత్రమే వెలిగిపోతున్నారని విమర్శించారు. నిత్యావసరాల ధరలు పెంచుతూ, పన్నుల పేరుతో కేంద్ర పాలకులు భారాలు మోపుతూ ప్రజల బతుకులను కేంద్ర పాలకులు చిదిమేస్తున్నారనీ, అదే సమయంలో కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తున్నారని విమర్శించారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామనీ, దేశాన్ని కాపాడుకుంటామని ప్రతినబూనారు. కేంద్ర కార్మిక, రైతు సంఘాల సంయుక్త పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాపడావ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, ఐఎన్‌టీయూసీ ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగన్న గౌడ్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారన్న, హెచ్ఎమ్ఎస్ ఆలిండియా కార్యదర్శి సుదర్శన్‌రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌కే బోస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.జనార్ధన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్, రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు విస్సా కిరణ్, తెలంగాణ రైతు కూలి సంఘం కార్యదర్శి ఎం.భిక్షపతి, తదితరులు మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు పరం చేస్తున్నారన్నారు. బ్రిటీష్‌పాలకులపైనా, స్వతంత్ర్యం వచ్చాక మన పాలకులపైనా పోరాడి, కొట్లాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడానికి మోడీ ఎవరు? అని ప్రశ్నించారు. బ్రిటీష్ పాలకుల కంటే దుర్మార్గంగా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ ఓట్లు సాధించి గద్దెనెక్కడంపైనే బీజేపీ దృష్టి ఉందని ఆరోపించారు. మోడీ పచ్చి ఫాసిస్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హక్కుల గురించి, పాలకుల విధానాల గురించి ప్రశ్నించే మేధావులు, రచయితలు, కార్మిక, రైతు ...9లో



భారత క్రికెటర్ మిన్ను మణిని సత్కరిస్తున్న కేరళ సీఎం పినరయి విజయన్

## కేరళ కాదు..కేరళం

- కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం..
- పేరు ఎందుకు మార్చాలో చెప్పిన సీఎం పినరయి విజయన్

**తిరువనంతపురం:** కేరళ పేరును 'కేరళం' గా మార్చాలనే తీర్మానాన్ని ఆ రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సభలో ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానానికి సభలోని అన్ని పక్షాల నాయకులు ఏకగ్రీవంగా, ఎలాంటి సవరణలు లేకుండా ఆమోదం తెలిపారు. దీంతో రాష్ట్రం అధికారిక పేరును అన్ని భాషల్లో 'కేరళం'గా మార్చాలని సీఎం కేంద్రాన్ని కోరారు. ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెడుతూ.. ...9లో

## రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు పట్టిన వ్యాధి

### బీజేపీవి.. పొద్దున లేస్తే హిందు, ముస్లిం గొడవలే

- ఎంపీ అరవింద్ సంస్కారహీనుడు : నిజామాబాద్‌లో మంత్రి కేటీఆర్



**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/నిజామాబాద్ రూరల్**

'మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా? మతం మంటల బీజేపీ కావాలా? మూడు పంటలు పండించే కేసీఆర్ కావాలో మీరే తేల్చాలి. రేవంత్ రెడ్డి నువ్వు నిఖార్సయిన తెలంగాణ వాదివా? తెలంగాణ వాదివి కావు.. తెలంగాణకు పట్టిన వ్యాధివి. నోట్ల కోసం ఓట్లు అమ్ముకున్న క్రిమినల్‌వి. రైతులకు మూడు గంటలు కరెంట్ ఇస్తే చాలు అంటావా? కాంగ్రెస్‌లో నువ్వు కూర్చోవాలన్నా.. నిలబడాలన్నా.. ఢిల్లీకి వెళ్లి అనుమతి తీసుకోవాలి' అంటూ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. నిజామాబాద్ నగరంలో బుధవారం పర్యటించిన మంత్రి కేటీఆర్.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. నిజామాబాద్ ఐటీ హబ్‌ను ప్రారంభించిన అనంతరం ఎస్‌పీసీ సెంటర్‌ను ప్రారంభించారు.

అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయంతో పాటు, మినీ ట్యాంక్ బండ్, అత్యాధునిక హంగులతో నిర్మించిన శ్మశానవాటికను మంత్రి వేముల, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తతో కలిసి ప్రారంభించారు. మధ్యాహ్నం మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ ...9లో

## రాజకీయం కాదు.. బాధితులను ఆదుకోండి

### పేదలకు నిత్యం అండగా ఎర్రజెండా : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి, పోతినేని

- మోరంచపల్లి, గోవిందరావుపేటలో బాధిత ప్రజలకు ఆర్థిక సాయం



**నవతెలంగాణ-భూపాలపల్లి/గోవిందరావుపేట**

ప్రభుత్వాలు వరద రాజకీయాలు చేయడం మానుకొని, చేతనైతే బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు సూచించారు. ఎలాంటి కష్టాలు, సమస్యలు వచ్చినా పేదలకు ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని స్పష్టంచేశారు. బుధవారం ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ప్రేరణ స్వచ్ఛంద సేవా సంస్థ, ...9లో

## ముస్లిం వ్యాపారాలపై నిషేధం

- హర్యానాలో 50 పంచాయతీలు కీలక నిర్ణయం



**చండీగఢ్:** బీజేపీ పాలిత రాష్ట్రమైన హర్యానాలో ముస్లిం వ్యాపారుల ప్రవేశంపై పంచాయతీలు నిషేధం విధించాయి. అలాగే గ్రామాల్లో నివసించే ముస్లింలు వారి పత్రాలను పోలీసులకు సమర్పించాలని పేర్కొన్నాయి. ఈ మేరకు సర్పంచులు సంతకం చేసిన లేఖలను ...9లో

## గాంధీ మునిమనవడు అరెస్టు


- మహా పోలీసుల నిర్బంధంలో తుషార్ గాంధీ, తీస్తా సెతల్వాద్



**ముంబయి :** క్విట్ ఇండియా దే నిరసనల్లో పాల్గొనకుండా మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్ గాంధీ, ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్‌ను మహారాష్ట్ర పోలీసులు బుధవారం నిర్బంధించారు. శాంత క్రూజ్ పోలీస్ స్టేషన్‌లో తనను నిర్బంధించినట్టు తుషార్ గాంధీ సోషల్ మీడియా ...9లో

## న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ఫ్లాటు జప్తు

- మనీలాండరింగ్ కింద ఈడీ చర్య



**న్యూఢిల్లీ :** మనీ లాండరింగ్ ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) న్యూస్‌క్లిక్ పోర్టల్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్తకు చెందిన ఫ్లాటును జప్తు చేసింది. పోర్టల్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈడీ త్వరలోనే ఛార్జిషీటు దాఖలు చేసే అవకాశం ఉంది. పుర్కాయస్త నివాసంపై ఈడీ 2021 సెప్టెంబర్‌లో దాడి ...2లో



## విచారణ నుంచి తప్పుకున్న సుప్రీంకోర్టు జడ్జి

- ఉమర్ ఖాలీద్ బెయిల్ పిటిషన్ విషయంలో అనూహ్య పరిణామం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అల్లర్లలో ఉమర్ ఖాలీద్ ప్రమేయం ఉందన్న ఆరోపణలపై జరగనున్న బెయిల్ పిటిషన్‌ను విచారణలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పి.కె. మిశ్రా ఈ బెయిల్ పిటిషన్ విచారణ నుంచి తనంతట తాను తప్పుకున్నారు. దీంతో జస్టిస్ ఎ.ఎస్.బోపన్న నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఇది వేరే బెంచ్ ముందుకు వస్తుందని జస్టిస్ బోపన్న అన్నారు. తదుపరి న్యాయమూర్తుల కూర్పుతో ఆగస్టు 17న తదుపరి విచారణ చేపట్టనున్నట్టు ధర్మాసనం పేర్కొన్నది. అయితే, ఈ పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ మిశ్రా తప్పుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

ఉమర్ ఖాలీద్ ఇప్పటికే 1050 రోజులు జైలులో ఉన్నాడు. అంతేగాక, ఆయనపై చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద అభియోగాలు మోపారు. బెయిల్ కోసం ఆయన చేసిన పిటిసన్‌ను ఢిల్లీలోని ట్రయల్ కోర్టు గతేడాది మార్చిలో తిరస్కరించింది. అతను గతేడాది ...9లో

# గజ్వేల్ నుంచి.. కేటీఆర్..

### స్థానిక బీఆర్ఎస్‌లో రెండు గ్రూపులు

- ఇతరులెవ్వరు పోటీ చేసినా నెగెటివ్ ఫలితం
- ఇంటలిజెన్స్ రిపోర్టుతో తెరపైకి యువరాజ్ పేరు
- కామారెడ్డి లేదా పెద్దపల్లిలో కేసీఆర్..!
- మెదక్ ఎంపీ సీటుపై వంటేరు కన్ను




**ఇప్పటి వరకూ కేసీఆర్ అంటే గజ్వేల్.. గజ్వేల్ అంటే కేసీఆర్ అంటారు.. ఇక నుంచి గజ్వేల్ అంటే కేటీఆర్.. కేటీఆర్ అంటే గజ్వేల్ కానుందా..? అంటే అవుననే చర్చ నడుస్తోంది. తండ్రి స్థానంలో తనయుడు పోటీ చేయబోతున్నట్టు తెలుస్తోంది. దాంతో సీఎం కేసీఆర్ కామారెడ్డి లేదా పెద్దపల్లికి షిఫ్ట్ అవుతారనే చర్చ సాగుతోంది. ఉత్తర తెలంగాణలో పట్టుబిగించేందుకు ఆ ప్రాంతంలో కేసీఆర్ పోటీ చేయాలనే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులకు అవకాశముందంటున్నారు. కేసీఆర్ స్థానంలో కేటీఆర్ గజ్వేల్‌కు వస్తే గెలుపు సునాయాసం కావడమే కాకుండా స్టార్ క్యాంపెయినర్‌గా ఇతర జిల్లాలకు ఎక్కువ సమయం ఇవ్వడానికి వీలుంటుందనే ఆలోచన చేస్తున్నట్టుగా ప్రచారం జరుగుతోంది.**

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014, 2018లో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. కేసీఆర్‌పై పోటీ చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ పదవి ఇచ్చారు. అప్పటి నుంచి గజ్వేల్ నియోజకవర్గంలో విపక్షాల ఉనికే లేకుండా పోయింది. బీఆర్ఎస్‌గా పార్టీ పేరు మారినందున కేసీఆర్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశముంది. అందుకే వచ్చే ఎన్నికల్లో ఆయన గజ్వేల్ నుంచి కాకుండా కామారెడ్డి లేదంటే పెద్దపల్లి.. పరిస్థితులను బట్టి మరో చోటి నుంచి పోటీ చేయొచ్చంటున్నారు. మహారాష్ట్రలోని ఓ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి అక్కడ పట్టు బిగించాలని చూస్తున్నట్టు కూడా తెలుస్తోంది. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్దన్ మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయబోతున్నట్టు వెల్లడించారు. అదే జరిగితే గజ్వేల్ నుంచి ఎవరు పోటీ చేస్తారనే చర్చ ముందుకొచ్చింది. స్థానికంగా బీఆర్ఎస్ బలంగానే ఉంది. కానీ..! పార్టీలో గ్రూపులున్నాయి. అనైక్యత వల్ల కేసీఆర్ తప్ప ఇంకెవ్వరు పోటీ చేసినా బీఆర్ఎస్‌కు నెగెటివ్ ఫలితం వస్తుందంటూ ఇంటలిజెన్స్ చేసిన సర్వేలో తేలడంతో ...9లో

**నవతెలంగాణపై స్పందన**
**ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016**

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

**అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.**







## నేడు అవిశ్వాసంపై ఓటింగ్..

(మొదటిపేజీ తరువాయి)

ఎలాగూ ప్రభుత్వమే గెలుస్తుందని అందరికీ తెలుసు. అయితే ప్రస్తుత లోక్‌సభ అధికారిక లెక్కల ప్రకారం ప్రభుత్వానికి మద్దతుగా 369, ప్రతిపక్షానికి మద్దతుగా 154, తటస్థంగా 16 మంది మద్దతు ఉంది.

**మణిపూర్‌లో శాంతి నెలకొల్పుదాం :కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తీర్మానం**

మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం లోక్‌సభలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్షాలు ప్రధాని మోడీ సమక్షంలో తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశాయి. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకొని ప్రధాని మోడీ గురువారం సభలో మాట్లాడతారని అన్నారు. అయితే అప్పుడే తీర్మానం పెట్టాలని ప్రతిపక్షాలు కోరాయి. కానీ స్పీకర్ ఓం బిర్లా తీర్మానం పెట్టడంపై సమ్మతించే వారు చేతులెత్తండని పేర్కొన్నారు. దీంతో అధికార సభ్యులంతా చేతులెత్తి తీర్మానానికి మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హెూరెత్తించారు. ప్రధాని మోడీ సభకు రావాలని, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగింది. రాహుల్ గాంధీ, ఎ.రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), కనిమొళి (డీఎంకే), ఈటి మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), మిథున్ రెడ్డి (వైసీపీ), నామా నాగేశ్వరరావు (బీఆర్‌ఎస్), కె.సుబ్బరాయన్ (సీపీఐ), రాజీవ్ రంజన్ సింగ్ (జేడీయూ), కకోలి ఘోష్ (టీఎంసీ), హర్‌సిమ్రత్ కౌర్ (ఎస్‌ఏడీ), కేంద్ర మంత్రులు అమిత్ షా, స్మృతి ఇరానీ, రామ్ క్రిపాల్ యాదవ్, హీనా గావిట్ (బీజేపీ), అనుప్రియ పటేల్ (అప్నాదళ్) తదితరులు మాట్లాడారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా 2.03 గంటల పాటు మాట్లాడారు.

## 'అవినీతికి ప్రతిరూపం ఇండియా కూటమి'

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిరూపం" అని ప్రతిపక్ష కూటమి పేరును ఉద్దేశించి ఆరోపించారు. మణిపూర్ విడిపోలేదన్నారు. మణిపూర్ దేశంలో అంతర్భాగమన్నారు. దేశంలో ఎంతో మందిని హత్య చేసిన చరిత్రగల కాంగ్రెస్ దేశాన్ని హత్య చేసినట్టు చెప్పడంలో అర్థం లేదన్నారు. దేశం పట్ల తమకు చిత్తశుద్ధి ఉందని, కాంగ్రెస్ పార్టీకి అటువంటి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మణిపూర్‌ను ఎవరూ విభజించలేరని, ముక్కలు చేయలేరని స్పష్టం చేశారు.

## మణిపూర్ సీఎంను మార్చాల్సిన అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని మార్చాల్సిన అవసరం లేదనిహింసను విస్మరించాలని మెయిటీ, కుకీ రెండు వర్గాలకు విజ్ఞప్తి చేశారు. 150 మందికి పైగా మరణించిన జాతి కలహాలు చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించబడతాయని అన్నారు. మణిపూర్ సంఘటన "అవమానకరం". కాగా దానిపై రాజకీయాలు "మరింత సిగ్గుచేటు" అని అన్నారు.

**అవిశ్వాసానికి ఆస్కారమే లేదు..**

ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఒక్క సరైన అంశం కూడా లేదని ఇంతవరకూ జరిగిన చర్చతో రుజువైందన్నారు. ప్రధానిపై, కానీ ప్రభుత్వంపై కానీ అసలు అవిశ్వాసమన్నదే లేదని, లేనిదాన్ని ఉన్నట్టు చూపించే ఒక భ్రమను సృష్టించేందుకే అవిశ్వాస తీర్మానం తెచ్చారని విమర్శించారు. దేశ ప్రజలకు, పార్లమెంట్‌కు నరేంద్ర మోడీపై పరిపూర్ణ విశ్వాసం ఉందన్నారు.

**మోడీ చారిత్రక నిర్ణయాలు..**

మోడీ ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుందని, ఆనువంశిక పాలన, లంచాల సంస్కృతికి చరమగీతం పాడిందని అమిత్ షా అన్నారు. అధికారం కాపాడుకోవడం కోసం యూపీఏ పాకులాడితే, సిద్ధాంతాల పరిరక్షణ కోసం ఎన్డీఏ పోరాడుతోందని చెప్పారు. గతంలో రాజీవ్ గాంధీ కేంద్రం నుంచి రూ.1 పంపితే...పేదలకు రూ.15 పైసలే చేరుతున్నాయని అన్నారని, కానీ ఇవాళ కేంద్రం నుంచి ప్రతి పైసా పేదలకు వెళ్తోందని అన్నారు. తాము కాశ్మీర్ యువత గురించి మాట్లాడతామే కానీ, జమాతే, పాకిస్థాన్ గురించి మాట్లాడమని అన్నారు. ఒక దశలో అమిత్ షా ప్రసంగానికి ప్రతిపక్షాలు అడ్డుపడటంతో ఆయన ఘాటుగా స్పందించారు. "మీ పార్టీ మిమ్మల్ని ఎలాగూ మాట్లాడనీయదు, నా ప్రసంగాన్ని మీరెందుకు అడ్డుకుంటారు. కూర్చోండి" అన్నారు. దీంతో అధికార పార్టీ సభ్యుల బల్లలు చరుస్తూ నవ్వులు చిందించారు.

## న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ఫ్లాటు జప్తు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. కాగా చైనా ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్న అమెరికా కోటీశ్వరుడు నెవిల్లే రాయ్ సింఘమ్ నుంచి న్యూస్‌క్లిక్‌కి నిధులు అందుతున్నాయని న్యూయార్క్ టైమ్స్‌లో ఈ వారం ఓ వార్త వచ్చింది. అయితే దీనిని న్యూస్‌క్లిక్ తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు నిరాధారమని, వాటికి ఎలాంటి ప్రాతిపదిక లేదని తెలిపింది.

మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద రూ.4.52 కోట్ల విలువ కలిగిన ఆస్తిని ఈడీ జప్తు చేసింది. పోర్టల్‌ను నడుపుతున్న కంపెనీలో రూ.86 కోట్ల విదేశీ సొమ్ము చేరిందంటూ వచ్చిన ఆరోపణపై ఈడీ దర్యాప్తు జరుపుతోంది. వివిధ సంస్థలకు సేవలు అందించినందుకు తమ సంస్థలో ఈ సొమ్ము జమ అయిందని న్యూస్‌క్లిక్ పోర్టల్ తెలిపింది.

## గడప, గడపకు యూత్ కాంగ్రెస్

- రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గడప, గడపకు యూత్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి సెప్టెంబర్ 30 వరకు నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు ప్రతి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ దిమ్మలను నిర్మించి జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు.

# ఆత్మ నిర్భర్ భారత్ సాధ్యమేనా?

## విదేశీ మారక ద్రవ్య ఆదాయానికి గండి

- అదుపు తప్పనున్న ద్రవ్యోల్బణం
- కంప్యూటర్ పరికరాల దిగుమతులపై ఆంక్షల ప్రభావం




**న్యూఢిల్లీ :** కంప్యూటర్ పరికరాల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఆంక్షలు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపబోతున్నాయి. విదేశీ మారక ద్రవ్య ఆదాయానికి భారీగా గండి పడడంతో పాటు సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు పడిపోతాయి. పోటీతత్వం బలహీనపడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పుతుంది. మొత్తంగా మోడీ ప్రవచిస్తున్న ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా ప్రచారానికే పరిమితమవుతాయి. విమర్శలు వెల్లువెత్తడంతో ఆంక్షలపై ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ నవంబర్ 1వ తేదీ నుండి ఆ ప్రమాదం పొంచి ఉంది.

**ఆంక్షలు...నిరసనలు...సమర్థింపులు**

ఈ నెల మూడున ప్రభుత్వం దిగ్భ్రాంతికరమైన నిర్ణయం తీసుకుంది. అదేమిటంటే లాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్లు, సర్వర్లు వంటి పరికరాల దిగుమతులను 'ఆంక్షల' జాబితాలో చేర్చింది. అంటే లైసెన్స్ ఉంటేనే వాటి దిగుమతులను అనుమతిస్తారు. ఇందుకు కొన్ని చిన్న చిన్న మినహాయింపులు ఇచ్చినప్పటికీ అన్ని కంప్యూటర్ పరికరాలు తక్షణమే ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చాయి. దీనిపై వివిధ వర్గాల నుండి నిరసన వ్యక్తం కావడంతో మంత్రులు, అధికారులు వివరణలు ఇవ్వడం మొదలు పెట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ నినాదమైన 'ఆత్మ నిర్భర్ భారత్'కు అనుగుణంగా కంప్యూటర్ పరికరాల తయారీలో దేశం స్వయం సమృద్ధి సాధించడానికి ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. పనిలో పనిగా భద్రతా పరమైన అంశాలను కూడా ముందుకు తెచ్చారు. అయితే ఈ సమర్థింపులు ఏవీ విమర్శల జడివానను ఆపలేకపోయాయి.

**సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులలో పురోగతి**

దేశంలోని కంప్యూటర్ హార్డ్‌వేర్ తయారీ పరిశ్రమ చాలా చిన్నది. సెమీ కండక్టర్ చిప్‌లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, విడిభాగాల కోసం దిగుమతుల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాము. కంప్యూటర్ పరికరాలను ఉత్పత్తి చేసే సామర్ధ్యం మనకు లేదు. అవసరమైన వాటిని దిగుమతి చేసుకొని, తయారీలో ఉపయోగించుకోవడానికే పరిమితమవుతున్నాము. ఈ విషయంలో కూడా దేశీయంగా పోటీ లేదు. అయితే ప్రపంచ దేశాలు ఉత్పత్తి చేస్తున్న కంప్యూటర్ పరికరాలను దిగుమతి చేసుకొని వాటిని ఉపయోగించడం ద్వారా ఐటీ సేవల ఎగుమతి పరిశ్రమను పెద్ద ఎత్తున నిర్మించుకోవడంలో మాత్రం గత పాతిక సంవత్సరాలుగా విజయం సాధిస్తున్నాము. ఐటీ సాఫ్ట్‌వేర్ సేవలను భారీగా ఎగుమతి చేస్తున్నాము. ఆర్‌బీఐ సమాచారం ప్రకారం 2021-22లో సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతుల ద్వారా మన దేశం 122 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించింది. కంప్యూటర్ పరికరాలు దిగుమతి చేసుకోవడం వల్ల అవుతున్న వ్యయంతో పోలిస్తే సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులు 10 రెట్లు అధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి పెడుతున్నాయి. 2021- 22లో మన దేశం నుండి ఎగుమతి అయిన మొత్తం సేవల లో ఒక్క సాఫ్ట్‌వేర్ సేవలే 48% వరకూ ఉన్నాయి. వస్తువు లు, సేవల మొత్తం ఎగుమతులలో ఈ సేవల వాటా 18%.

**ఏం జరుగుతుంది?**

కంప్యూటర్ పరికరాల స్వేచ్ఛా దిగుమతు లపై ప్రతిపాదిత ఆంక్షల కారణంగా సాఫ్ట్‌వేర్ సేవల్లో మన పోటీతత్వం బల హీనపడుతుంది. ఫలితంగా ఆ సేవల ఎగు మతులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. విదేశీ మారక ద్రవ్యాన్ని పెద్ద ఎత్తున ఆర్జించి పెడుతున్న సాఫ్ట్‌వేర్ సేవల ఎగుమతులకు తెలిసి తెలిసి ఎందుకు నష్టం కలిగిస్తున్నామనే విషయం ప్రభుత్వానికే తెలియాలి.

**ఇప్పుడు అదుపులోనే ఉన్నా...**

దేశీయ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ పరిశ్రమ తన ఉత్పత్తుల ధరలను పెంచలేకపోతోంది. ఆంక్షలు లేని సరళీకృత దిగుమతి విధానమే దీనికి కారణం. స్వేచ్ఛా దిగుమతుల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది. గత దశాబ్ద కాలంగా ఈ రంగంలో ద్రవ్యోల్బణం ఏటా 1.5%గానే ఉంటోంది.

అదే ఇతర ఉత్పత్తుల విషయానికి వస్తే ద్రవ్యోల్బణం మూడు శాతానికి పైగానే ఉంటోంది. ద్రవ్యోల్బణం అతి తక్కువగా ఉన్న రంగాలలో తోలు ఉత్పత్తుల తయారీ మొదటి స్థానంలో ఉండగా సాఫ్ట్‌వేర్ సేవలు రెండో స్థానంలో నిలిచాయి. ప్రభుత్వం నిర్బంధ లైసెన్సింగ్ నోటిఫికేషన్ విడుదల చేయగానే కంప్యూటర్ పరికరాలను తయారు చేసే కొందరు స్థానిక ఉత్పత్తిదారుల షేర్ల ధరలు పెరగడం ప్రారంభించాయి. బడా దిగుమతిదారుల షేర్ల ధరలూ పెరిగాయి.

మన దేశానికి దిగుమతి అవుతున్న కంప్యూటర్ పరికరాలలో 60% చైనాకు చెందినవే. కంప్యూటర్ హార్డ్‌వేర్ రంగంలో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చింది. అయితే ఇవి ఫలప్రదం కావడానికి చాలా కాలం పడుతుంది. అప్పటి వరకూ ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇస్తేనే మంచిది.

**ఆంక్షలు వాయిదా**

ఈ నెల 4వ తేదీ రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత...అంటే ఆంక్షలు విధించిన మరునాడు...ప్రభుత్వం తన నిర్ణయం నుండి వెనక్కి తగ్గింది. దిగుమతి చేసుకునే పరికరాలకు విధిగా లైసెన్స్ ఉండాలన్న నిబంధన అమలును నవంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. ఏ విధమైన లైసెన్స్ లేకపోయినా అక్టోబర్ 31 వరకూ దిగుమతులను అనుమతిస్తామని ప్రకటించింది. ఏది ఏమైనా ఒకప్పటి లైసెన్స్ రాజ్‌ను 'డిజిటలీకరణ' పేరిట తిరిగి పట్టాల పైకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. కంప్యూటర్ పరికరాల దిగుమతిలో లైసెన్స్ రాజ్‌ను ప్రవేశపెట్టడం వల్ల భారత్‌ను ఆత్మ నిర్భర దేశంగా మార్చాలన్న లక్ష్యం నెరవేరుతుందా? దేశ భద్రతా ప్రయోజనాలు పరిరక్షించబడతాయా?

# మణిపూర్‌లో భారతమాత హత్య

(మొదటిపేజీ తరువాయి)

హత్య చేశారు. మణిపూర్‌ప్రజలను హత్య చేయడంతో దేశాన్ని హత్య చేశారు. అందుకే మీ ప్రధాని మణిపూర్ వెళ్లడం లేదు. మీరు దేశ ప్రేమికులు కాదు. దేశ ద్రోహులు' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**మణిపూర్ రెండుగా విభజన**

ఇటీవలి తన మణిపూర్ పర్యటన అంశాలను, అక్కడ తనకు ఎదురైన అనుభవాలను రాహుల్ సభ దృష్టికి తీసుకెళ్లారు. 'కొన్ని రోజుల క్రితం మణిపూర్ వెళ్లాను. అక్కడికి ప్రధాని మాత్రం వెళ్లలేదు. ప్రధాని దృష్టిలో మణిపూర్ లేదు. నేను 'మణిపూర్' అనే పదాన్ని వాడాను. కాని ఇకపై మణిపూర్ ఉండదు. దానిని రెండుగా విభజించారు. బీజేపీ ప్రభుత్వం దానిని రెండుగా విభజించి విచ్ఛిన్నం చేసింది' అని ధ్వజమెత్తారు. 'నేను మణిపూర్‌లోని సహాయ శిబిరాలకు వెళ్లాను. నేను అక్కడ ఉన్న మహిళలు, పిల్లలతో మాట్లాడాను. ఇది మన ప్రధాని ఇంతవరకు చేయలేదు. నేను అక్కడ ఒక మహిళను' అక్కా, నీకు ఏమైంది?' అని అడిగా, దీనికి ఆమె 'నాకు ఒకే కొడుకు ఉన్నాడు. నా కండ్ల ముందే అతనిని కాల్చిచంపారు. రాత్రంతా, నేను అతని మృతదేహంతో కూర్చున్నాను. ఆ తరువాత భయంతో నేను నా ఇంటిని విడిచిపెట్టాను. నా బట్టలు, ఓ ఫొటో మాత్రమే నా దగ్గరే ఉన్నాయి' అని ఆమె తెలిపిందని వివరించారు. అక్కడ ఉన్న మరొక స్త్రీని 'మీకు ఏమైంది?' అని అడగగానే, ఆమెకు జరిగింది గుర్తుకు వచ్చి వణికిపోవడం మొదలుపెట్టి తరువాత మూర్ఛపోయింది'అని వివరించారు. మణిపూర్‌లో భారత్‌ను హత్య చేశారని, దేశం ప్రాణం తీశారని దుయ్యబట్టారు.

**దేశం మొత్తం కిరోసిన్ జల్లుతున్నారు**

'భారత సైన్యం ఒక్క రోజులో మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించగలదు. కానీ ప్రభుత్వం వారిని మోహరింపచేయుటం లేదు. ఎందుకంటే ప్రభుత్వం మణిపూర్‌లో దేశాన్ని హత్య చేయాలనుకుంటుంది. ప్రధాని మోడీ ఇద్దరి మాటలు మాత్రమే వింటున్నారు. రావణాసురుడు కేవలం మేఘనాధుడు, కుంభకర్ణుడి మాటలే వింటారు. అదే మాదిరి మోడీ కేవలం అదానీ, అమిత్ షాల మాటలే వింటారు' అని పేర్కొన్నారు. 'మీరు దేశం మొత్తం కిరోసిన్ పోస్తున్నారు. మణిపూర్‌లో అలా చేసి నిప్పులు రేపారు. హర్యానాలో కూడా అదే చేస్తున్నారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. రాహుల్ ప్రసంగం సాగినంత సేపు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, పరస్పర విమర్శల దాడి కొనసాగింది. ప్రతిపక్షాలు 'ఇండియా' అని నినాదాలు చేయగా, అధికార పక్ష సభ్యులు 'మోడీ..మోడీ' అంటు నినాదాలతో హెూరెత్తించారు. సభలో గందరగోళం ఏర్పడింది.

**స్పీకర్‌కు ధన్యవాదాలు**

అవిశ్వాస తీర్మానంపై రాహుల్ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ 'స్పీకర్ సార్, లోక్ సభలో నన్ను పునర్నియమించినందుకు ధన్యవాదాలు. గతంలో నేను మాట్లాడినపుడు, నేను అదానీ మీద, మీ సీనియర్ నేతల మీద ఎక్కువ దృష్టి పెట్టాను. అందువల్ల నేను బహుశా మిమ్మల్ని బాధించి ఉంటాను. ఈరోజు నేను అదానీ గురించి మాట్లాడను" అని చెప్పారు.

'క్షమాపణ చెప్పాల్సి' కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి భారత దేశ ఆత్మను ప్రభుత్వం హత్య చేసిందని, మణిపూర్‌లో భారత మాత హత్యకు గురైందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనే ఈశాన్య రాష్ట్రాలను అవమానిస్తున్నారని మండిపడ్డారు.

**వివాదంలో రాహుల్ గాంధీ**

రాహుల్ గాంధీ మరో వివాదంలో చిక్కుకున్నారు. లోక్ సభ నుంచి వెళ్లిపోతూ ఆయన మహిళా ఎంపీల వైపు చూస్తూ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు. మహిళలంటే ఇష్టపడనివారు మాత్రమే ఇటువంటి పనులు చేయగలరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మహిళా మంత్రులు, ఎంపిలు ఆయనపై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఆరోపణలలో ఎంత వాస్తవముందో అధికారులు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్, రాహుల్ గాంధీ తాను సభ నుంచి వెళ్తున్నట్టు అందరి చెప్పడానికి సైగు చేశారని, అంతేతప్ప ఆయన ఏఒక్కరిని ఉద్దేశించి ఫ్లయింగ్ కిస్ ఇవ్వలేదని తెలిపింది. అయితే రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చినట్టు తాను చూడలేదని బీజేపీ మహిళ ఎంపీ హేమమాలిని తెలిపారు.

## నుహ్, గురుగ్రామ్‌ల్లో నేడు సీపీఐ(ఎం) బృందం పర్యటన

**న్యూఢిల్లీ :** మతపరమైన హింసాకాండ చెలరేగిన నుహ్, గురుగ్రామ్‌ల్లో గురువారం సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం పర్యటించనుంది. బాధితులకు సానుభూతి, సంఘీభావం ప్రకటించనుంది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు నిలోత్పల్ బసు నేతృత్వంలోని ఈ బృందంలో పార్లమెంట్ సభ్యులు జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, వి.శివదాసన్ సభ్యులుగా ఉన్నారు.

**బీజేపీకి అనుమతి, ఆప్‌కు నో**

నుహ్‌లో బుధవారం బీజేపీ ప్రతినిధుల బృందం పర్యటించింది. అక్కడి అధికారులను కలుసుకుంది. అక్కడి ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకుంది. బీజేపీ బృందానికి ఆ పార్టీ హర్యానా రాష్ట్ర అధ్యక్షులు ఓం ప్రకాశ్ ధన్‌కర్ అధ్యక్షత వహించారు. కాగా, నుహ్‌లో పర్యటనకు బీజేపీ బృందానికి అనుమతించిన జిల్లా అధికారులు ఆప్ బృందాన్ని మాత్రం అడ్డుకున్నారు. నుహ్‌లో పర్యటనకు వెళుతున్న ఏడుగురు సభ్యులు ఉన్న ఆప్ బృందాన్ని రోజ్‌కా మో పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెవసన్ గ్రామం వద్ద పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. వెనక్కి పంపారు. బీజేపీ బృందాన్ని అనుమతించి తమను అడ్డుకోవడంపై ఆప్ నాయకులు మండిపడ్డారు. కాగా, మంగళవారం 10 మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్ బృందాన్ని కూడా నుహ్‌లో పర్యటించకుండా పోలీసులు అడ్డుకున్నారు. అంతకు ముందు ఆదివారం నలుగురు సభ్యులు ఉన్న సీపీఐ బృందాన్ని కూడా అధికారులు నిరోధించారు.

## గృహలక్ష్మి దరఖాస్తు గడువు పొడిగించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసేందుకు గడువు పొడిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జావేద్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసేందుకు మూడు రోజులే సమయం ఇవ్వడంతో అన్ని మండల కార్యాలయాల్లో కులం, ఇతర సర్టిఫికెట్లను తీసుకోవడానికి సమయం సరిపోవడం లేదని తెలిపారు. దీంతో అర్హులైన ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బార్ షాపుల టెండర్ల దాఖలుకు మాత్రం 15 రోజులపాటు సమయమిచ్చిన ప్రభుత్వం, గృహలక్ష్మి పథకానికి మూడు రోజులే ఇవ్వడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈనెల 30 వరకు గృహలక్ష్మి పథకం దరఖాస్తులను స్వీకరించాలని కోరారు.

# కేసీఆర్‌ను కలిసిన వనమా

## సుప్రీంకోర్టు స్టే నేపథ్యంలో

- నేడు కొత్తగూడెంలో భారీ ర్యాలీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు బుధవారం ప్రగతిభవన్ లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. గత నెల 25న ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొంటూ వనమాను హైకోర్టు అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు నిచ్చింది. జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా పరిగణిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై స్టే కోరుతూ తొలుత హైకోర్టును వనమా ఆశ్రయించగా గత నెల 27న నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై ఈనెల 7న స్టే విధించింది. 15రోజుల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అప్పటివరకు హైకోర్టు తీర్పు అమలు కుదరదని క్లారిటీ ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ తరుణంలోనే సీఎంను వనమా కలువడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే కొత్తగూడెం టికెట్ మరొకరికి క్లారిటీ ఇచ్చారని పార్టీ వర్గాలు పేర్కొంటున్న సమయంలోనే కేసీఆర్‌ను కలువడం హాట్ టాపిక్‌గా మారింది. గురువారం వనమా నేతృత్వంలో కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. హైకోర్టు తీర్పు తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న వనమా సుప్రీంకోర్టు తీర్పుతో కేడర్‌లో జోష్ నింపేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. కేసీఆర్‌ను కలిసిన సమయంలో వనమాతో పాటు సోదరుడు రామకష్ణ కూడా ఉన్నారు.

# రాజ్యసభలో నాలుగు బిల్లులు ఆమోదం

## రాజ్యసభలో ప్రతిపక్షాల వాకౌట్

- టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రెయిన్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని (క్విట్ ఇండియా దివస్) స్మరించుకుంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు బుధవారం పార్లమెంట్ ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళుర్పించారు. అలాగే పార్లమెంట్ ఉభయ సభల్లో స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిస్తూ ఎంపీలు మౌనం పాటించారు. రాజ్యసభ ప్రారంభం కాగానే మణిపూర్‌పై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీనికి వ్యతిరేకంగా అధికార పక్ష ఎంపీలు నినాదాలు ఇచ్చారు. దీంతో చైర్మెన్ జగదీప్ ధన్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వైపుల సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. కానీ నినాదాలు హెూరెత్తించారు. దీంతో జగదీప్ ధన్కర్ మాట్లాడుతూ తనకు దు:ఖంగా ఉందని అన్నారు. వెంటనే 17 నిమిషాల్లోనే సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభ మైన సభలో రాజ్యాంగ (ఎస్‌సీ) ఆర్డర్ సవరణ బిల్లును చర్చకు పెట్టారు. అయితే ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు హెూరెత్తించారు. ప్రతిపక్ష నేతకు మాట్లా డేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 2.45 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ప్రధాని సభకి రావాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌పై వివరణాత్మక చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ రూల్ 267 కింద చర్చ జరగాలని, ప్రధాన మంత్రి సభకు రావాలని కోరుతున్నామని, ప్రభుత్వం కేవలం హెూం మంత్రి ఉంటారని చెబుతుందని, మీరే దీనికి ఒక మార్గం వెతకాలని కోరారు.. వెంటనే ఖర్గే మాట్లాడుతూ తమ డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించటం లేదని, కనుక తాము నిరసనగా వాకౌట్ చేస్తున్నామని తెలి పారు. అనంతరం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, రాజ్యాంగ (ఎస్‌సీ) ఆర్డర్ సవరణ బిల్లు, అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు, ఫార్మసీ (సవరణ) బిల్లు, తీర ఆక్వాకల్చర్ అథారిటీ (సవరణ) బిల్లులు మూజువాణి ఓటుతో ఆమోదించు కున్నారు. టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రెయిన్‌పై సస్పెన్షన్ ఎత్తి వేశారు.

మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం లోక్‌సభలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్షాల ప్రధాని మోడీ సమక్షంలో తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశాయి. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకొని ప్రధాని మోడీ నేడు (గురువారం) సభలో మాట్లాడతారని అన్నారు. అప్పుడే తీర్మానం పెట్టాలని ప్రతిపక్షాలు కోరాయి. అయితే స్పీకర్ ఓం బిర్లా తీర్మానం పెట్టడంపై సమ్మతించే వారు చేతులెత్తండని పేర్కొన్నారు. దీంతో అధికార సభ్యులంతా చేతులెత్తి తీర్మానానికి మద్దతు తెలిపారు. లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హెూరెత్తించారు. ప్రధాని మోడీ సభకు రావాలని, సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభ మైన సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగింది. రాహుల్ గాంధీ, ఎ.రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), కనిమొళి (డీఎంకే), ఈటి మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), మిథున్ రెడ్డి (వైసీపీ), నామా నాగేశ్వరరావు (బీఆర్‌ఎస్), కె.సుబ్బరాయన్ (సీపీఐ), రాజీవ్ రంజన్ సింగ్ (జేడీయూ), కకోలి ఘోష్ (టీఎంసీ), హర్‌సిమ్రత్ కౌర్ (ఎస్‌ఏడీ), కేంద్ర మంత్రులు అమిత్ షా, స్మృతి ఇరానీ, రామ్ క్రిపాల్ యాదవ్, హీనా గావిట్ (బీజేపీ), అనుప్రియ పటేల్ (అప్నాదళ్) తదితరులు మాట్లాడారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా 2.03 గంటల పాటు మాట్లాడారు.

# బాసర ఆర్జీయూకేటీ వద్ద ఆందోళన

- విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- రాజకీయ పార్టీల నేతల డిమాండ్

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీ వద్ద బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేశారు. యూనివర్సిటీలో ఏడాది కాలంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర జన సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం నుంచి లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిం చగా పోలీసులు అడ్డుకున్నారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆనంద్‌రావు పటేల్, ఇతర నాయ కులను ప్రధాన ద్వారం వద్ద పోలీ సులు అడ్డుకొని అరెస్టు చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించక పోవడం, సమస్యలపై తల్లి దండ్రులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసు కెళ్లినా పరిష్కారానికి మొగ్గు చూపడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో చదువుతున్న పేద ప్రజల బిడ్డలు ఆత్మహత్య చేసుకుంటున్నా మంత్రులు, అధికారులు భద్రత చర్యలు తీసుకోవడంలో విఫలమ య్యారని అన్నారు.

### బాసర ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరపాలి - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాసర ట్రిపుల్ ఐటీలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఏడాది బబ్లూ ఆత్మహత్యతో ఇది నాలుగోదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు చనిపోతున్నా విశ్వవిద్యాలయ అధికారులు, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించి సమగ్రమైన విచారణ జపించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.




విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ముథోల్ ఇన్‌చార్జి ఆనంద్‌రావు పటేల్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణకు కమిటీల పేరుతో కాలయాపన చేయడం తప్ప సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి నేపథ్యంలో ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం వద్ద పోలీసు బలగాలను భారీగా మోహరించారు. తనిఖీలు చేసిన తర్వాతే యూనివర్సిటీలోకి అనుమతిస్తున్నారు.

## 'గృహలక్ష్మి'కి రేషన్ కార్డుదారులందరూ అర్హులే!

- ప్రత్యేక దరఖాస్తులు ఫారాలు ఏమీలేవు
- ఖాళీ తెల్లకాగితంపై దరఖాస్తు రాసి ఇస్తే సరిపోతుంది
- ఈ పథకం నిరంతర ప్రక్రియ : గంగుల

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఇప్పటికే నిరుపేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తున్న ప్రభుత్వం సొంత జాగ ఉండి.. ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. ఆహారభద్రత కార్డు ఉన్నవారందరూ ఈ స్కీమునకు అర్హులే' అని బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీ బంధు, సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాల అమలుపై కరీంనగర్ కలెక్టరేట్‌లో బుధవారం ఆయా శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలు చేస్తామని చెప్పారు దరఖాస్తు కూడా సులభతరంగానే ఉంటుందన్నారు. స్లాబ్ ఇల్లు ఉన్నవారు, జీఓ 59కింద లబ్దిపొందిన వారు అనర్హులని తెలిపారు. గృహలక్ష్మి కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారమ్ అంటూ ఏదీ లేదని, సోషల్ మీడియాలో వైరలవుతున్న ఫారమ్‌తో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. తెల్లకాగితంపై రాతపూర్వకంగా దరఖాస్తు రాసి ఆహార భద్రత కార్డు, అధార్, ఓటరు గుర్తింపు కార్డులతో కలిసి గ్రామీణ ప్రాంతాలవారు తహసీల్దార్‌కు, పట్టణాల వారు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ ఇవ్వాలని సూచించారు. గ్రామ కంఠంలో ఉన్న పాత ఇల్లుగానీ, స్థలాలకుగానీ దస్తావేజు పేపర్లు ఉండవని, ఇంటి నంబర్ అయినా సరే.. లేకుంటే ఖాళీ స్థలం ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ఈ పథకం మహిళ పేరుతో అందిస్తామని, అయితే స్థలం మహిళ పేరుతో ఉండాల్సిన అవసరం లేదన్నారు. పథకం కోసం మహిళ పేరిట బ్యాంకు అకౌంట్ తీయాల్సి ఉంటుందని చెప్పారు. లబ్దిదారుల ఎంపికను జిల్లా మంత్రి, కలెక్టర్ రూపొందిస్తారన్నారు.ఇంటి నిర్మాణానికి ఎలాంటి షరతులూ లేవని, లబ్దిదారుడు ఇష్టమొచ్చిన ప్లాన్‌లో నిర్మించుకోవచ్చన్నారు. మొదటి విడతలో భాగంగా ఈ నెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించి, 20వ తేదీలోగా లబ్దిదారుల వెరిఫికేషన్ పూర్తిచేస్తామన్నారు. 25వ తేదీన మొదటి విడత లబ్దిదారులకు స్కీం అందిస్తామని చెప్పారు. లబ్దిదారుల్లో ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 10 శాతం, బీసీలు 50 శాతం.. వికలాంగులు 5 శాతం మించకుండా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నగర మేయర్ వై.సునీల్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్ సుంకె రవిశంకర్, సంతోష్ కుమార్, కలెక్టర్ డాక్టర్ బి.గోపి, అధికారులు పాల్గొన్నారు.

## ఆగుతూ.. సాగుతూ..

- చివరి దశకు మొదటి ఫేజ్ 'పాలమూరు రంగారెడ్డి' పనులు
- ఆగస్టు చివరికల్లా మోటార్లు ప్రారంభించే అవకాశం

నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మూడేండ్లలో పూర్తి కావాల్సిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఎనిమిదేండ్లుగా ఆగుతూ.. ముందుకు సాగుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు పనులు చివరి దశకు చేరుకున్నాయి. అయినా అనుకున్న లక్ష్యం పూర్తిగా నెరవేరలేదు. రెండు దశల్లో మొదలుపెట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనుల్లో భాగంగా నార్లాపూర్ దగ్గర మొదటి పేజ్ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకపోతే ఆగస్టు చివరికల్లా ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశాలు ఉన్నాయి. మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో ఈ ఖరీఫ్‌కి సాగునీరు అందించే లక్ష్యంతో పనులు చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చివరి దశకు చేరుకున్నది. అనేక ఒడిదుడుకులు, కోర్టు కేసులు, ఇరు రాష్ట్రాల మధ్య జలవివాదం వంటి సమస్యలను దాటి ముందుకెళ్లింది. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ తాగునీటి కోసం ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని చెప్పడంతో పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాదు నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో తాగునీరు, సాగునీరు అందించే లక్ష్యాలతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు వద్ద శ్రీశైలం జలాశయం నుంచి నీటిని తోడి, రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండలం, లక్ష్మీదేవిపల్లి వరకూ నీటి సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు.

సముద్ర మట్టం నుంచి 269.735 మీటర్ల ఎత్తున ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి 5 అంచెల్లో ఎత్తిపోసి 670 మీటర్ల ఎత్తున ఉన్న లక్ష్మీదేవిపల్లి జలాశయానికి నీటిని చేరుస్తారు. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 5 లిఫ్టులు, 6 జలాశయాలు నిర్మిస్తున్నారు. రూ. 35,200 కోట్ల ఖర్చు అయ్యే ఈ ప్రాజెక్టుకు 2015 జూన్ 10న రాష్ట్ర ప్రభుత్వం మొదలెట్టింది. ఆ తరువాత బడ్జెట్ అంచనాను రూ.50 వేల కోట్లకు పెంచారు. ప్రాజెక్టును రెండు దశల్లో నిర్మిస్తున్నారు. మొదటి దశలో - మొత్తం నీటిని తరలించడానికి పంపుహౌసులు, జలాశయాలు, పైపులైన్లు, కాల్వలు, సొరంగాలు నిర్మించి, తాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలూ తీర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండో దశలో సాగునీటిని అందించేందుకు అవసరమైన కాలువలు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. ప్యాకేజీ 1లో రూ.4300 కోట్లు కేటాయించారు. ఎనిమిది మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తారు. ఒక్కో మోటారుకు 145 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. 8 మోటార్లు నడిస్తే సరిపడే కాలువలు నిర్మించారు. 120 టీఎంసీల నీటిని తోడేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

నార్లాపూర్‌తోపాటు ఏదుల వట్టెం కరివేనా ఉద్దండపూర్ రిజర్వాయర్లతోపాటు లక్ష్మీదేవిపల్లి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు జరగడం లేదు. కరివేన, వట్టెం, ఉదండాపర్ రిజర్వాయర్ పనులు కోర్టు కేసుల వల్ల ఆలస్యంగా జరుగు తున్నాయి. ఏదుల రిజర్వాయర్ పూర్తి కావడంతో మోటార్లు ప్రారంభిస్తే నీటిని నింపే అవకాశాలున్నాయి. పాలమూరు -రంగారెడ్డి లిఫ్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా టన్నెల్ సొరంగం సర్జి ఫుల్ పంప హౌజులు పూర్తయ్యాయి. ఈ నెల చివరికల్లా నీళ్ల వదిలేలా పనులు జరుగుతున్నాయి. విద్యుత్తు సరఫరా పనులు జరగాల్సి ఉంది.

**ఖరీఫ్‌కు సాగునీరు అందించాలి**

శ్రీనివాసులు, రైతు సంఘం నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పూర్తి చేయాలి. ఖరీఫ్‌లోనే సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. ఏడాది వర్షాలు మందగమనంలో ఉన్నాయి. ఆయకట్టు రైతులను ఆదుకోవాలి.

## టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- జాతీయ కార్యదర్శి కాసాని విరేష్
- ఎస్టీ సెల్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-హైదరాబాద్

టీడీపీని బలోపేతం చేయడానికి అన్ని అనుబంధ విభాగాలు పట్టుదలతో పనిచేయాలని తెలుగుదేశం జాతీయ కార్యదర్శి కాసాని విరేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆ పార్టీ అనుబంధ విభాగమైన ఎస్టీ సెల్ ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్లో నిర్వహించారు. ఆ విభాగం నూతన అధ్యక్షుడుగా కె.గోపి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కాసాని విరేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ అదివాసుల దినోత్సవ గిరిజన విభాగం నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజనుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన చరిత్ర టీడీపీదని గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయాంలో రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల వెల్లువ నడిచిందన్నారు. రాజకీయ, సామాజిక మార్పుకు నాంది పలికారని అభిప్రాయపడ్డారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పార్టీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. భవిష్యత్తులో కూడా మీరు మంచి నాయకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు అజ్మీరా రాజునాయక్, ఆరీఫ్, జీవీజీ నాయుడు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులు పెద్దోజు రవీంద్రచారి, మండూరి సాంబశివరావు, బిక్షపతి ముదిరాజ్, రేజండ్ల కిషోర్, తెలుగు మహిళా అధ్యక్షురాలు షకీలారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షులు కె. అశోక్ కుమార్ గౌడ్, నల్లగొండ పార్లమెంట్ అధ్యక్షులు కశిరెడ్డి శేఖర్ రెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ అధ్యక్షులు ఎం. శ్రీనివాస్ , ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కె. జోగేందర్ సింగ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు మాధవీలత ,చక్రపాణి, కట్ట వెంకటేష్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే మొదటి సీఓఈ

### ఆహారభద్రత మెరుగుపర్చడంలో కీలకం

- ఎగుమతులను పెంచడానికి దోహదం: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'దేశంలోనే మొట్టమొదటిసారిగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)ని ప్రారంభించాం. ఇది అత్యాధునిక పరికరాలను కలిగి ఉంటుంది. కోల్డ్ చైన్ ఎకోసిస్టమ్ చుట్టూ ఉన్న అన్ని సవాళ్లను పరిష్కరించడానికి ఒక స్టాప్ పరిష్కారంగా ఉపయోగపడుతుంది. ఇది రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా శీతలీకరణ సాంకేతికతలు, పరిష్కారాలను అభివద్ధి చేస్తుంది. ప్రపంచ స్థాయికి చేరువయ్యేలా చేస్తుంది. హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాల యానికి, క్యారియర్‌తో సహా ఈ చొరవకు మద్దతు ఇచ్చినందుకు పరిశ్రమ భాగస్వాములకు ధన్యవాదాలు' అని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సస్టైనబుల్ కూలింగ్ అండ్ కోల్డ్-చైన్ కోసం తెలంగాణ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో సుస్థిర శీతలీకరణ ఆవిష్కరణలను ప్రోత్సహిం చడానికి, ఆహారం, వ్యాక్సిన్ సరఫరా గొలుసుల కోసం ఇంధన-సమర్థవంతమైన శీతలీకరణ విస్తరణను వేగవంతం చేయడానికి సీఓఈని శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని జీఎంఆర్ ఇన్నోవేషన్స్ క్యాంపస్‌లో మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సొల్యూషన్స్ డెవలప్‌మెంట్ ల్యాబ్, డెమాన్‌స్ట్రేషన్ సెంటర్, మోడల్ ప్యాక్-హౌస్, కమ్యూనిటీ కూలింగ్ హబ్‌లు ఉంటాయన్నారు. ఇది తెలంగాణలోని రైతుల జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని భావిస్తున్నానని తెలిపారు. చాలా మంది రైతులు శీతల గిడ్డంగులు అందుబాటులో లేకపోవడంతో పాడైపోయే ఉత్పత్తులను అమ్ముకోలేకపోతున్నారని, రైతులు పాడైపోయే ఉత్పత్తులను సంరక్షించడం, వస్తువుల నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడే పరిష్కారాలతో సీఓఈ ముందుకొస్తున్న దని చెప్పారు. 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను స్వీకరించడం ద్వారా, రైతులు, స్థానిక వ్యవసాయ వ్యాపారాలు, అగ్రి స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు, పరికరాల సాంకేతిక నిపుణులు, పరిశోధకులకు సీఓఈ నైపుణ్యం, శిక్షణా కార్యక్రమాలను అందిస్తుందన్నారు. తెలంగాణ ప్రస్తుతం విలువైన ఫార్మా, వ్యాక్సిన్ ఎగుమతులను ఎగుమతి చేస్తోందన్నారు. ఇవి సమర్థవంతమైన కోల్డ్ చైన్ ఎకోసిస్టమ్‌పై ఆధారపడి ఉన్నాయని, వ్యాక్సిన్, ఫార్మా కోల్డ్ చైన్ కోసం కొత్త, స్థిరమైన సాంకేతికతలపై కేంద్రం దష్టి సారిస్తుందని, రాష్ట్రం నుంచి వ్యాక్సిన్ ఎగుమతుల మరింత వృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఆహారం, ఆరోగ్య భద్రతను ప్రోత్సహించడం, రైతులను బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం కోసం సస్టైనబుల్ కూలింగ్, కోల్డ్ చైన్ కోసం తెలంగాణ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్(టీఎస్‌టీపీసీ), సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కూలింగ్(సీఎస్‌సీ), బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్ఈపీ), జీఎంఆర్ గ్రూప్‌ల మధ్య ఉమ్మడి చొరవ అని తెలిపారు.

2022లో తెలంగాణ ప్రభుత్వం, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ఫలితమేనని అన్నారు. బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ ఓవెన్స్, సెంటర్ ఆఫ్ సస్టెయినబుల్ కూలింగ్(బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం) డైరెక్టర్ ప్రొఫెసర్ టోబిపీటర్స్, టీఎస్‌టీపీసీ చైర్మెన్ బిక్షపతి, పరిశ్రమ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జీహెచ్ఐఏఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్, సస్టైనబిలిటీ, క్యారియర్ గ్రూప్ డైరెక్టర్ జిమ్మీ వాషింగ్టన్, సీనియర్ అధికారులు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలే

## ప్రయివేటీకరణను ఆపాయి

### టీఎస్‌పీఈఏ కన్వీనర్ రత్నాకరరావు




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో విద్యుత్‌రంగ ప్రయివేటీకరణను ఉద్యోగుల సంఘటిత ఆందోళనలే నిలుపుదల చేశాయని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) కన్వీనర్ పీ రత్నాకరరావు అన్నారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సీసీఓఈఈఈ) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారంనాడిక్కడి తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయం ఎదుట ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యుత్ ఉద్యోగుల మెడపై ప్రయివేటీకరణ కత్తి వేలాడుతూనే ఉందనీ, ఎప్పటికప్పుడు దాన్ని సంఘటితంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కో-చైర్మెన్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రయివేటీకరణ బిల్లును ఆపకపోతే ఉద్యోగ భద్రత ఉండదనీ, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎప్పటికప్పుడు ఆందోళనల ద్వారా నిరసనలు తెలపాలన్నారు. కో కన్వీనర్ బీసీ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా ఆపాలంటే ఉద్యమాలే శరణ్యమన్నారు. 1104 యూనియన్ నాయకులు వరప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లును ఆపేందుకు కార్మిక లోకం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకన్న (బీసీ అసోసియేషన్), సుధాకర్ రెడ్డి (ఓసీ అసోసియేషన్), రాంజీ (ఎస్టీ అసోసియేషన్), ఈశ్వర్ గౌడ్ (అకౌంట్స్ అసోసియేషన్), జ్యోతి రాణి (ఉమెన్స్ అసోసియేషన్) తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విలీనంపై అధ్యయనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంపై అధ్యయనం చేసేందుకు టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలోని అధ్యయన బృందం విజయవాడకు వెళ్లింది. ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులను ఇప్పటికే అక్కడి రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విలీనం తర్వాత అక్కడి కార్మికుల పని, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి, వాటిలో అవసరమైన మార్పులు, చేర్పుల్ని సూచించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్య దర్శి కే రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావుతో టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యయన బందం బేటీ అయ్యింది. పలు అంశాలపై వివరణలు అడిగి తెలుసుకున్నామనీ, ఇతర సంఘాలు, అధికారుల్ని కూడా కలిసి వారి అభిప్రాయాలు కూడా తెలుసుకొని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అధ్యయన నివేదిక సమర్పిస్తామని రాజిరెడ్డి తెలిపారు.

### ఇంజినీరింగ్‌లో 70,627 మందికి

# సీట్ల కేటాయింపు

### ఇంకా మిగిలిన 13,139 సీట్లు

- కాలేజీల్లో చేరే గడువు 12
- ఎంసెట్ తుదివిడత సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో బుధవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 174 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,766 సీట్లున్నాయని వివరించారు. వాటిలో తుదివిడత కౌన్సెలింగ్ నాటికి 70,627 (84.31 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు.



ఇంకా 13,139 (15.69 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. రెండోవిడత నాటికి 62,738 మంది అభ్యర్థులు కాలేజీల్లో చేరారని వివరించారు.

తుదివిడతలో 21,028 సీట్లు అందుబాటులో ఉన్నాయనీ, 7,889 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయక పోవడం వల్ల 2,575 మందికి సీట్లు కేటాయిం చలేదని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 5,480 మంది అభ్యర్థులు సీట్లు పొందారని వివరించారు. మూడు విశ్వవిద్యాలయ, 27 ప్రయివేటు కాలేజీలు కలిపి మొత్తం 30 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు.

అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలనీ, ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజును చెల్లించాలని కోరారు. ఈనెల 11 వరకు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

ఈనెల 12 నాటికి కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని తెలిపారు. లేదంటే కేటాయించిన సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. సీట్ల కేటాయింపు, ఇతర వివరాలకు **https://tseamcet.nic.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈనెల 17 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

### కంప్యూటర్ సైన్స్‌కే ఫుల్ డిమాండ్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. సివిల్, మెకానికల్ వంటి కోర్సులకు ఆదరణ తగ్గుతున్నది. వాటిలో చేరేందుకు అభ్యర్థులు ఆసక్తిని కనబరచడం లేదు. ఎంసెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల తుదివిడత కౌన్సెలింగ్‌లో సీఎస్ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 56,811 సీట్లుంటే, 53,034 (93.35 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వాకాటి కరుణ తెలిపారు. 3,777 (6.65 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో 17,567 సీట్లకుగాను 13,417 (76.38 శాతం) మందికి కేటాయించామని వివరించారు. ఇంకా 4,150 (23.62 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 8,187 సీట్లుంటే 3,457 (42.23 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంకా 4,730 (57.77 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 1,209 సీట్లకుగాను 719 (59.47 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 490 (40.53 శాతం) సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు

## 'గృహలక్ష్మి' నిరంతర ప్రక్రియ : మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'గృహలక్ష్మి' పథకం నిరంతర ప్రక్రియ దరఖాస్తుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారంతో తొలి విడత గడువు ముగియనున్న నేపథ్యంలో మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 3లక్షలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని నిరంతరాయంగా అమలు చేస్తామన్నారు. గ్రామకంఠంలో ఉన్న పాత ఇండ్లు, స్థలాలకు దస్తావేజు పేపర్లు ఉండవనీ, ఇంటి నంబర్ లేకుంటే ఖాళీ స్థలం ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి వివరించారు. దరఖాస్తు గడువు అయిపోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుదారులు తమ ప్రజాప్రతినిధులతో జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు పంపించవచ్చని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ప్రస్తుతం మొదటి దశలో 3000 ఇండ్లు పూర్తయిన తర్వాత రెండో దశలో ఇచ్చే 'గృహలక్ష్మి' కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దశల వారీగా అర్హులైన పేదల ఇంటి నిర్మాణం కోసం ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



నవతెలంగాణ -వలిగొండ రూరల్

ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ప్రొద్దటూరులో బుధ వారం జరిగింది. ఇందుకు సంబం ధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రొద్దటూరుకు చెందిన బత్తుల శ్రీనివాస్(48) తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో జారి కిందపడ్డాడు. దాంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందజేశారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

సంపాదకీయం

# ఒక్కో రీతిన సర్కారు తీరు..

స్వరాష్ట్ర ఉద్యమ సమయంలో ముందు భౌగోళిక తెలంగాణ రావాలి.. ఆ తర్వాత సామాజిక తెలంగాణ సాధిద్దామంటూ ఉద్యమ నాయకులు, మేధావులు అప్పట్లో దిశా నిర్దేశం చేశారు. అటు తర్వాత పరిణామ క్రమంలో ప్రజాస్వామిక తెలంగాణ కలను సాకారం చేసుకుందామంటూ ఇటు అభ్యుదయవాదులు.. అటు ప్రజలు ఆశించారు.. ఆకాంక్షించారు. ఆ తర్వాత తెలంగాణ వచ్చింది. దశాబ్ది ఉత్సవాలను కూడా పూర్తి చేసుకున్నాం. అనేక రంగాల్లో రాష్ట్రం రాకెట్ వేగంతో దూసుకుపోతున్నదంటూ ప్రభుత్వం ప్రకటిస్తూ వస్తోంది. విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర విషయాల్లో మనకెవరూ లేరు పోటీ మనకు మనమే సాటి అనుకుంటూ ఏలికలు ఒకటికి పదిసార్లు నొక్కి చెబుతున్నారు.

> కేంద్రంలోని బీజేపీ... ప్రజల పట్ల, ప్రజాస్వామికవాదుల పట్ల అనుసరిస్తున్న తీరును ఎండగడుతున్న కారు పార్టీ.. ఇక్కడ రాష్ట్రంలో అదే తరహాలో వ్యవహరిస్తుండటం ఆశ్చర్యమే కాదు విస్మయపరిచే అంశం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కొన్ని ఆందోళనల సమయంలో ప్రభుత్వం అనుసరించిన పద్ధతి... ఇలాంటి అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది.

ఈ ఒరవడిలోనే దేశంలో మోడీ సర్కారు అనుసరిస్తున్న మతోన్మాద, నియంతృత్వ, రాజ్యాంగ వ్యతిరేక పోకడలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాధినేత ఎండగడుతూ వస్తున్నారు. ఈ అంశాలపై పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై బీఆర్ఎస్ సంతకం కూడా పెట్టింది. దీనికి మనం ఆ పార్టీని అభినందించాల్సిందే. కానీ కేంద్రంలోని బీజేపీ... ప్రజల పట్ల, ప్రజాస్వామికవాదుల పట్ల అనుసరిస్తున్న తీరును ఎండగడుతున్న కారు పార్టీ.. ఇక్కడ రాష్ట్రంలో అదే తరహాలో వ్యవహరిస్తుండటం ఆశ్చర్యమే కాదు విస్మయపరిచే అంశం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కొన్ని ఆందోళనల సమయంలో ప్రభుత్వం అనుసరించిన పద్ధతి... ఇలాంటి అనుమానాలకు, ఆరోపణలకు తావిస్తోంది.




ఓ నెలన్నర క్రితం ఉచిత విద్యుత్‌కు సంబంధించి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. నిరసనలకు అది పిలుపునిచ్చింది. ఆ సందర్భంగా అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్సీ ఖైరతాబాద్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. వందల సంఖ్యలో కార్యకర్తలు వెంటరాగా... దాదాపు రెండు గంటలపాటు ఆ ఆందోళనను కొనసాగించారు. పోలీసులు దగ్గరుండి సదరు ఎమ్మెల్సీకి భద్రత కల్పించటమేగాక.. ధర్నాకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. సరిగ్గా అదే రోజు అదే సమయంలో వామపక్ష విద్యార్థి సంఘాలన్నీ కలిసి విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చాయి. హైదరాబాద్‌లో విద్యార్థి నాయకులు విద్యాశాఖ ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టేందుకు ఉద్యుక్తులయ్యారు. కానీ పోలీసులు వారిని ఒక్క అడుగు కూడా ముందుకు కదలనీయకుండా ఎక్కడిక్కడ అడ్డుకోవటం గమనార్హం. ఇటీవల ఆర్టీసీ సమస్యలపై కొన్ని సంఘాలు నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ ముట్టడికి బయల్దేరితే... పోలీసులు దగ్గరుండి మరీ వారిని అక్కడికి తీసుకుపోయారు. కావాల్సినంత భద్రతను కల్పించారు. అదే వారంలో మళ్లీ వామపక్ష విద్యార్థి సంఘాలు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తే... అదే పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేయటాన్ని మనం చూశాం. తాజాగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోకి విద్యార్థి సంఘాలు, మీడియాకు అనుమతి లేదంటూ ఉన్నతాధికారులు ఫత్వా జారీ చేయటం అత్యంత విడ్డూరం.

ఈ క్రమంలో ఏ అరెస్టులయినా.. ఎలాంటి ఉత్తర్వులయినా ప్రభుత్వాధినేతల అనుమతి లేనిదో జారీ కాబోవనేది మనందరికీ తెలిసిన సత్యం. అలాంటప్పుడు మనకు నచ్చిన వ్యక్తులు, యూనియన్ల పట్ల ఒకలా.. నచ్చని, సమస్యలపై పోరాడే సంస్థలు, సంఘాల పట్ల మరోలా వ్యవహరించటం ప్రభుత్వానికి ఔచిత్యం అనిపించుకోదు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు తమ కోర్కెల చిట్టాలను, నిరసన గళాలను విప్పేందుకు ఏకంగా ప్రధాన మంత్రి కార్యాలయాలు, అధినేతల రాజ భవనాల ముందే ఆందోళనలు చేపట్టటాన్ని మనం నిత్యం గమనిస్తూనే ఉంటాం. ఇటు పత్రికలు, అటు టీవీలు, సామాజిక మాధ్యమాల్లో అలాంటి వార్తలు ప్రముఖంగా వస్తూ ఉంటాయి. కానీ అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని చెప్పుకునే మన దగ్గర, మన రాష్ట్రంలో హక్కుల కోసం నినదించే వారిని తొక్కేయటాలు, నిరసన గళాలను నొక్కటమనేది వాంఛనీయం కాదు. ఇటీవల అరుణతారై నింగికెగిసిన గద్దరన్నతోపాటు ఎంతోమంది ప్రజా కవులు, కళాకారులకు పురుడు పోసిన నేల ఈ తెలంగాణ. 'పెన్నులపై మన్నుగప్పితే గన్నులవై మొలకెత్తుతాం...' అంటూ సాయుధ పోరాటం సాగించిన ఈ గడ్డపై ఆందోళనలు, నిరసనలకు వీలుగా ఒక స్ఫూర్తిదాయక వాతావరణాన్ని పాలకులు కల్పించాలి. భౌగోళిక తెలంగాణ సాకారమైన క్రమంలో అప్పుడే ప్రజాస్వామిక తెలంగాణ పరిఢవిల్లుతుంది. అదే అందరికీ కావాల్సింది.

# రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు - సాయం కోసం ఎదురుచూపులు

**2023** వానాకాలం రుతుపవనాలు 45రోజులు ఆలస్యంగా వచ్చాయి. వస్తూనే తుఫాన్‌ను తీసుకుని వరదలతో ముంచెత్తాయి. రుతుపవనాలు ఆలస్యంగా వచ్చినప్పటికీ రాష్ట్రంలో 122లక్షల ఎకరాలకు బదులు 65లక్షల ఎకరాలలో మెట్టపంటలు వేసారు. మెట్టపంటలతో పాటు 15లక్షల ఎకరాలలో బావులు, చెరువుల కింద వరిపంట వేసారు. జులై 23 నుండి 27వరకు వచ్చిన తుఫాన్‌వల్ల 12లక్షల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్ జిల్లాలలో విపరీతమైన నష్టం జరిగింది. మోరంచ గ్రామం వరదలతో అదృశ్యమైంది. దాదాపు నష్టం రూ.4వేల కోట్లు ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. పత్తి, మొక్కజొన్న, పప్పులు, నూనెగింజలు, వరినార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంతవరకూ రెండుసార్లు విత్తనాలువేసి నష్టపోయారు. మూడోసారి పంటలు వేయాలి. ఈ వరదల తాకిడికి ప్రభుత్వ మంత్రులు పర్యటన చేసారు. హామీలు ఇచ్చారు. కానీ ఎక్కడా వాస్తవ సమాచారం సేకరించి నష్టపోయినవారికి పరిహారం చెల్లించలేదు. 2023 ఏప్రిల్ 23న వచ్చిన వడగండ్ల వర్షం, భారీవర్షాల వల్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యంతో పాటు మామిడి తోటలు, జొన్న, వరి కోతలకు నష్టం వాటిల్లింది. సుమారు వేయి కోట్ల నష్టం అంచనా వేసారు. ఈ ఒక్క సంవత్సరమే రెండు దఫాలుగా వచ్చిన తుఫాన్‌లకు రూ.5వేల కోట్ల నష్టం వాటిల్లింది. మంత్రులు చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమవు తున్నాయి. 2020-21 నుండి 2022-23 వరకు 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకృతి వైపరీత్యాల కోసం రూ.2400 కోట్లు పరిహారంగా ఇచ్చింది. ఆ నిధులు కూడా నష్టపోయిన రైతులకు ఇవ్వలేదు. ఏప్రిల్ 23న జరిగిన నష్టానికి ఎకరానికి రూ.10వేలు ఇస్తామని, మొత్తం 2,20,000 ఎకరాలకు పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. కానీ ఇంతవరకు 20వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చారు. నష్టపోయిన రైతులు తిరిగి పంటలు వేయడానికి పెట్టుబడులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



సారంపల్లి మల్లారెడ్డి

> ప్రతి రాష్ట్రం తమకు జరిగిన నష్టాన్ని ఎక్కువగా అంచనా వేసి కేంద్రం నుండి నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా వరదలు, తుఫాన్‌లు వచ్చినపుడు ఆందోళన ఫలితంగా కేంద్రంనుండి నిధులు రాబట్టడం జరిగింది. కేంద్రం రాష్ట్రానికి సహకరించదు అన్న నెపంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడానికే సుముఖంగా లేదు. పైగా శాసనసభలో తన స్వంత నిధుల నుండి ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. కానీ 14వ, 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల గురించి మాటమాత్రంగా శాసనసభలో ఉచ్చరించలేదు. ప్రతిపక్షాలు కూడా ఈ అంశంపై మాట్లాడలేదు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి ప్రతి ఏటా కరువులు, వరదల వల్ల నష్టాలు జరుగుతూనే ఉన్నాయి. 2014 నుండి 2020 వరకు ఆరు సంవత్సరాలలో కరువుల వల్ల రూ.16,812 కోట్లు నష్టం వాటిల్లింది. సగటున 230 మండలాల నుండి 300 మండలాలకు నష్టం కలిగింది. 14వ ఫైనాన్స్ కమిషన్ ఈ ఆరేండ్ల కాలానికి తెలంగాణకు రూ.2,306కోట్లు విడుదల చేసింది. జరిగిన నష్టంలో 10శాతం కూడా లేదు. ఈ నిధులు కూడా రైతులకు పంచకుండా స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, రహదారుల శాఖకు, ఇతర అవసరాలకు వినియోగించారు. స్వయంగా ముఖ్యమంత్రి రంగారెడ్డి జిల్లాలో బహిరంగసభ పెట్టి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. 2018 నుండి 2023 ఆగస్టు వరకు రాష్ట్రంలో పెద్దఎత్తున వరదలు వచ్చాయి. ఈ 6 సంవత్సరాలలో 56లక్షల ఎకరాలలో పంటలకు నష్టం వాటిల్లింది. ఇసుక మేటలు వేయడమే కాక కోతకు వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. మెట్టపంటలు, వరి, పండ్లతోటలు, కూరగాయలు ఒకటేమిటి అన్ని రకాల పంటలూ దెబ్బతిన్నాయి. నిపుణులు వేసిన అంచనా ప్రకారం రూ.18,700కోట్లు నష్టం జరిగింది. ఈ కాలానికి సంబంధించి 15వ ఫైనాన్స్ కమిషన్ రూ.4,133కోట్లు కేటాయించింది. కానీ ఆ నిధులు నష్టపోయిన రైతులకుగానీ, సంస్థలుకు గానీ ఇవ్వలేదు. కరువులు, వరదల వల్ల సగటున ఏటా రూ.3500కోట్ల నష్టం జరుగుతున్నది. ఈమధ్య వచ్చిన వరదలకు 20మందికి పైగా మరణించారు. 3వేల పశువులు కొట్టుకు పోయాయి. గొర్రెలు, మేకలు చనిపోయాయి. నిత్యావసర సరుకులు, బట్టలు, ఇతర వస్తువులు వరదలో కొట్టుకు పోయాయి. అంటు వ్యాధులు ప్రబలి అనేకమంది పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు.

జులై 23-27 మధ్య వచ్చిన వరద నష్టాన్ని మంత్రుల పర్యటన ద్వారా తగ్గించగలిగామని శాసనసభలో మంత్రులు ప్రకటించారు. వరదల నష్టం జరుగుతుండగా పరిశీలించిన మంత్రులు నష్టాన్ని ఎలా తగ్గించారో వారే చెప్పాలి? ప్రతిసారి నష్టం జరుగుతున్నప్పుడు, గత ప్రభుత్వాలు చేసిన విధానాల ఫలితంగానే నష్టాలు జరుగుతున్నట్టు ఆరోపణ చేయడం ప్రస్తుత పాలకవర్గానికి అలవాటుగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు కేంద్రానికి లేఖ రాసి, పరిశీలక బృందాన్ని రప్పించి, నష్టాన్ని అంచనా వేసి ఆర్థిక కమిషన్ ఇచ్చే పరిహారంతో పాటు అదనంగా కొంత పరిహారాన్ని కేంద్రం నుండి కోరాలి. కానీ తెలంగాణ మిగులు రాష్ట్రం అన్న అహంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందాలను రప్పించడంలేదు. 2015-16లో కేంద్ర బృందం వచ్చినప్పుడు వారి పరిశీలన తర్వాత రూ.791కోట్లు విడుదల చేసారు. తిరిగి 2003లో పర్యటనకు వచ్చారు. ఇంతవరకూ నివేదిక ఇవ్వలేదు. కేంద్ర బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖలు జరిగిన నష్టాన్ని వివరిస్తూ నివేదికలు ఇవ్వాలి. కేంద్ర బృందాల రాకనే అంగీకరించని తెలంగాణ ప్రభుత్వం నివేదికను తయారు చేయలేదు. సహజంగా కేంద్ర బృందాలు వాటంతటవే వచ్చి కొన్ని సందర్భాలలో పర్యటించి వెళ్ళాయి. ఆశ్చర్యం ఏమిటంటే, 2015-16లో రాష్ట్ర ప్రభుత్వం కరువు నష్టాన్ని రూ.2500కోట్లుగా అంచనా వేసింది. కేంద్ర బృందాలు ఆ నష్టాన్ని పెంచి రూ.3,506 కోట్లు నష్టం అంచనా వేసారు. కానీ కేంద్రం నుండి రూ.791కోట్లు మాత్రమే వచ్చాయి. రాష్ట్రంలో జరుగుతున్న నష్టాన్ని అంచనా వేయడానికి ప్రకృతి వైపరీత్యాల శాఖ గానీ, వ్యవసాయ శాఖ గానీ ఎలాంటి చొరవ చూపడంలేదు. ఈ కాలంలో వచ్చిన హుదూద్, తిత్లీ, పెథాయ్, తాల్కే లాంటి తుఫాన్‌లు వచ్చి పెద్దఎత్తున నష్టం కలిగించాయి. వరదలు, కరువుల వల్ల రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున నష్టం జరుగుతున్నప్పటికీ పెద్దగా సహాయ చర్యలు రాష్ట్రం తీసుకోకపోగా కేంద్రాన్ని అర్థించిన దాఖలాలు కూడా లేవు.

తెలంగాణ పీఠభూమి కావడం వల్ల ఇక్కడ రాళ్ళ వర్షాలు అరుదుగా వస్తుంటాయి. పీఠభూములపై క్యుములోనింబస్ మేఘాల ద్వారా వర్షించడంతో రాళ్ళ వర్షాలు వస్తున్నాయి. ఇది ఇతర రాష్ట్రాలకు లేదు. ఆ సందర్భంగా పిడుగులు కూడా పడ్డాయి. రాళ్ళ వర్షాలు, పిడుగుల వల్ల ప్రాణ నష్టం, పశునష్టం, పండ్లతోటల నష్టం పెద్దఎత్తున జరుగుతున్నది. ప్రతి రాష్ట్రం తమకు జరిగిన నష్టాన్ని ఎక్కువగా అంచనా వేసి కేంద్రం నుండి నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా వరదలు, తుఫాన్‌లు వచ్చినపుడు ఆందోళన ఫలితంగా కేంద్రంనుండి నిధులు రాబట్టడం జరిగింది. కేంద్రం రాష్ట్రానికి సహకరించదు అన్న నెపంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడానికే సుముఖంగా లేదు. పైగా శాసనసభలో తన స్వంత నిధుల నుండి ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. కానీ 14వ, 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల గురించి మాటమాత్రంగా శాసనసభలో ఉచ్చరించలేదు. ప్రతిపక్షాలు కూడా ఈ అంశంపై మాట్లాడలేదు. ఇప్పటికే పంటలు దెబ్బతినడం వల్ల ఏటా 640మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్ షాక్‌ల వల్ల మరో 600మంది రైతులు, 2500 పశువులు మరణిస్తున్నాయి. రైతుబీమాను పరిశీలించినప్పుడు, ఆగస్టు 15 నుండి మరుసటి సంవత్సరం 14 ఆగస్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం 18-59 సంవత్సరాల మధ్య గల రైతులకు ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం కల్పించింది. ఈ పథకం కింద చనిపోయినవారికి రూ.5లక్షలు వెంటనే ఇస్తారు. 2018 నుండి ప్రారంభమైన ఈ పథకం నివేదిక ప్రకారం ఏటా 16వేల మంది రైతులు మరణిస్తున్నారు. 59 సంవత్సరాలు దాటినవారి లెక్కలు కూడా వస్తే ఈ సంఖ్య పెరుగుతుంది. దీన్నిబట్టి చూస్తే రాష్ట్రంలో రైతుల హత్యలు, ఆత్మహత్యలు పెద్దఎత్తున జరుగుతున్నట్టు విశదమవుతున్నది. ఒకవైపు కౌలు చట్టాలు రద్దు చేసిన ప్రభుత్వం మరోవైపు ప్రకృతి వైపరీత్యాల పరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. 2003 జూన్‌లో కౌలురైతులకు కూడా పరిహారం చెల్లిస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. కానీ ఎక్కడా ఇవ్వలేదు. ఏదైనా నష్టం జరగగానే సంబంధిత శాఖ ద్వారా గణాంకాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తేవాలి. ప్రభుత్వం బడ్జెట్ నుండి కొంత కేటాయించి మిగతా నిధులకు కేంద్రంపై ఒత్తిడి తెవాలి. కానీ ఈ కార్యక్రమం తెలంగాణలో అమలు కావడం లేదు. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలకు నిలయంగా మారిన తెలంగాణలో నష్టపోయినవారికి ఎలాంటి పరిహారాలు అందడంలేదు. ఆర్థిక సంఘాల నిధులు కూడా పక్కదారి పట్టిస్తున్నారు.

> మొత్తం సాగులో దాదాపు 15శాతం భూమిలో పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాల పాలవుతున్నాయి. పంటల నష్టమే కాక మనుషుల ప్రాణాలు పోవడం, పశుసంపద నష్టం, భూమి సాగుకు యోగ్యం కాకుండా ఇసుక మేటలు వేయడం జరుగుతున్నాయి. ఈ వాస్తవాలు మంత్రులు పర్యటన సందర్భంగా అంగీకరించినప్పటికీ అందుకు కావలసిన నిధులు మాత్రం విడుదల చేయడంలేదు. ఈ సంవత్సరం వచ్చిన వరదల వల్ల లక్షల ఎకరాల్లో ఇసుక మేటలు వేయడమే కాక గట్టు తెగిపోయి భూములు సాగుకు పనికిరాకుండా మారాయి.



రాష్ట్రంలో మొత్తం సాగులో దాదాపు 15శాతం భూమిలో పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టాల పాలవుతున్నాయి. పంటల నష్టమే కాక మనుషుల ప్రాణాలు పోవడం, పశుసంపద నష్టం, భూమి సాగుకు యోగ్యం కాకుండా ఇసుక మేటలు వేయడం జరుగుతున్నాయి. ఈ వాస్తవాలు మంత్రులు పర్యటన సందర్భంగా అంగీకరించినప్పటికీ అందుకు కావలసిన నిధులు మాత్రం విడుదల చేయడంలేదు. ఈ సంవత్సరం వచ్చిన వరదల వల్ల లక్షల ఎకరాల్లో ఇసుక మేటలు వేయడమే కాక గట్టు తెగిపోయి భూములు సాగుకు పనికిరాకుండా మారాయి. అందువల్ల కనీసం ఎకరాకు రూ.30వేలు వ్యయం చేయకుండా తిరిగి సాగుకు అనుకూలంగా పునరుద్ధరణ చేయడం సాధ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఏటా కనీసం రూ.3వేల కోట్లు ప్రకృతి వైపరీత్యాల కోసం కేటాయించాలి. నష్టపోయిన రైతులకు చెల్లించి ఆ తర్వాత కేంద్రం నుండి రాబట్టుకోవాలి. వరదల వల్ల నష్టపోయిన ప్రభుత్వ శాఖలు కేంద్రం ద్వారా నిధులు రాబట్టుకునే ప్రయత్నం చేయాలి. ప్రకృతి వైపరీత్యాలను పరిశీలించడానికి ప్రస్తుతం ఉన్న రెవెన్యూ శాఖ ఐఏఎస్ అధికారి కన్వీనర్‌గా ఒక కన్వీనింగ్ కమిటీ నియమించాలి. ప్రతి జిల్లాలో జరిగిన నష్టాన్ని వెంటనే సేకరించి జిల్లాల్లో కలెక్టర్లు చర్యలు తీసుకునే విధంగా అధికారాన్ని వికేంద్రీకరించాలి. జిల్లా స్థాయిలో నిధులను విడుదల చేయాలి. పంటల బీమా పథకాన్ని, వ్యక్తుల బీమా పథకాలను అమలు చేయాలి. ప్రస్తుతం ఉన్న పథకాలలో లోపాలను సరిచేసి అందరికీ పరిహారం వచ్చేవిధంగా చూడాలి. ప్రీమియం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లించాలి. ఆవిధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాన్ని తిరిగి పొందేవిధంగా ప్రణాళిక రూపొందించాలి.



## మరణం లేని పాట

పాటకు చావు వస్తుందా?
అక్షరమైన వాడు మరణిస్తాడా?

ఆ పాట
ఎన్నెన్ని ఉద్యమాలను కలగన్నదో?
ఎన్నెన్ని పాదాలకు నెత్తురెక్కించిందో?
ఎన్నెన్ని అడవుల్ని మనుషుల్తో నింపిందో?
పొడుస్తున్న పొద్దుమీదినుంచి దూకి
ఎన్నెన్ని నక్షత్రాలను ముద్దు పెట్టుకున్నదో?
పాటకు విశ్రాంతి లేదు

ఆ పాట లోపల
వేవేల పేజీల చరిత్ర సారం
తరాల నాటి నిజమైన మనిషి పరిమళం
త్యాగాలతో విరగబూసిన
మోదుగుపూల వసంతం
చీకటి తొడిగిన సమాజపుటాకాశం మీద
మొలిచిన ఎర్రెర్రని వెలుగు చుక్కలు
పాట ప్రపంచ వ్యాప్తం

ఆ పాటను చంపడం కోసం
లాఠీలతో ఎందరు ఉరితాళ్లను పేనారో?
ఆ పాట గుండె లోగిలి మీదికి
ఎన్ని బుల్లెట్లతో దండయాత్ర చేశారో?
ఆ పాటను మోసుకొచ్చిందని
ఎన్ని సార్లు గాలి మీద కాల్పులు జరిపారో?
ఆ పాట ముందు
అందరూ ఓడిపోయారు
ఒక్క ప్రజలు తప్ప
పాట ప్రజల సొంత ఆస్తి

ప్రజల పాటకు చావు రాదు
ప్రజల మనిషికి మరణం లేదు

-తోకల రాజేశం
9676761415

మెయిల్ @నవతెలంగాణ

## భాషా పండితులకు పదోన్నతులేవి?


రాష్ట్రంలోని ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.స్పౌజ్ కేసుకు సంబంధించి జీఓ 5 శాసనసభలో పెట్టి ఆమోదింపజేశారు. ఇది మంచి విషయమే. కానీ రాష్ట్రంలోని తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలను బోధించే భాషోపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. భాషా పండితులకు పదోన్నతులు దక్కుతాయా? లేదా? అనే ప్రశ్నలు నేడు రాష్ట్రంలో ఉద్భవిస్తున్నాయి. గత ఇరవై నుంచి ఇరవై ఎనిమిదేండ్ల వారికి పదోన్నతులులేక ఆవేదన పడుతున్నారు. పండితులుగా చేరి భాషా పండితులుగా పదవీ విరమణ చేసే పరిస్థితి ఏ శాఖలోనూ లేదు. 2017 డిసెంబర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చి ఐదేండ్లు కావస్తున్నా నేటికీ అమలు కావడం లేదు. ఈ విషయమై అనేకసార్లు వేలాది మందితో ధర్నాలు చేస్తే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కానీ మళ్లీ షరామామూలుగానే భాషా పండితులను పట్టించుకోవడం లేదు. భాషా పండితులు డిగ్రీతో పాటు స్నాతకోత్తర విద్య (పి.జి) లు., పిహెచ్‌డి., బి.ఎడ్., ఎం.ఎడ్ ఎన్ని ఉన్నత చదువులు చదివినా ప్రయోజనం ఉండటం లేదు. వీరి పదోన్నతుల విషయంలో ఇది పెద్ద సమస్యగా చూస్తూ కాలాయాపన చేస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నది ఇందుకేనా అని ఇప్పుడు భాషా పండితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భాషాపండితులకు సరైన న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

- డాక్టర్. ఎస్.విజయ భాస్కర్,
9290826988

# బాలికో రక్షతి రక్షితః

ధర్మోరక్షతి రక్షితః - ధర్మాన్ని మనం కాపాడుతే ధర్మం మనల్ని కాపాడుతుంది. మరి ధర్మం అంటే ఏమిటి? ధర్మం కేవలం సూక్తిముక్తావళి కాదు. ప్రవచన ప్రభోదాలు అంతకన్నా కాదు. ఆచరించేది, పాటించేది. మానవాళి ఏం ఆచరించాలి?

అహింసా పరమో ధర్మహః. అన్నాడు బుద్ధుడు. సమాజంలో హింసలేకుండా చేయాలి. నీవెలా సుఖశాంతులతో వర్థిల్లుతున్నావో అలానే ఎదుటివారు కూడా ఉండాలని ఆలోచించడం, వ్యవహరించడం, ఆచరించడం, పాటించడం, ఏమైనా కావచ్చు. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, ఇతరులూ నీలాగే హాయిగా జీవించేలా నడుచుకోవడం, బాధితులకు సహకరించడం, ఆ సహకారంలో ఆనందం, తృప్తి పొందడం, ధర్మాచరణలో భాగమే అని చెప్పాడు. ఇతరుల హక్కులను ఉల్లంఘించేలా వ్యవహరించడం, బాధపెట్టేలా నడుచుకోవడం, హింసారూపాల్లో భాగమే అని ఐక్యరాజ్యసమితి ఏనాడో పేర్కొన్నది. మానవ హక్కుల ఉల్లంఘన మానవ ధర్మ ఉల్లంఘనే అనే రీతిలో విశదీకరించింది. పూర్వం కాళిదాసుని కూడా భోజరాజు ఇలానే అడిగాడట. ధర్మం అంటే ఏమిటని? రెండే రెండు ముక్కల్లో సమాధానమిచ్చాడు కాళిదాసు. మహాకవి కదా. 'పరోపకారం పుణ్యం పరపీడనం పాపం' అని తేల్చి చెప్పాడు.



కె. శాంతారావు
9959745723

ఈ నేపథ్యంలో చూసినప్పుడు ఏలికలకు ఎంత బాధ్యత ఉన్నదో ఎరుగంది కాదు. అయినా వక్రదృష్టితో, స్వార్థ దృష్టితో పాలన చేయడం వలన బాధితులకు ఉపశమనం లభించడం లేదు సరికదా వారి ఆక్రందనలు, ఆర్తనాదాలు అన్నీ అరణ్యరోదనగానే మిగులుతున్నాయి.

ఆ తరువాత ఇటీవల కాలంలో 'వృక్షో రక్షతి రక్షితః' అనే నినాదం పార్కులు, పర్యావరణ కార్యాలయాల గోడల మీద కనిపిస్తున్నది. నిజమే. వృక్షాలను మనం కాపాడితే వృక్షాలు మనల్ని కాపాడుతాయి. వృక్షాలకు స్థూల రూపం అరణ్యం. అంటే అరణ్యాలను పరిరక్షిస్తేనే మనకు సరైన పర్యావరణం, వర్షాలు, నీరు, ప్రాణవాయువు, ఫలసంపద, జీవన సమతుల్యత అన్నీ సక్రమంగా, సహజంగా సమృద్ధిగా లభిస్తాయని వేరుగా చెప్పక్కర్లేదు. అందుకే అటవీ సంపదను యథేచ్ఛగా నిర్మూలించకుండా, గనులు, ఖనిజాలు వంటి సహజ వనరుల కోసం ధ్వంసం చేయకుండా బాధ్యతగా పెంపొందించుకోవాలి, విస్తరించుకోవాలి. వనసంరక్షణ, సామాజిక అటవీ పెంపుదల పథకం మొదలైనవి అన్నీ కార్యాలయాల కాగితాలకు, పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా అందరికీ ముఖ్యంగా అటవేతర ప్రజలు తమదైనందిన జీవితంలో ఆచరించేలా పెద్ద ఎత్తున మార్పు తీసుకురావాలి. లేకుంటే తమ్ముడు తమ్ముడే - పేకాట పేకాటే అన్న చందంగా పరిస్థితి విషమించుతుంది. ఇప్పుడు దాదాపు అలానే ఉన్నది మరి. మణిపూర్‌లో మానవ వనరులకన్నా సహజ వనరులకు ప్రాధాన్యత నివ్వడం చూస్తున్నాముగా.

ఇక ఇప్పుడు మూడవ నినాదం బాలికో రక్షతి రక్షితః' - బాలికలను మనం కాపాడుకుంటే బాలిక మనల్ని కాపాడుతుంది. బాలిక స్వేచ్ఛగా (భయం లేకుండా) ఆరోగ్యంగా, హాయిగా ఎదగాలి. అలా ఆరోగ్యంగా ఎదిగిన బాలికే తర్వాత యువతిగా, తల్లిగా మారి ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తుంది. మనదేశంలో అందరికన్నా ఎక్కువగా ఉల్లంఘనకు గురవుతున్నది బాలికా హక్కులే. జీవించే హక్కు, రక్షణపొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, గుర్తింపు - గౌరవం పొందే హక్కు ప్రతి బాలికకూ ఉన్నదే. బాలల హక్కులన్నీ బాలికల హక్కులే. మరి ప్రతి బాలిక వీటిని




అనుభవించగలుగుతున్నదా... అంటే తొంభైశాతం అనుభవించడం లేదనే సమాధానం వస్తుంది. ఎంతెంత అణచివేత, ఎంతెంత వివక్ష, ఎన్నెన్ని వేధింపులు, చిత్రహింసలు, అత్యాచారాలు, అపహరణలు, హత్యలు కళ్ళముందు తారట్లాడుతున్నాయి. వర్ణించనలవి కాకున్నవి. క్షణక్షణానికి పర్వతంలా పెరిగిపోతున్న ఈ ఘోర అధర్మాన్ని మనం నివారించలేమా? బాలికను వేరేలా చూసే పాప పంకిలాన్ని అరికట్టలేమా? నిత్యం కీర్తించే మన భరతమాత పసిహృదయం పట్ల మనకు ఎందుకు అంత కండకావరం? పసి భారతమాతను పరిరక్షించుకోలేని మన చదువుల అభివృద్ధి చట్టుబండలుకావా? మన పాలన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందా? మరి ప్రపంచంలోనే ప్రజాస్వామ్యంకు మన భారతమాత తల్లివంటిదని చెప్పుకుంటున్నామే? ఇందులో ఏమాత్రమైనా సత్యం ధర్మం ఉన్నదా? కావాలంటే ఈ లెక్కలు చూడండి...

2019-21 ఈ రెండేండ్ల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు పదమూడు లక్షల మంది బాలికలు, స్త్రీలు అదృశ్యమైనట్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. ఈ సంఖ్య ఇప్పటికే ఇంకా పెరిగే ఉంటుంది. ఈ పాపం ఎవరిది? మానవ అక్రమ రవాణాకు అంతేలేకుండా పోతున్నది. సంతలో పశువులను అమ్మినట్టు బాలికలను, స్త్రీలను ఈ విధంగా నోరూ వాయీ కట్టేసి అమానుషంగా క్రయ విక్రయాలు చీకటి బజారుల్లో జరపడం ఎంత ఘోరం? ఎంత వికృతం? మనం ఆధునిక సమాజంలో జీవిస్తున్నామా? మధ్యయుగాల్లో జీవిస్తున్నామా? అనే ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి మానవ (బానిస) వ్యాపారానికి తావేలేదని మన భారత రాజ్యాంగం 23వ అధికరణం నిర్దేశిస్తున్నది కూడా. అయినా బాలికలతో, స్త్రీలతో వెట్టిచాకిరీ, వ్యభిచారం, భిక్షాటన, అవయువ చౌర్యం.. బూతు చిత్రాలు ఒకటేమిటి... ఈ ఘోరకలి నానాటికి ఇలా విస్ఫోటనం అవుతున్నది. ఈ సంఖ్య రెండుకోట్లకు పైగా ఉంటుందని అంచనా. నోబుల్ పురస్కార గ్రహీత కైలాస్ సత్యర్థి ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన సర్వేలో వెల్లడైన ఈ విషయాలతో సభ్యసమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మానవ క్రౌర్యం, దాష్టీకం బాలికల పట్ల ఇంత పాషాణంగా ఎందుకు మారుతున్నది? నివారించే మార్గమే లేదా? అనే ఆవేదన సర్వత్రా వెల్లడవుతున్నది. ఉన్మాదులు మాత్రం ఇది మామూలే... అన్నంతగా జడత్వానికి లోనవుతున్నారు. దుర్మార్గానికి వంతపాడటమే ఈ ప్రాప్తకాలజ్ఞత.

కొండా కోనల్లో, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు సైతం, వారి పేదరికాన్ని, క్షుద్బాధను అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భౌతికంగానో, అంతర్జాలంగానో వలవిసరడం, ఆకర్షణీయమైన ఉపాధులను వారికీ, వారి తల్లిదండ్రులకు ఎరగా చూపడం, తర్వాత వారిని మాఫియా మూకలకు అప్పజెప్పడం, మత్తుపదార్థాలకు అలవాటు చేయడం, హార్మోన్ల ఇంజక్షన్‌లతో లేతవయసులోనే వ్యభిచార కూపాల్లోకి నెట్టడం, చిత్రహింసలు పెట్టడం సాధారణ కృత్యమైపోయింది. మత్తుమాదక ద్రవ్యాల మాదిరి బాలిక కూడా అక్రమ రవాణా సరుకుగా మారడం విషాదాల్లో కెల్లా విషాదం. దీనికి విరుగుడు ఈ దుర్మార్గాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించాలన్న చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పం, పాలకులకు ప్రథమంగా ఉండాలి. రెండవది పాఠశాలల్లో, బయటా లైంగిక వేధింపులు, చిత్రహింసలు, వివక్ష, అక్రమ రవాణా పట్ల అప్రమత్తత కలిగే విధంగా పాఠ్యాంశాలు, ప్రచారం ముమ్మరంగా సాగాలి. లేకుంటే బాలికో రక్షితి రక్షితః కూడా మిగిలిన వాటి మాదిరి నినాద ప్రవచనంగానే మిగిలిపోతుంది. అశృనయనాల బాలికా భారతి అనునిత్యం మనల్ని వెన్నాడుతూనే ఉంటుంది. మన భారతమాతకు విముక్తిలేదన్న సత్యం ప్రపంచానికి వెల్లడవుతూనే ఉంటుంది.

# చివరి నిమిషంలో 'గృహలక్ష్మి'పై స్పష్టత




## మొదటి విడుత దరఖాస్తులకు నేటితో గడువు ముగింపు

- ఖాళీ తెల్లకాగితంపై దరఖాస్తు రాసి ఇవ్వొచ్చంటూ మంత్రి స్పష్టం
- ఆహారభద్రత కార్డు ఉన్నవారందరూ అర్హులే!
- స్థలం మహిళ పేరుతో ఉండాల్సిన పని లేదని ప్రకటన
- స్లాబ్ ఇల్లుఉన్నవారు.. జీవో59లబ్ధిదారులు అనర్హులు
- కరీంనగర్ జిల్లాకు మొదటి విడతలో 10500యూనిట్లు మంజూరు

**నివేశన స్థలం ఉండి, ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమతలేని కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గహలక్ష్మి పథకం అమలుపై నెలకొన్న గందరగోళానికి చివరి నిమిషంలో స్పష్టత వచ్చింది. మొదటి విడుత కింద ఈ స్కీంను ప్రారంభించిన ప్రభుత్వమూ, అధికారులు సరైన మార్గదర్శకాలు విడుదల చేయకుండా దరఖాస్తుదారులను ముప్పతిప్పలు పెట్టారు. తీరా నేటితో గడువు ముగియనున్న నేపథ్యంలో ఒకరోజు ముందు కరీంనగర్ కలెక్టరేట్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఓ స్పష్టతను ఇచ్చారు. ఖాళీ తెల్లకాగితంపై దరఖాస్తు నింపి గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్‌కు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్‌కు ఇస్తే సరిపోతుందని తెలిపారు. అయితే మార్గదర్శకాలపై స్పష్టత లేని లబ్దిదారులకు చివరి రోజున పథకానికి ప్రత్యేక ఫారమ్ లేదని, తెల్లకాగితంపై అర్జీ ఇస్తేసరిపోతుందని చెప్పడంతో కొంత ఉపశమనానికి లోనైనా.. ఇదే విషయాన్ని ముందే ఎందుకు చెప్పలదేని ఆగ్రహిస్తున్నారు.**

-నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

**మార్గదర్శకాలు తెల్వక నానా అవస్థలు..**

మహిళల పేరిట లబ్ధి చేకూర్చేందుకు వారి పేరుతోనే దరఖాస్తు చేసుకోవాలని, స్థలం వారి పేరుతోనే ఉండాలని, కుల, ఆదాయ పత్రాలూకావాలని కొందరు చెప్పడం, ఆ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక ఫారమ్‌నింపాలని మరికొందరు చెప్పడం గందగోళానికి గురి చేసింది. అందులోనూ ఈనెల 10వరకే దరఖాస్తు గడువు విధించడంతో దరఖాస్తుదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఖాళీ స్థలం కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున ఉన్నా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూనే మహిళ పేరిట లబ్ధి చేకూర్చేందుకు ఆమె కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డులను జతచేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ఉన్నప్పటికీ చాలా మంది కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందో లేదనని ఆందోళనకు గురయ్యారు.

**జిల్లాకు 10500 యూనిట్లు మంజూరు**

ప్రతి నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్నవారిలో 20 శాతం ఎస్సీలకు, 10 శాతం ఎస్టీలకు, 50 శాతం బీసీ, మైనార్టీలకు, 20 శాతం ఓసీలకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది.కరీంనగర్ జిల్లాకు 10500 లబ్ధిదారులకు మొదటి విడత కింద అందజేయనున్నట్టు తెలిపింది. ఇందులో ఇందులో కరీంనగర్ నియోజకవర్గానికి 3 వేల మందికి, చొప్పదండి నియోజకవర్గానికి 1650 మంది, మనకొండుర్ నియోజకవర్గానికి 2వేల మంది, హుజూరాబాద్ కు 2600 మంది, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కరీంనగర్ జిల్లా పరిధిలో మండలాలకు 1250 మంది లబ్ధిదారులకు కేటాయించనున్నారు.

మధ్యం టెండర్లకు పక్షం రోజుల గడువు ఇచ్చిన సర్కారు.. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మూడు రోజులే సమయం ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ చివరి రోజు ఖాళీ తెల్లకాగితంపై దరఖాస్తు రాసి ఇస్తే సరిపోతుందని చెప్పడంతో కొంత ఊపిరిపిల్చుకున్నట్టయింది.

**తక్కువ సమయంతో దరఖాస్తులు అరకొరే..**

ప్రభుత్వం ఇటీవల బీసీ బంధు కింద కులవృత్తులవారికి రూ.లక్ష సాయాన్ని వందశాతం రాయితీతో ఇస్తామని ప్రకటించిన క్రమంలో కుల, ఆధాయ ధ్రువీకరణపత్రాల కోసం తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ లబ్ధిదారులు పడిగాపులుకాచారు. అయితే ఆ పథకానికి కావాల్సిన పత్రాలు ఏంటనే విషయంపై స్పష్టత ఉండటంతో దరఖాస్తుదారులకు ఓ క్లారిటీ ఉంది. అయితే గృహలక్ష్మి పథకం కింద వందశాతంరాయితీతో రూ.3లక్షలు ఇంటి ఇంటినిర్మాణానికి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన క్రమంలో మార్గదర్శకాలపై సరైన స్పష్టత ఇవ్వలేదు. పైగా 'గహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఐదు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. హుజూరాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి మున్సిపాలిటీల్లో ప్రత్యేక అధికారులకు బాధ్యతలను అప్పగించి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు.అయితే తొలిరోజు మంగళవారం కేవలం 221 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బుధవారం మరో 500వరకు వచ్చారు.

**మార్గదర్శకాలను స్పష్టం చేసిన మంత్రి గంగుల**

స్లాబ్ ఇల్లు ఉన్నవారు, జీఓ 59కింద లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులుగా ముందే తెలిపింది. గహలక్ష్మీ కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారమ్ అంటూ ఏది లేదని.. సోషల్ మీడియాలో వైరలవుతున్న ఫారమ్ తో ప్రభుత్వానికి సంబంధం లేదని మంత్రి స్పష్టం చేయడం, దరఖాస్తుదారులు ఖాళీ తెల్లకాగితంపై రాతపూర్వకంగా అర్జీ ఇస్తే సరిపోతుందని చెప్పడంతో ఓ స్పష్టత వచ్చింది. ఆహార భద్రత, ఆధార్, ఓటర్ గుర్తింపుకార్డుల జిరాక్స్‌లు జతమ చేసి తెల్లకాగితంపై గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్‌కు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లకు ఇస్తే సరిపోతుందని చెప్పడం కొసమెరుపు. గహలక్ష్మీ లబ్దిదారులు ఇలాగే ఇల్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం ఎలాంటి నిబంధరనా పెట్టలేదు. అయితే గృహ లక్ష్మి పథకం అమలు కోసం నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్, ప్రతి మండలానికి ఒక స్పెషల్ వెరిఫికేషన్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఈ నెల 10వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరించి... 20వ తేదీలోగా లబ్దిదారుల వెరిఫికేషన్ పూర్తిచేయనున్నారు. 25వ తేదీన మొదటి విడత లబ్దిదారులకు స్కీం వర్తింపజేయనున్నారు.

# గృహలక్ష్మితో ఆర్థిక సాయం

**రెండో విడత దళిత బంధు నియోజకవర్గానికి 1100యూనిట్లు**

**అగస్టు 15న సాయంత్రం తీగల వంతెనపై సాంస్కృతిక కార్యక్రమాలు**

**మంత్రి గంగుల కమలాకర్**


మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

**నవతెలంగాణ - కరీంనగర్**

ఇప్పటికే నిరుపేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తున్న కేసీఆర్ సర్కార్ సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహలక్ష్మి, దళితబంధు, బీసీ కులవృత్తులకు చేయూత, సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాలపై కరీంనగర్ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల అమలు, అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుడారు. గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాన్ని అమలు చేస్తామన్నారు. గృహలక్ష్మి లబ్దిదారులు ఇలాగే ఇల్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం ఎలాంటి నిబంధన పెట్టలేదని, ఎవరికి నచ్చిన విధంగా వారు ఇల్లు నిర్మించుకోవచ్చాన్నారు. మొదటి విడతగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 10వేలా 5వందలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందులో కరీంనగర్ నియోజకవర్గానికి 3వేలు, చొప్పదండి నియోజకవర్గానికి 1650, మానకొండూర్ నియోజకవర్గానికి 2వేలు, హుజూరాబాద్‌కు 2600, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కరీంనగర్ జిల్లా పరిధిలో మండలాలకు 1250 మంది లబ్ధిదారులకు అందించనున్నమని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యద్భుతంగా నిర్మించుకున్న తీగల వంతెనకు మరింత పర్యాటక శోభను సంతరించేలా అగస్టు 15న సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని, ఇకపై ప్రతి శని, ఆదివారాలలో సండె ఫండే పేరుతో కేబుల్ బ్రిడ్జ్ వద్ద వాహనాల రాకపోకలను రద్దు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బీసీ కులవృత్తుల చేయూత పథకం చెక్కుల ఈ నెల 15వ తేదీలోగానే పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండో విడత దళిత బంధు కింద నియోజకవర్గానికి 11 వందల యూనిట్లను మంజూరు చేస్తున్నామని, మొదటి విడతలో పెండింగ్‌లో ఉన్న యూనిట్లను పూర్తి స్థాయి గ్రౌండింగ్ చేసేందుకు అధికారులు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల పథకం మొదటి విడతలో మంజూరైన వారికి యూనిట్లు త్వరగా అందించాలని సూచించారు. రెండో విడతగా జిల్లాకు 10 వేల 236 యూనిట్లను కేటాయించారని, దీనికి సంబంధించిన లబ్దిదారుల జాబితాను త్వరగా పూర్తి చేయాలన్నారు. కరీంనగర్ జిల్లాకు 540 మంది వీఆర్ఏల కేటాయించారని, వీరిని ఆయా శాఖాల్లో నియమిస్తూ ఆర్డర్లు జారీ చేస్తామన్నారు. వీఆర్ఏల్లో 60 ఏండ్లలోపు 439 మంది ఉంటే 60 ఏండ్లు దాటిన వారు 107 మంది ఉన్నారని, 61 ఏండ్లు ఉన్న వారి కుటుంబ సభ్యుల విద్యార్హతను బట్టి ఉద్యోగ నియమాకాలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, మానకొండూర్ చొప్పదండి, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సంతోష్ కుమార్, మేయర్ సునీల్‌రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మికిరణ్, డీసీసీ చైర్మెన్ కొడూరి రవీందర్, సుడా చైర్మెన్ జీవి.రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ గౌడ్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు, అధికారులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ఆయాలను ప్రమోట్ చేయాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్**



**నవతెలంగాణ - కరీంనగర్ :** అర్హతన ఉన్న అంగన్వాడీ ఆయాలను టీచర్స్‌గా ప్రమోట్ చేయాలని జిల్లా ప్రాజెక్ట్ అధికారికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు ఎలాంటి షరతులు లేకుండా ఆయాలకు అవకాశం కల్పించాలన్నారు. జీఓ 37, సర్క్యులర్ 1800లో ఆయాలకు వయోపరిమితిని తొలగించి, కచ్చితంగా ఇంటర్ అనే నిబంధన తొలగించి గతంలో మాదిరి 10వ తరగతితో టీచర్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. పెరిగిన జీతాల పెండింగ్ ఎరియార్స్ ఇవ్వాలని, జీతాలు ప్రతి నెల 5వ తేదీ లోపు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు హసీనా, సరిత, రమ, సుల్తానా, పుష్పలత, గౌసియ, సరళ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన తెగల మధ్య ఘర్షణను నివారించండి..

**గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్**



**నవతెలంగాణ - కరీంనగర్ :** దేశంలో గిరిజన తెగల మధ్య నెలకొన్న ఘర్షణను తక్షణం నివారించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీమా సాహెబ్ మాట్లాడుతూ.. తెలంగాణాలో గిరిజన తెగల మధ్య ఘర్షణ పెడుతున్న బీజేపీ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలని, గిరిజన హక్కులను కాపాడుకోవాలని, మణిపూర్‌లో గిరిజన తెగలను రక్షించాలని అన్నారు. అర్హులైన గిరిజనులు అందరికి హక్కు పత్రాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి చెప్పిన విధంగా 11 లక్షల ఎకరాలపై హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి గుగులోతు రవీందర్ నాయక్, జిల్లా నాయకులు అజయ్ నాయక్, సంపత్ నాయక్, ప్రకాష్, రమేష్, సురేష్తి రుపతి శ్రీనివాస్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు నౌకర్ల కేటాయింపు

- 442 మందికి ఆయాశాఖలకు బదలాయింపు
- నేడు కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు నియామకపత్రాలు అందజేత

**నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విఆర్ఏ వ్యవస్థను రద్దుచేసి వారిని వివిధ శాఖలకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలోని 442 మంది విఆర్ఏ లను వివిధ శాఖలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం (నేడు) కరీంనగర్ కలెక్టరేట్‌లోని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల చేతుల మీదుగా నియామకపత్రాలు అందించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు.

**విద్యార్హతలను బట్టి నౌకర్లు..**

జిల్లాలోని వీఆర్ఏల విద్యార్హతలు, వారి వయసు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా శాఖల్లోని ఉద్యోగాల్లో భర్తీ చేశారు. ఈ మేరకు జిల్లాలో రెవెన్యూ శాఖలో 68 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, వాచ్ మెన్‌గా ఇద్దరు, చైన్ మెన్స్ లుగా 10 మంది, ఆఫీసు సబార్డినెట్‌లుగా19 మంది, రికార్డు అసిస్టెంట్లుగా 56 మందిని , మెడికల్ ఎడ్యూకేషన్ లో రికార్డు అసిస్టెంట్ లుగా 2, మిషన్ భగీరథ శాఖ లో 71 మందిని హెల్పర్ లుగా, ఇరిగేషన్ శాఖలో 74 మందిని లస్కర్‌లుగా, 51మంది హెల్పర్ లుగా, మున్సిపల్ లో 74మందిని వార్డు ఆఫీసర్లుగా నియమించారు. మెడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కు జూనియర్ అసిస్టెట్/వార్డు ఆఫీసర్లుగా 3, నిర్మల్ జిల్లాలో జూనియర్ అసిస్టెంట్లు/వార్డు ఆఫీసర్లుగా 8 మంది, హన్మకొండ జిల్లాలో రికార్డు అసిస్టెంట్ లుగా 4 గురికి నియామక పత్రాలు అందించనున్నారు.

**వయసుమళ్లినవారి కుటుంబసభ్యులకు అవకాశం**

కరీంనగర్ జిల్లాకు 540 మంది విఆర్ఏలను ప్రభుత్వం కేటాయించింది. అయితే ఇందులో ఆయా శాఖాల్లో నియమిస్తూ నేటి నుంచి ఆర్డర్లు జారీ చేయనున్నారు. వీరిలో 60 ఏళ్ళ లోపు 439 మంది ఉంటే... 60 ఏళ్ళు దాటిన వారు 107 మంది ఉన్నారు. 61 ఏండ్లు ఉన్న వారి కుటుంబ సభ్యుల విద్యార్హతను బట్టి ఉద్యోగ నియమాకాలు చేపట్టనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పేటీఎం కంపెనీ నుంచి వచ్చామని చెబితే నమ్మవద్దు

**హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి**


మాట్లాడుతున్న హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి

**నవతెలంగాణ - జమ్మికుంట :** ఆన్‌లైన్ పేమెంట్ చేసేవారు మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని హుజురాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పట్టణ సీఐ బర్పాటి రమేష్‌తో కలిసి మాట్లాడారు. పేటీఎం కంపెనీ నుంచి వచ్చామని, డబ్బుల చెల్లింపునకు వినియోగించే స్కానర్ అప్‌డేట్ చేస్తామంటూ ఓ అపరిచిత వ్యక్తి ఇద్దరు వ్యాపారులను మోసం చేసిన ఘటన జమ్మికుంటలో చోటు చేస్తుందని తెలిపారు. జమ్మికుంట వ్యాపారులు ఆకినపల్లి శివశంకర్, అనంతుల రమేశ్ పేటీఎం స్కానర్‌ను వినియోగిస్తున్నారు. అరవింద్ అనే అపరిచిత వ్యక్తి మార్చి 4న అనంతుల రమేశ్ దుకాణం వద్దకు వచ్చి పేటీఎంకు సంబంధించిన స్కానర్‌ను అప్‌డేట్ చేస్తానని నమ్మబలికాడు. వ్యాపారి సెల్‌ఫోన్ తీసుకొని, ఫోన్లోని పోస్ట్ పెయిడ్ ద్వారా 60 వేలు వ్యాపారికి తెలియకుండా రుణం తీసుకొని, జమ్మికుంటకు చెందిన గంగారం అనే వ్యక్తికి పంపించాడు. ఇదే తరహాలో మార్చి 7న వ్యాపారి శివశంకర్ మొబైల్ నుంచి రూ.42 వేలు గంగారాంకు పంపించాడు. పోస్ట్‌పేయిడ్ ద్వారా తీసుకున్న రుణం చెల్లించాలని కంపెనీ నుంచి పలుమార్లు ఫోన్లు రావటంతో మోసపోయామని వ్యాపారులు గుర్తించారు. మంగళవారం బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు. వారివెంట ఎస్సై మహమ్మద్ యూనిసెఫ్, సిబ్బంది ఉన్నారు.

## ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**నవతెలంగాణ - కరీంనగర్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్, 2 ఏఎన్ఎం యూనియన్ నాయకులు స్రవంతి, కవిత, కనుక లక్ష్మి, సరస్వతీ, సంపూర్ణ, శ్రీవాణి, స్వాతి, అనిత, ఉమారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

# ప్రజా, కార్మిక వ్యతిరేక బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో వర్తింపజేయాలి
- లేబర్ కోడ్‌లతో బానిసత్వంలోకి అసంఘటితరంగ కార్మికులు
- సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



**నవతెలంగాణ - కరీంనగర్**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తుందని.. ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలను నిరసిస్తూ బుధవారం క్విట్ ఇండియా డే సందర్భంగా కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. రెండు రోజులు కొనసాగే ఈ ధర్నాను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ప్రారంభించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్మిక సంఘాల జిల్లా నాయకులు గీట్ల ముకుందరెడ్డి, బుచ్చన యాదవ్, టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, ఊకంటి లక్ష్మణ్ మాట్లాడారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంటులో చట్టం చేసిందని మండిపడ్డారు. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడిందన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాస్తుందని అన్నారు. సామాజిక భద్రత కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం పని పరిస్థితుల్లో కోడ్‌లతో పీఎఫ్, ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి 12 గంటల పని విధానం అమల్లోకి తేవడానికి కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెంచుతూ దోపిడీకి హద్దే లేకుండా పోతుందని చెప్పారు. సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్ వల్ల బానిసత్వంలోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కీంలోని కోటి మంది ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే పరిస్థితి లేదన్నారు. ఇండియన్ లేబర్ కాంగ్రెస్ కార్మిక సంక్షేమం కోసం గతంలో చేసిన తీర్మానాలన్నీ చిత్తుకాగితాలుగా మారిపోతున్నాయని మండిపడ్డారు. కార్మిక సమస్యలు పరిష్కరించడం ఇష్టంలేని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కనీస వేతనం నెలకు రూ.26వేలు నిర్ణయించేందుకు కేంద్ర సర్కార్ అంగీకరించడం లేదన్నారు. కోట్లాదిమంది కార్మికులకు వర్తించే ఈపీఎఫ్, పెన్షన్ నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్‌ను పట్టించుకోవడం లేదన్నారు.

మన రాష్ట్రంలో నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ విధానం ద్వారా సింగరేణిలో నాలుగు బొగ్గు గనులను వేలం వేసిందని తెలిపారు. హైదరాబాద్‌లో కేంద్రీకృతమై ఉన్న బీడీఎల్, బీహెచ్ఈఎల్, హెచ్ఐఎల్, మిధాని లాంటి సంస్థలలో సుమారు 25 నుండి 50శాతం దాకా వాటాలను అమ్మేసిందన్నారు. కార్మికులు, పేద మధ్యతరగతిలో అత్యధికులు పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసీలో లక్షల కోట్ల రూపాయల వాటాలను అమ్మేందుకు తెగబడిందన్నారు. కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ విధానాలను ఉద్యోగ భద్రత పాటు దేశ ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయాలు, విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ మహాపడవ్ విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

రైతు సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి బండ రాజిరెడ్డి, వర్ల వెంకటొరెడ్డి మాట్లాడుతు.. ఒక సంవత్సరం పాటు సాగిన కార్మిక, కర్షక, ప్రజల ఉద్యమంతో రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించు కుందన్నారు. అయినా 2017లో నరేంద్ర మోడీ పార్లమెంటులో ఇచ్చిన కనీస మద్దతు హామీ నేటికి అమలు కాలేదన్నారు. 2023- 24 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి ఆహార ఉత్పత్తులకు, సబ్సిడీలకు భారీగా కోతలు విధించిందన్నారు. జీడిపిలో విద్యారంగానికి ఆరు శాతం వైద్య రంగానికి రెండు శాతం ప్రశ్నించే గొంతులను నొక్కడం జైల్లో పెట్టడం, పౌరుల ప్రాథమిక హక్కులను పాతరేస్తుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, రాయి కంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం పెరిగిపోతున్నా కనీసం ప్రభుత్వ సంస్థలు శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 17లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కొప్పుల శంకర్, జనగాం రాజమల్లు, శ్రీనివాస్, గుడికందుల సత్యం, కదిరే రమేశ్, పిట్టల సమ్మయ్య, రజిత, అరుణ, అంకుస్, గట్టు రాజన్న, విలసాగర్ అంజయ్య, పొన్నం కనకయ్య, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

## పరుగు పందెంలో బ్రిలియంట్ విద్యార్థి ప్రతిభ



**నవతెలంగాణ - కరీంనగర్ :** రాష్ట్ర స్థాయి 100 మీటర్ల పరుగు పందెంలో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థి రెండో స్థానం సాధించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా సమాఖ్య వరంగల్ జిల్లా హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడా కళోత్సవాలలో భాగంగా 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో పోటీలను నిర్వహించింది. ఇందులో కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ పదో తరగతి విద్యార్థి అంగిడి ప్రభాస్ రెండో బహుమతి సాధించాడు. ఆ విద్యార్థిని డైరెక్టర్ జేవీడీ ప్రసాద్ రావు, ప్రిన్సిపాల్ హన్మంత రావు, పీఈటీ ప్రేమ్ కుమార్, సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

# వాగేశ్వరీలో 'అల్విదా' వీడ్కోలు వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

**నవతెలంగాణ - కరీంనగర్**

కరీంనగర్‌లోని వాగేశ్వరీ మహిళా డిగ్రీ కళాశాల 'అల్విదా 2023' వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకొని లక్ష్యాలను చేరడానికి పట్టుదలే ఆయుధంగా పని చేస్తుందని, స్వయంకృషిని నమ్ముకున్నపుడు మాత్రమే విజయం వరించి అగ్రస్థానంలో నిలుపుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులను బేషరతుగా నమ్మి శ్రమించిన వారి ముంగిట జయం మోకరిల్లుతుందని అన్నారు. డిజిటల్ భూకుగ్రామంలో ఆకర్షణీయ వ్యక్తిత్వం, కార్పొరేట్ ఆశిస్తున్న నైపుణ్యాలు, విజ్ఞానంలో పట్టు సాధించిన యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. సభాధ్యక్షుడు వాగేశ్వరీ, నిగమ కళాశాలల చైర్మెన్ బీవీఆర్.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ స్థాయిలో అత్యధిక డిగ్రీ పీజీ కోర్సులు, విద్యార్థుల అడ్మిషన్లు కలిగిన వాగేశ్వరీ కళాశాల ద్వారా ప్రతి ఏటా వెయ్యికి పైగా యువత పట్టాలు పొంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న 400పైగా యువతకు ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగ ఎంపిక పత్రాలు లభించాయని సంతోషం వ్యక్తం చేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన లియో క్లబ్, హెల్త్ క్లబ్, కల్చరల్ క్లబ్, ఎన్ఎస్ఎస్ లాంటి వివిధ క్లబ్బుల్లో శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ రత్న మాట్లాడుతూ.. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థినులు తమ కుటుంబ పరిస్థితులను ఎదిరించి తప్పనిసరిగా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పీజీ/పీహెచ్‌డీ లాంటి పట్టాలు పొందిన యువత ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని సూచించారు. వేడుకల్లో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులచే కేరింతలు కొట్టించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటరెడ్డి, రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

## కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

నవతెలంగాణ- కథలాపూర్

కథలాపూర్ మండల కేంద్రంలో రేషన్‌డీలర్ ఆధ్వర్యంలో సీఎం సీఎం కేసీఆర్, మంత్రుల కేటీఆర్, కమలాకర్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రేషన్ డీలర్ నాయకులు చిన్నయ్య మాట్లాడుతూ 70 పైసలు వున్న కమిషన్ 1.40 పైసలు చేయడం అభినందనీయం అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి జలంధర్, ప్రసాద్, భూమా గంగారాం, రాధ ,బాలయ్య పాల్గొన్నారు.

**మెట్‌పల్లి :**మెట్‌పల్లి పట్టణ చౌక ధరల డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం బుధవారం చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు లకురుణపడి ఉంటామన్నారు. డీలర్లు కోటా శంకర్, పొట్ట రాజేశ్వర్, ముల్కల కిషన్, అజార్, విజయలక్ష్మి, దేవేందర్, బత్తుల నరేష్, కైలాస పతి, లక్ష్మీ ,శంకర్, వరలక్ష్మీ డీలర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

## రాగోజిపేటలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలం రాగోజిపేట గ్రామంలో బుధవారం సర్పంచ్ బాలసాని లహరిక మారుతి ఆధ్వర్యంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నమనేని రమ్య అజిత్‌రావు, ఉపసర్పంచ్ చిన్నోళ్ల మల్లయ్య, వార్డ్ మెంబర్లు చిట్టడి శ్రీనివాస్, కాటిపల్లి గంగారెడ్డి ,అల్లూరి సుమలత, పెనుగంటి లావణ్య ,పిట్టల లక్ష్మీరాజ్యం, జోగిని పల్లి ప్రణీత, దువాస రాజు,' కల్లెం రాజిరెడ్డి, బొంగుని సత్తయ్యగౌడ్ , బొలిశెట్టి ఉజ్వల, ఏఇ శిరీష, కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

## గల్ఫ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు పస్తం సాయిలు 15 రోజుల క్రితం మరణించగా వారి కుటుంబానికి చలిమెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ కరీంనగర్ హాస్పిటల్ చైర్మన్ లక్ష్మీనరసింహారావు స్పందించి రూ.10వేలు కార్యకర్త ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రాంరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చలిగల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల ఎస్పీ భాస్కర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని చలిగల్ ప్రభుత్వ పాఠశాలలో షీ టీం, ఏహెచ్‌టీయూ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పని చేస్తుందన్నారు. అదే విధంగా షీ టీం పని విధానం, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ వాలీబెగ్, మహిళా కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేశాయిపేటలో రైతు భవన్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని దేశాయిపేట గ్రామంలో ఎమ్మెల్యే రమేష్ బాబు సహకారంతో మాజీ ఎంపీ వినోద్ కుమార్ మంజూరు చేసిన రూ.5 లక్షల నిధులతో రైతు భవన్ నిర్మాణానికి జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఏఎంసీ డైరెక్టర్ రమ్య, ఆదిరెడ్డి, సర్పంచ్ నాంచారి స్వప్న రాజేందర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, వైస్ చైర్మన్ దొంతి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు రమ్య ఆదిరెడ్డి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. రైతులు రైతు సంఘాల నాయకులు రైతు భవన్ నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ చేసి, విగ్రహ ఏర్పాటు కు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దామోదర్, తిరుపతి, రజిత శేకర్, ఎంపీటీసీ సౌజన్య తిరుపతి, ఉప సర్పంచ్ కత్తి నర్సయ్య, బాలే శంకర్, దుమాల రాజ్‌కుమార్, గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నర్సయ్య, నారాయణ, నడిపి గంగారామ్, నరేష్, శంకర్, గౌడ సంఘం అధ్యక్షుడు రవి, గ్రామ శాఖ అధ్యక్షులు కొల గంగారావు, నాయకులు ప్రభకార్ రావు, భుమ రావు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా శోభారాణి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా తాటిపర్తి శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ఒక ప్రకటన జారీ చేశారు. మహిళా కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు పాటు పడాలని శోభారాణికి ఆమే సూచించారు. పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ తాటిపర్తి శోభారాణి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొంటూ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్న తరుణంలో నియమించినట్టు తెలిపారు. శోభారాణి 1995లో పెగడపల్లి జడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి గెలుపొందారు. 2019లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బతికేపల్లి సర్పంచ్‌గా శోభారాణి గెలుపొందారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.


శోభారాణి

### 100 ఏండ్లు పూర్తి చేసుకున్న బాలయ్యకు సన్మానం

జగిత్యాల పట్టణంలోని తులసి నగర్‌కి చెందిన చిట్యాల బాలయ్య 80 సంవత్సరాలుగా యోగా చేస్తూ, శిక్షణ ఇస్తూ ఆయన వయస్సు 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ లో బాలయ్య ను ఎమ్మెలే డాక్టర్ సంజయ్‌కుమార్ సన్మానించారు.

## పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్‌పల్లి మున్సిపాలిటీలోని వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమి షనర్ జగదీశ్వర్‌గౌడ్ బుధవారం పరిశీ లించారు. మురుగు కాల్వలన శు భ్రం చేసి చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ముజీబ్, అనిల్ ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

### -రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-పెగడపల్లి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని నామాపూర్, మ్యాకవెంకయ్య పల్లె, రాజారాంపల్లి కీచులాట పల్లి గ్రామాలలో రూ. 2 కోట్ల 40 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. నామాపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో ఎస్సారెస్పీ కెనాల్‌పై రోడ్డు బ్రిడ్జ్ నిర్మాణం మ్యాకవెంకయ్యపల్లెలో రూ.33 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్డు సైడ్ డ్రెయినేజీ, శ్మశాన వాటిక, రాజాంపల్లెలో కోటి రూపాయలతో గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, బీటి రోడ్లు, రెడ్డికుల సంఘ భవనం, యాదవ సంఘం భవనం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఏ ఆలోచన చేసినా అది ప్రజల సంక్షేమం కోసమే అని స్పష్టం చేశారు. ఎంపీపీ గోలి శోభ సురేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ లు మంత్రి వేణు, క్రర భాస్కర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శి లోక మల్లారెడ్డి, బండి వెంకన్న, సర్పంచులు గాజుల రాకేష్, ఇనుగంఢ్ల లక్ష్మి మోహన్‌రెడ్డి, సాయిని సత్తెమ్మ, ఇనుగంఢ్ల కరుణాకర్ రెడ్డి, రాచకొండ స్వప్న ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.



# మద్యం, డబ్బు పంచకుండా..
# ఎన్నికల్లో పోటీ చేసే ధమ్ము ఉందా!

- ప్రజా సేవే ప్రధానమైంది.
- చివరి శ్వాస వరకు ప్రజా సేవలోనే ఉంటా..!
- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

నవతెలంగాణ-రాయికల్

ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేయకుండా కొట్లాడుతానని మంత్రి కేటీఆర్ ఒక్కరికేనా రాష్ట్రంలోని 119 నియోజక వర్గాలకు వర్తిస్తుందా అని తెలంగాణ తల్లిపై కేటీఆర్ ప్రమాణం చేయాలని, తాను కూడా ప్రమాణం చేస్తానని, నాకా ధైర్యం ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాలు విసిరారు. బుధవారం రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా పట్ట భద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులు మద్యం, డబ్బులు పంపిణీ చేసి గెలుస్తున్నామని కేటీఆర్‌కు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక్క రూపాయి పంచకుండా, మద్యం పంపిణీ చేయకుండా ఎన్నికల్లో పోటీ ధైర్యం ఉందా అని సవాల్ చేశారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, సమాజంలోని నిరుపేద వర్గాల ప్రజలు,బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు,అల్పసంఖ్యాక వర్గాల ప్రజల హక్కుల సాధన కోసం యువజన విభాగం ముందుండి పోరాటం చేయాలన్నారు. అనంతరం జగన్నాథ్ పూర్ గ్రామంలో ఆదివాసి దినోత్సవం సందర్భంగా కొమురం భీం విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు బత్తిని నాగరాజ్, ఇద్దం సుధీర్,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ కొయ్యేడి మహిపాల్ రెడ్డి,ఎద్దండి దివాకర్,మున్ను,షాకీర్, కడుకుంట్ల నరేష్, బత్తిని భూమయ్య,పొన్నం శ్రీకాంత్,రాకేష్ నాయక్, దిలీప్, గోపాల్, మసూద్,ఆదిరెడ్డి,మండ రమేష్, రాజశేఖర్, రాజేందర్, ఖలీల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

### తెల్లరేషన్ కార్డుదారులందరికీ బీమా కల్పించాలి

నవతెలంగాణ-జగిత్యాల

తెల్ల రేషన్ కార్డుదారులందరికీ బీమా కల్పించాలని, ప్రభుత్వానికి మత్స్యకారులకు మధ్య దళారులను తొలగించాలని, చేప పిల్లల పెంపకం కోసం నేరుగా మత్స్యకారులకే నగదు అందజేయాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో బుధవారం మత్స్యకారులు పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటి పర్తి జీవన్ రెడ్డిని మత్స్యకారులు కలిసి అభిమానంతో చేపలు అందజేసి, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడతూ.. కుల వృత్తులను ప్రోత్సహించాలని, స్వయం ప్రతిపత్తి కల్పించాలని సహకార సంఘాలు ఏర్పాటు చేశామన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో వేలం పద్దతి రద్దు చేసి, మత్స్య కార్మికులకు చెరువులు, కుంటలపై ఆధిపత్యం కల్పించామని తెలిపారు. చేపలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని, మత్స్యకారులు సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో మాట్లాడి ప్రభుత్వాన్ని ఒప్పించగలి గానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మత్స్యశాఖ విభాగం జిల్లా అధ్యక్షుడు తోపారాపు రజనీకాంత్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు దేశవేని రాజేష్, కాంగ్రెస్ మత్స్యశాఖ విభాగం రాష్ట్ర కార్యదర్శి రుత్త నారాయణ, రాయికల్ మత్స్య పారి శ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు తోపారపు రవీందర్, గోవిందారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు తోకల నర్సయ్య, పసునూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ- మల్యాల

మాల్యాల మండల కేంద్రంలోని సోనియా గాంధీ గుడి వద్ద యూత్ కాంగ్రెస్ మాల్యాలశాఖ అధ్యక్షుడు నెరెళ్ల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ... ఇందిరా గాంధీ యువజన కాంగ్రెస్‌తో యువ జనులను ఏకం చేశారని, కుటుంబ నియంత్రణ, మొక్కల పెంపకం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెల్మ లక్ష్మారెడ్డి, ఎడవెల్లి రాజిరెడ్డి, బతిని శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ కష్ణరెడ్డి చొప్పదండీ నియోజకవర్గ అధ్యక్షులు ముత్యం శంకర్ నియోజకవర్గ కార్యదర్శి తుంగపెల్లి మోహన్, మాల్యాల పట్టణ అధ్యక్షుడు కటకం వినయ్ నాయకులు మర్రి లక్ష్మణ్, చేటపెల్లి నరేష్, కోతకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పెగడపల్లి:**పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 63వ జాతీయ యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జాతీయ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం అనిల్‌గౌడ్ యువజన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మిఠాయి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ఆకుల విష్ణు, ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి,టౌన్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్లూరి ప్రవీణ్ కుమార్, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జీల రాకేష్ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు చాట్ల ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల:** జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా మధు ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండాను గుండ మధు ఆవిష్కరించారు. పీసీసీ సభ్యులు గిరి నాగా భూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మన్సూర్, ధార రమేష్ బాబు, ప్రచార కమిటీ సభ్యులు రఘువీర్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నక్క జీవన్, నేహల్, హబీబ్, మహిపాల్, పోతునుక మహేష్ పాల్గొన్నారు.

**మెట్‌పల్లి :**మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ మండల అధ్యక్షుడు అల్లూరి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ 63 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి,సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందే మారుతి, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ టౌన్ అధ్యక్షుడు ఎండి మోకిం, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు దాసరి నరేష్, మత్స్యశాఖ నాయకులు పాల్గొన్నారు.


మల్యాలలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మెట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుల

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి

- ఆర్డీవోకు కార్మిక సంఘాల జేఏసీ వినతి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

దేశంలోని ప్రభుత్వరంగంలోని అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కేంద్రం ఆ దిశగా కృషి చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ కోరింది. బుధవారం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు 9,10 తేదీలలో డిమాండ్ల పరిష్కారంలో భాగంగా జగిత్యాల ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు, రాష్ట్ర ప్రభుత్వ జీవో 5 కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర, ఎంవి యాక్ట్ 2019, విద్యుత్ బిల్లు 2022 తోపాటు మరో 11 అంశాలను ప్రస్తావిస్తూ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకలు ముక్రం, మాడిశెట్టి కిరణ్, కోరు కంటి శ్రీనివాస్, ధర్మయ్య సతీష్, శ్రీనివాస్, తిరుపతి, ధర్మయ్య తోపాటు పలువురు జేఏసీ నాయకులు ఉన్నారు.

**మెట్ పల్లి:**మెట్‌పల్లి పట్టణంలోని పలు కార్మిక సంఘాలు ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి,ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు,మున్సిపల్ కార్మికుల సంఘ నాయకుడు బర్ల లక్ష్మణ్ ఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ చింత భూమేశ్వర్, ఏఐటీయూసీ రామిల్ల రాంబాబు,బీడీ కార్మికులు,శ్రీకాంత్ ,వాజిద్, నరసయ్య, పోచయ్య, పోశెట్టి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## ఏండ్లు గడుస్తున్న నెరవేరని ఎమ్మెల్యే హామీ

- ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం

నవతెలంగాణ-జగిత్యాల

ఎందరో ప్రాణాలను బలిగొన్న యావర్ రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హామీ ఇచ్చి ఏండ్లు గడుస్తున్నా కలగానే రోడ్డు విస్తరణ మిగిలిందని మహాజన్ సోషలిస్ట్ పార్టీ జగిత్యాల జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం అన్నారు. బుధవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడార. 2018 ఎన్నికల సమయంలో పట్టణంలోని యావర్ రోడ్డును విస్తరణ చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయడంలో ఎమ్మెల్యే సంజయ్ విఫలమయ్యాడన్నారు. కేవలం ప్రభుత్వ స్థలాలను మాత్రమే వెనుకకు జరిపి యావర్ రోడ్డు విస్తరణను విస్మరిం చారన్నారు. జగిత్యాల పట్టణాన్ని నేనే అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకోవడం ఎమ్మెల్యే సంజయ్ మానుకోవాలని కోరారు. జగిత్యాల మన్సిపల్‌పై బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఎవరు యావర్ రోడ్డు విస్తరణను చేపట్టగా పోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి రెండు నెలల్లోగా యావర్ రోడ్డు విస్తరణను పూర్తి చేయాలని దుమాల గంగారాం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి సతీష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా కో కన్వీనర్ సురుగు శ్రీనివాస్, జగన్, ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా కన్వీనర్ నక్క సతీష్ మాదిగ, జగిత్యాల ఎంఎస్పీ డివిజన్ కన్వీనర్ బోనగిరి కిషన్, మాదిగ ఎంఎస్పి జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లె అనిల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ యువసేన ఇన్‌చార్జ్ మాదిగ, బాలే అంజన్న, మాదిగ ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ దుమాల

## గాలికుంటు వ్యాధికి నివారణ టీకాలు

నవతెలంగాణ- పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని నందగిరి గ్రామంలో బుధవారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో గేదెలకు, ఆవులకు, లేగలకు, దూడలకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు, లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు, నట్టల మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, గ్రామ సర్పంచ్ గాజుల రాకేష్, పశువైద్య సహాయకులు సంతోష్, వినీత్, గోపాలమిత్రులు జానీ పాషా, తిరుపతి, రైతు బంధు గ్రామ కోఆర్డినేటర్ చారి, విజయ డైయిరీ అధ్యక్షుడు మాల చంద్రయ్య, పశు రైతులు సంకటి మునిందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, మారపల్లి దుర్గయ్య,కనకయ్య పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్

నవతెలంగాణ-రాయికల్

ఆదివాసీల హక్కుల ,ఐక్యత కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు కొమరం భీమ్ అని మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాయి కల్ పట్టణంలోని కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్‌లు కన్నాక మహేందర్, కో -ఆప్షన్ సభ్యులు మహేందర్‌బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కురిసంగ వేణు, ఆత్రం రవీందర్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫీల్డ్ అవగాహన

నవతెలంగాణ-కోరుట్ల

విద్యార్థి దశలోనే సైన్స్‌పై అవగాహన ఉండాలని సాయి జీనియస్ కరస్పాండెంట్ చౌకీ రమేష్ అన్నారు. పట్టణ శివారులోని పివి నరసింహరావు వెటర్నరీ కాలేజీని సాయి జీనియస్ పాఠశాల విద్యార్థులకు వెటర్నరీపై ఫీల్డ్ అవగాహన కాలేజీ డీన్ చేశారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. పిల్లలు క్లినికల్ రూమ్స్, వాక్సినేషన్ సెంటర్, అనాటమీ రూం, పాథలోజి లాబ్, వివిధ రకాల జంతువుల ఫార్మ్స్ అన్నింటి గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్, లియో క్లబ్ నుంచి గుంటుక రవిరాజ్, వెటర్నరీ కళాశాల డీన్స్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## బీజేవైఎం నియోజకవర్గ స్థాయి సమావేశం

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని వాసవి గార్డెన్‌లో బీజేవైఎం నియోజకవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలన యువజన వ్యతిరేక పాలన కొనసాగుతుందన్నారు. చదువు కున్న కొలువులేని ఈ రాష్ట్రం నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతుందని, బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసి, ఎన్నికల ముందు మాయమాటలతో మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకు మరోసారి మోసం చేసే ప్రక్రియను ప్రారంభిం చిందన్నారు. ఈ నెల 11న నిరుద్యోగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్ నియోజకవర్గం కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, కౌన్సిలర్ పెండం గణేష్, బీజేవైఎం జిల్లా నేతలు సడిగే మహేష్, సుంకేట విజయ్, బొడ్ల నరేష్ ,రమేష్ యాదవ్, బైన ప్రశాంత్, రాజు ,వివిధ మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

## కలెక్టరేట్ ఎదట రెండో ఏఎన్ఎంల నిరసన

నవతెలంగాణ-జగిత్యాల

తమన రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంలు జగిత్యాల కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గాండ్ల మధరిమ మాట్లాడుతూ.. 15 లోగా క్రమబద్ధిక రిస్తునట్టు నిర్ణయం తెలుపకపోతే 16 ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తానమి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పద్మ, స్వరూప రాణి, శారద, సౌజన్య, రజిత, జయప్రదం, నీరజ, మేరీ,వసంత, సుప్రియ, సుమలత, యమున, సరోజ, కోమల, ఎలిజబెత్ రాణి, శిరీష, గణిత, జమున, చిలుకమ్మ, సునీత, శంకరమ్మ, మహేశ్వరి, రాధ, మధులత పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

## ఈనెల 12న గద్దరన్నకు ఘన నివాళి

నవతెలంగాణ- కథలాపూర్

ఈనెల 12 గద్దరన్న యాదిలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ధూమ్ ధాం కన్వీనర్ మారంపెల్లి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడార. ప్రజా యుద్ధ నౌక గద్దరన్న అనునిత్యం ప్రజల కోసమే పని చేశారని కొనియడారు. ఈనెల 12వ తేదీన కథలాపూర్ మండల కేంద్రంలో గద్దరన్న యాదిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజన్న, మండల నాయకులు బత్తుల నరేష్, కాశవత్తుల లక్ష్మీరాజం, జిల్లా నాయకులు మైస శ్రీధర్ సేత సంఘం మండల నాయకులు పత్రి నర్సమ్మ, పత్రి దశరథం,పత్రి శ్రీనివాస్, కడమంచి శ్రీనివాస్, కిరణ్, ఈశేష్మర్ సంఘ విద్యార్ని విభాగం, భీడ బుడగ జంగం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంఘం భవన నిర్మాణానికి ఎంపి నిధులు మంజూరు

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని 1వ వార్డు శివాజీనగర్‌లో గల మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఎంపీ నిధుల నుండి రూ.3 లక్షలు మంజూర చేయగా స్థానిక బీజేపీ నాయకులు ,సంఘ పెద్ద మనుషులకు అందించారు. పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపెల్లి సుఖేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యకర్త సభ్యులు ప్రభాకర్, కోరుట్ల నియోజకవర్గం నాయకురాలు సునీత, పార్లమెంట్ కో-కన్వీనర్ సదాశివం, ఓంకారి అంజయ్య, మార్గం మారుతి, అరిగేల రాకేష్, లక్ష్మణ్, మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న బీజేపీ నాయకులు

## మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

నవతెలంగాణ- మల్యాల

మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడును గుర్తు తెలియని అగంతకులు చోరీ చేసిన ఘటన మల్యాల పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన మహిళ బుధవారం మధ్యాహ్నం కరీంనగర్ జగిత్యాల మెయిన్ రోడ్డులోని మల్యాల అడ్డ రోడ్డు ఎస్ఎస్వి స్కూల్ సమీపంలో నడుచుకుంటూ వెళ్లోంది. ఈక్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బ్లూ కలర్ యాక్టివాపై వచ్చి మహిళ మెడలో పుస్తెలతాడును తెంచుకొని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పైన ఫోటోలు ఉన్న ఆగంతకులను గుర్తు పట్టి ఆచూసి తెలిసినవారు వెంటనే సమాచారాన్ని మల్యాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ సెల్ నంబర్ 8712656830, లేదా సిఐ సెల్ నెంబర్ 8712656818కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## మహిళ సమాఖ్యలు సామాజిక సేవలు అందించాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యలు ఆయా స్వశక్తి సంఘాలకు ఆర్థిక సేవలతో పాటు సామాజిక సేవలు అందించాలని జిల్లా టి సెర్ప్ అదనపు ప్రాజెక్టు సంచాలకులు శ్రీకార్ సుధీర్ అన్నారు. జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల మండల సమాఖ్యల వార్షసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గ్రామ సమాఖ్యలు, మండల సమాఖ్యకు మహాసభలు ఏర్పాటు చేసి ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు, కార్యక్రమాల వివరాలు సభ్యులకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రతి మూడు సంవత్సరాలకొకసారి నూతన పాలకవర్గం సభ్యులను ఎన్నుకోవాలని లేదా ఎవరైన పాలకవర్గ సభ్యురాళ్లకు తర్వాతి సంవత్సరానికి ఆశక్తి లేకపోతే కొత్త వారిని సభ్యులు ఎన్నుకోవాలని అన్నారు. మండల సమాఖ్య మహాసభ సందర్భంగా జగిత్యాల రూరల్ మండల సమాఖ్య అధ్యక్షురాలుగా లక్ష్మీపూర్ గ్రామం మారు సత్తవ్వ ఉపాధ్యక్షురాలుగా సోమన్‌పల్లి ఎన్.సునీత, ప్రధాన కార్యదర్శిగా తిమ్మాపూర్ గ్రామం ఎన్.భారతి, సహాయకార్యదర్శిగా పొలాస గ్రామం యూ. సంధ్యారాణి, కోశాధికారిగా అనంతారం గ్రామం సి.హెచ్.శ్రీలతలు ఎన్నికయ్యారు.

జగిత్యాలఅర్బన్ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా దరూర్ గ్రామం డి.గంగభావని, ఉపాధ్యాక్షురాలిగా అంబారిపేట గ్రామం కళావతి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్రావుపేట గ్రామం ఏ.జమున, సహాయ కార్యదర్శిగా పెర్కపల్లి గ్రామం వి.లత, కోశాధికారిగా పి.సుమలత సభ్యులుగా ఎన్నికయ్యారు.


ఎన్నికైన సభ్యులు

# వింత వ్యాధి భారీన పడ్డ పాపకు అండగ నిలిచిన డాక్టర్


పాప సంరక్షకులతో మాట్లాడుతున్న డాక్టర్ సురేంద్రబాబు

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** వింత వ్యాధితో బాధపడుతున్న పసిపాపకు అండగా నిలిచారు సిరిసిల్లా పట్టణ కేంద్రంలోని అమృత పిల్లల వైద్యశాల డాక్టర్ సురేంద్రబాబు. తానే పాపకు వ్యాధి నయమయ్యే వరకు చికిత్స అందిస్తానని తెలిపారు. పూర్తి వివరాళ్ళోకెలితే... ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పపూర్‌కు చెందిన అంగుల్ల భాస్కర్ దంపతులకు పాప ఆద్యా జన్మించింది. పుట్టుకతో వీపుపై మచ్చతో జన్మించిన ఆద్య, తాను పెరుగుతున్న కొద్ది మచ్చ కూడా పెడగింది. పాప జన్మించిన కొద్ది కాలానికి తండ్రి భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి తన తల్లిగారింటికి వెళ్లిపోవడంతో ఆద్యను నానమ్మ సావిత్రినే అన్నీ తానే పోషిస్తోంది. ఆద్య పరిస్థితిపై సామాజిక మాధ్యమంలో వైరల్ అవ్వగా నవతెలంగాణ విలేకరి ఆద్య సమస్యను డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన డాక్టర్ మంగళవారం పాపను తన సొంత వాహనంలో ఆసుపత్రికి రప్పించుకొని, తగు పరీక్షలు చేసి పాపకు 'మేలనోసైటిక్ నీవస్'గా గుర్తించారు. పాపకు ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉంటుందని, అది ఈ సమయంలో చేస్తే పాపకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. పాప కొంత వయస్సు పెరిగాక పూర్తి వైద్యం అందిస్తానని తెలిపారు.

# బ్రిడ్జి మంజూరుకు కృషి చేస్తాం..

## ధ్వంసమైన కల్వర్టును పరిశీలించిన బీజేపీ నాయకులు



**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామంలో మత్తడి పోచమ్మ నుండి అక్కపెల్లి వెళ్లే ఆయకట్టు మార్గంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టును బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డిలు బుధ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున తమ సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేపడతామని, ఎంపీ బండి సంజయ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి బ్రిడ్జి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు దాసరి గణేష్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు పిట్ల శ్రీశైలం, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తుక్కయ్యగారి సత్యారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాగ లక్ష్మణ్ యాదవ్, బూత్ అధ్యక్షులు పొన్నాల వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి

## సంఘు రాష్ట్ర నేత లగిశెట్టి శ్రీనివాస్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** పద్మశాలిలు ఐక్యతతో ముందుకు సాగి రాజకీయాల్లోనూ రాణించాలని పద్మశాలి సంఘ రాష్ట్ర నేత లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆ సంఘ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలలో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలిలకు తగిన గుర్తింపు లేకుండా పోతుందన్నారు. పద్మశాలిలు చైతన్యవంతులై సంక్షేమం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు పద్మశాలిలందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె ఎల్లప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పద్మశాలి సేవా సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బొందయ్య పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య శిబిరం

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండలంలోని గూడూరు గ్రామంలో బుధవారం ఆయుష్ హోమియో వైద్య శిబిరం ప్రభుత్వ వైద్యులు నిర్వహించారు. హోమియో వైద్యం వలన దీర్ఘకాలిక కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, నరాల నొప్పులు లాంటివి తగ్గించవచ్చని వైద్యులు తెలిపారు. ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ ప్రభుత్వ హోమియో వైద్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచులకు చేయూత నివ్వాలి


సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్

**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** మాజీ సర్పంచులకు ప్రభుత్వం చేయూతనందించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. బుధవారం సిరిసిల్లా పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద మాజీ సర్పంచ్‌లు చేపడుతున్న రిలే నిరాహారదీక్షకు ఆది శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షలో పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర అభివృద్ధికి సర్పంచ్‌ల పాత్ర అత్యంత ముఖ్యమైనదన్నారు. పదవీ విరమణ అనంతరం ఎమ్మెల్యేలు పొందే బెన్ ఫిట్లలో కొంతనైనా మాజీ సర్పంచ్ లకు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల మద్దతుతోనే పీఠమెక్కిన కేసీఆర్ వారి సంక్షేమాన్ని మరచిపోయారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మంత్రి కేటీఆర్, స్పందించి మాజీ సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు దేవయ్య, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# నాణ్యమైన చేతిరాత కోసం విధ్యార్థులకు నోట్ బుక్స్

**నవతెలంగాణ - వీర్నపల్లి :** నాణ్యమైన చేతిరాత కోసం విద్యార్థుల కు నోట్ బుక్స్ అందిస్తున్నామ ని ట్రస్ట్ చైర్మన్ రాజ్యలక్ష్మి అన్నారు. వీర్నపల్లి మండలం కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంబేడ్కర్ నగర్ పాఠశాలలో చెన్నాడి మార్తాండరావు మెమోరియల్ ట్రస్ట్ కరీంనగర్ అధ్వర్యంలో ఉచిత నోట్ బుక్స్‌ను ప్రజా ప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. 1110 బుక్స్‌ను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూలా, జెడ్పీటిసి కళావతి, సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, మండల నోడల్ అధికారి రవి, బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు కళ, ట్రస్ట్ సభ్యులు సంపత్ రావు, భాగ్య లత, బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, ఎస్ఎంసీ చైర్మెన్ సంతోష్ నాయక్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు కళావతి, ఉప సర్పంచ్ రాములు, మండల నాయకులు పాల్గొన్నారు



# కార్మికుడి కుటుంబానికి పరామర్శ

**నవతెలంగాణ - వీర్నపల్లి :** మండలంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో గ్రామ పంచాయతీ కార్మికుడు పసుల మల్లేశం ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను టీడీపీ మండల అధ్యక్షులు పెడతానపల్లి రాములు బుధవారం పరామర్శించారు. 25కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు బరిగేల కృష్ణ, మండల నాయకులు రాజం, అంజయ్య, లింబయ్య, నర్సింగం పాల్గొన్నారు.

# ఇండ్లు లేనివారు దరఖాస్తు చేసుకోండి

**నవతెలంగాణ - వీర్నపల్లి :** మండలం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహ లక్ష్మీ పథకానికి ఎంపిడివో నరేష్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇప్పటి వరకు గృహలక్ష్మీ పథకానికి 600 దరఖాస్తులు వచ్చాయని, ఇండ్లులేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# 50పడకల ఆసుపత్రి మంజూరి పట్ల హర్షం

**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** 33గ్రామాలతో అతిపెద్ద మండలమైన ఇల్లంతకుంటకు ప్రభుత్వం 50పడకల ఆసుపత్రి మంజూరు చేయడం పట్ల పలువురు నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి లేదా ఇతర ముఖ్య పట్టణాలకు 30కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలంలోని ప్రజలు ఎక్కువ శాతం ప్రజలు వరి, పత్తి పంటలపై ఆధారపడి ఉంటారన్నారు. పాము కాటుకు గురైనా, పంటకు మందు చల్లే సమయంలో అస్వస్థతకు గురైనా, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినా చికిత్స కొరకు దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు తరలించే పరిస్థితి ఉందని, చాలా ఇబ్బందులు పడుతున్న తరుణంలో మండల కేంద్రంలో రూ.17.5కోట్లతో 50 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిన మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లకు మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వేణు , ఎంపిపి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్ గౌడ్ , నాయకులు ఒగ్గు నర్సయ్య , సంజీవ్ , వేణురావు , సాదుల్, నారాయణ, బాలరాజు ,రాజిరెడ్డి రవీందర్ రెడ్డి, బలయ్య, చందన్ ఉన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణ కోసమే 'మహా పడావ్'


ధర్నాలో మాట్లాడూతున్న సీఐటీయూ జిల్లా నాయకులు కొడం రమణ తదితరులు


**నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ :** కార్మిక హక్కుల పరిరక్షణ కొరకే మహా పడావ్ అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం, ప్రజల్ని రక్షించుకుందామనే నినాదంతో దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 16డిమాండ్లతో ఆగస్టు 9 , 10తేదీల్లో మహా పడావ్ - మహా ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కోడం రమణ మాట్లాడుతూ కేంద్రంలో తొమ్మిదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన కొనసాగిస్తున్నదన్నారు. కార్మిక వర్గం బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను, 4లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికులను మళ్లీ కట్టు బానిసలు చేసే విధానాలను అవలంబిస్తుందని, రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకున్నట్టే తీసుకొని మళ్లీ ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించకుండా రైతులను మోసం చేస్తుందని, పేద ప్రజలపై పన్నుల ద్వారా విపరీతంగా ధరలు పెంచుతూ, దేశంలో ప్రజలకు సేవలు అందిస్తూ లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కూడా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతుందని విమర్శించారు. ఒకవైపు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూనే మరోవైపు ఈ విధానాలపై ప్రజలు తిరగబడకుండా మత విద్వేషాలకు పాల్పడుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీస వేతనాల జీఓలను సవరించకుండా కార్మికులకు అన్యాయం చేస్తుందని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలందరూ తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, గురజాల శ్రీధర్, ఎలిగేటి రాజశేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిలకబాబు, కార్యదర్శి గన్నేరం నర్సయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత్ అశోక్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ , కార్యదర్శి జవ్వాజి విమల, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాముల రమేష్ చంద్ర, సావనపెల్లి ప్రభాకర్, కంది మల్లేశం, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మోసానికి గురైతే 1930కి ఫోన్ చేయండి
- వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి
- రాజస్థాన్ ముఠా సభ్యుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేంద్ర చారి, చిత్రంలో సీఐ కరుణాకర్, ఎస్సై రమేష్


స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు...

**నవతెలంగాణ - వేములవాడ :** అత్యాధునిక టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందితే, అంతకంటే ఎక్కువ సైబర్ మోసాలు, నేరాలు పెరుగుతున్నాయని సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వేములవాడ డీఎస్పీ కె.నాగేంద్రచారి సూచించారు. విలాసాలకు అలవాటు పడి సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను వేములవాడ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ నాగేంద్ర చారి నిందితుల వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయి జిల్లా రామిడి పట్టణానికి చెందిన రాంరేష్ కుమార్ అనే వ్యక్తి బీఏ కంప్యూటర్స్ వరకు చదువుకొని ఆన్లైన్ ద్వారా అమాయక ప్రజలను ఏ విధంగా మోసం చేసి డబ్బులు సంపాదించాలో నేర్చుకున్నాడు. అలా మోసం చేసిన వచ్చిన డబ్బులతో విలాసవంతమైన జీవితాన్ని గడపాలనుకున్నడు. రాంరేష్‌కు ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో చాలా మందికి ఆన్లైన్ మోసాలు చేయడం ఎలాగో నేర్పించగా వారు మోసం చేసి సంపాదించిన డబ్బులలో రాంరేష్‌కు కొంత ఇచ్చేవారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన లోకేశ్ కుమార్ మీనా అనే వ్యక్తికి ఆన్లైన్ టెలిగ్రాంలో మోసం చేసి డబ్బులు ఎలా సంపాదించాలో నేర్పించాడు. లోకేశ్ కుమార్ మీనా టెలిగ్రాం యాప్‌లో బిట్ కాయిన్‌లో డబ్బులు పెడితే అవి రెట్టింపు అవుతాయని చాలా మందికి పంపగా అనుకున్న విధంగానే చాలా మంది డబ్బులు వచ్చేవి, ఇలాంటి తరుణంలో వేములవాడ పట్టణంలోని బాలానగర్‌కు చెందిన మిశ్రా సచిన్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లో డబ్బులు పెడితే అవి రెట్టింపు అవుతాయని మెస్సెజ్, ఫోన్ నంబర్ 6376012977, 9391264084మెసేజ్ పంపి మిశ్రాని నమ్మించగా మిశ్రా విషయాన్ని నమ్మి రూ.1,00,183లను భారత్ పేలో పంపించాడు. అయితే డబ్బులు రెట్టింపు కాకపోగా అతని డబ్బులు తిరిగి రాలేవు. వెంటనే మిశ్రా సైబర్ నిందుతుల చేతిలో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ ఫోర్టల్ లో ఫిర్యాదు చేసి, వేములవాడ పోలీస్ స్టేషన్‌లో ధరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తులో బాగంగా జిల్లా సైబర్ టీమ్ ఆర్.ఐ ఎస్ జునైద్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతికత ఆధారంగా నిందుతులు రాజస్తాన్ రాష్ట్రంలోని సవై మదోపూర్ జిల్లా రామిడి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. సైబర్ ఆర్ఎస్ఐ జునైద్ ఆధ్వర్యంలో రాజస్తాన్ వెళ్లి సవై గ్రామంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా అందులో ఒక వ్యక్తి మైనర్ అయి నందున అక్కడే కోర్ట్‌లో హాజరు పరిచారు. ఆ తర్వాత మరొక నిందితుడు అయిన రాంరెస్ కుమార్‌ను వేములవాడ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేసి వారి నుండి 7మొబైల్ ఫోన్ లు,2 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్టు డిఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోన్ యాప్, లాటరీ, పార్ట్ టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో సైబర్ మోసాలు, మెసేజ్ రాగానే ఆశపడి మోసపోవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే ఎన్‌సిఆర్‌పి పోర్టల్ (డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సైబర్ క్రైమ్.జిఓవీ.ఇన్) లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తక్షణమే కాల్ చేసి ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా రాజస్తాన్ వెళ్లి ఎంతో రిస్క్ చేసి కేసును ఛేదించిన సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఈ సమావేశంలో వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ గోపాల్ పాల్గొన్నారు.

# నూతన డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినోద్ కుమార్

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులను ఎంచుకొని డెవలప్ కావలని రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయిన్‌పల్లి వినోద్ కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం డిగ్రీ కళాశాల నూతన అడ్మిషన్ల పోస్టర్లను నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ న్యాలకొండ అరుణ రఘువరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఎంపిపి పిల్లి రేణుక కిషన్, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావులతో కలిసి జూనియర్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ నూతన డిగ్రీ కళాశాలను మంత్రి కేటీఆర్ మంజూరు చేసినట్టు తెలిపారు. డిగ్రీ కళాశాలలో 2023-24 సంవత్సరానికి బీఏ, బీఎస్సీ, బీజెడ్‌సీ, సీఏ గ్రూపుల్లో విద్యార్థులు అడ్మిషన్స్ పొందాలన్నారు. ప్రారంభం రోజు ఎల్లారెడ్డిపేట ఎంపిటిసి పందిర్ల నాగరాణి మూగ్గురు డిగ్రీ విద్యార్థులు గుండా మధురి, దొనుకుల కళ్యాణ్, గంట కిరణ్‌లకు అడ్మిషన్లు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చీటి నర్సింగరావు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, దోస్త్ కోఆర్డినేటర్ కె.రాజేష్, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి పరశరాములు, ఎనగందుల అనసూయ నర్సింలు, మధు, మండల మహిళ అధ్యక్షురాలు అప్సర ఉన్నిసా, మాజీ ఎంపిపి ఎలుసాని మోహన్ కుమార్ పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల మంజురుపై ఎస్ఎఫ్ఐ నాయకుల సంబరాలు



విద్యార్థులతో సంబరాలు జరుపుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం తలొగ్గి డిగ్రీ కళాశాల మంజూరు చేసిందని ఇది ముమ్మాటికి ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు టాపాసులు పెల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూడా ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడు ముందుంటుందని, విద్యార్థులు సమస్యల పరిష్కారంలో ముందుండే ఎస్ఎఫ్ఐ సంఘంలో చేరి విద్యార్థులు తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అభిలాష్, దిలీఫ్, సంతోష్, రాకేష్, నవ్య, అక్షయలు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ యువజన ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు బానోతు రాజునాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిన్ని బాబు, బిసిసెల్ అధ్యక్షుడు అనవెని రవి, సోషల్ మీడియ కోఆర్డినేటర్ బిపేట రాజు, రాగట్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు సిరిపురం నరేందర్, చంద్రం, రఫిక్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతగిరి వినయ్ కుమార్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని యువజన కాంగ్రెస్ లో పని చేసిన నాయకులు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మానకొండూర్ నియోజకవర్గ ప్రజలందరికి 63వ ఆవిర్భావ దినోత్సవ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల వెంకటి, అంతగిరి బాలపోచయ్య ,మైనర్టీ అధ్యక్షుడు జమాల్ ,పట్టణ అధ్యక్షుడు మామిడి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ - చందుర్తి :** కాంగ్రెస్ యువజన ఆవిర్భావం దినోత్సవాన్ని మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకులు సంత పురి బాలు నిర్వహించారు. తదనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దారం రామ చంద్రం,అజయ్ పుదూరి జీవన్ రెడ్డి ఉన్నారు.


ఎల్లారెడ్డిపేట : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఇల్లంతకుంట : జెండా ఎగుర వేస్తున్న కాంగ్రెస్ నాయకుడు

# వాటర్ ప్లాంట్ ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న వికాస్ రావు దంపతులు

**నవతెలంగాణ - రుద్రంగి :** ప్రతిమ ఫౌండేషన్ సహకారం తో రుద్రంగి మండల కేంద్రంలోని మహాలక్ష్మి కాలనీ గంగ పుత్ర యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం భవనంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చెన్నామనేని వికాస్‌రావు దీప దంపతులు పాల్గొని వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. గ్రామస్తులు వికాస్ రావు దంపతులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వికాష్ రావు మాట్లాడుతూ మహిళలు యువతులు యువకులు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రతిమ ఫౌండేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ప్రజలందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. రుద్రంగి మండల కేంద్రానికి ప్రతిమ ఫౌండేషన్ తరుపున ఉచిత వాటర్ ప్లాంట్ అందజేసినట్టు తెలిపారు. ఆహార శుద్ధి రంగాల్లో ఎన్నో మార్పులు జరుగుతున్నాయని రైతులు ఆహార శుద్ధి రంగం వైపు వెళ్ళాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించాలని అలాగే ప్రజలు మంచినీటిని తాగి ఆరోగ్యంగా ఉండాలని వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నియోజక వర్గంలో అనేక సేవ కార్యక్రమాలు చేశామని, యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్స్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఆర్థికంగా ఉండడానికి కుట్టు మిషన్స్ పంపిణీ చేశామన్నారు. చాలా గ్రామాలలో ఉంచితంగా అంబులెన్స్ అందజేసినట్టు తెలిపారు. భవిష్యతులో ప్రతిమ ఫౌండేషన్ తరపున అనేక సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో,సర్పంచ్ తర్రె ప్రభాలత మనోహర్, బీజేపీ నాయకులు నంద్యాడపు వెంకటేష్,పడల గణేష్, రాసురి నర్సారెడ్డి పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి


ఎస్ఎఫ్ఐ నాయకుల వినతిపత్రం

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** మండల కేంద్రంలోడిగ్రీ కళాశాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం బిజెపి యువమోర్చా, బిజెపి పార్టీ నాయకులు విద్యార్థుల తో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. మండల ఎస్ఎఫ్ఐ నాయకులు ముస్తాబాద్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ మండల కేంద్రంలో పర్యటించినప్పుడు ముస్తాబాద్‌లో డిగ్రీ కాలేజ్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చి సంవత్సరాలు గడిచినా అమలుకు నోచలేదన్నారు. పేద విద్యార్థులు సిద్దిపేట సిరిసిల్ల వంటి దూరప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కుడుకల జనార్ధన్, బీజేపీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తిక్ రెడ్డి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శులు పెంజర్ల కళ్యాణ్ , సంతోష్ రెడ్డి ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం..

## రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్


పరమర్శిస్తున్న వినోద్ కుమార్


**నవతెలంగాణ - వీర్నపల్లి :** అధైర్య పడద్దు ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ భూక్యా ఉస్మాన్ కుమారుడు భూక్య ప్రవీణ్ మూడు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం శివ ఘాట్ వాటర్ ఫాల్‌లో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను వినోద్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, టెస్కాబ్ చైర్మెన్ రవీందర్‌రావు, బీఆర్ఎస్ అధ్యక్షులు తోట ఆగయ్య పరామర్శించి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందగిరి లింగం, జెడ్పీటీసీ గుగులోతు కళావతి సురేష్ నాయక్, ఎంపీపీ భూల సంతోష్ నాయక్, సెస్ డైరెక్టర్ మల్లేశం, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు కళ, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, ఎంపీటీసీ రేణుక హన్మండ్లు, మాజి ఏఎంసీ చైర్మన్ అందే సుభాష్, మండల నాయకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ బీసీ బంధు ఇవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ - ముస్తాబాద్ :** బీసీబంధు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి బీసీబంధు పథకం ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ బీసీబంధు పథకం కేవలం ఎలక్షన్లు వస్తున్నాయని బీసీ ఓట్ల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం పెట్టిందన్నారు. తూతూ మంత్రంగా కొంతమందికి ఇచ్చి తర్వాత ఎలక్షన్ కోడ్ అంటూ బీసీలను మోసం చేసే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారని, ఇది యావత్ తెలంగాణ బీసీ లోకం గమనించాలన్నారు. ముస్తాబాద్ మండలంలో దాదాపు రూ.1500పైగా దరఖాస్తులు వస్తే కేవలం 800మందిని మాత్రమే అర్హులుగా ప్రకటించారన్నారు. మిగతా వారికి విడతలవారీగా ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. మండల కేంద్రంలో అత్యధిక బీసీ జనాభా ఉన్న దగ్గర కేవలం బీసీబంధు రావడం వాళ్ల బీఆర్ఎస్ నాయకులు కావడం ఉంటారు వారికి నలుగురికి రావడం గమనారహం అన్నారు. అతి తక్కువ జనాభా గల ఊర్లలో ఎక్కువ మందికి బీసీబంధు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, ప్యాక్స్ వైస్ చైర్మెన్ నిమ్మ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొండం రాజిరెడ్డి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఓట్ల కోసమే పథకాల అమలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు

**నవతెలంగాణ - ఇల్లంతకుంట :** ఎన్నికలు సమీపిస్తున్నకొద్ది రశీదు(ఆన్ లైన్ ) ఇవ్వకుండా గృహలక్ష్మి , బీసీ బంధు, దళితబంధు పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోని ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి రేషన్‌కార్డు, ఇంటి స్థలం డాక్యుమెంట్‌లు అడగడం సిగ్గు చేటన్నారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో ప్రభుతం ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే మీ మీ సంబంధిత మంత్రుల ద్వారా ఆ యా శాఖ ల సెక్రటరీ ల ద్వారా మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజలకు పథకాల ఆశ చూపి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మరణించిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సమావేశం లో జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల లింగమ్మ పటేల్, అసెంబ్లీ ఇంచార్జ్ ఏగొళ్ల వెంకన్న గౌడ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నిషాని రాజమల్లు మండల అధ్యక్షులు మాంకాళి అమర్ కొరడాని దిలీప్ , యాస రాజయ్య తదితరులు పాల్గొన్నారు .

## ఆహార ధాన్యాల సరఫరాలో ఎఫ్‌సీఐ అగ్రగామి

• పెద్దపల్లి డిపో మేనేజర్ చంద్రమోహన్

**నవతెలంగాణ-పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్**
ఆహార ధాన్యాల సరఫరాలో దేశంలో ఎఫ్‌సీఐ అగ్రగామిగా నిలిచిందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పెద్దపల్లి డిపో మేనేజర్ ఏ.చంద్రమోహన్ అన్నారు. దేశంలో ఎఫ్‌సీఐ పాత్రపై గోదాముల వద్ద బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎఫ్‌సీఐ గోదాముల్లో ఉన్న నిల్వలను లోటు ఏర్పడే రాష్ట్రాలకు తక్షణమే సరఫరా చేసి ఆహార కొరతను తీర్చడంలో ఎఫ్‌సీఐ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని అన్నారు. నిర్దేశిత లక్ష్యం మేరకు సేకరించిన ధాన్యం ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఉంటాయని, కరోనా లాంటి ఆపత్కాలంలో ఆహార కొరతను ఎఫ్‌సీఐ అధిగమించిందన్నారు.



ఆహార ధాన్యాల సరఫరాల గురించి వివరిస్తున్న చంద్రమోహన్

కార్యక్రమంలో నాణ్యతా విభాగం అధికారులు ఎం.మురారి, వేంకటేశ్వర్లు, అనిల్ కుమార్, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సేవలు

• కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**నవ తెలంగాణ- పెద్దపల్లి**
ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా ఆసుపత్రి మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న ఫార్మసీ, రిజిస్ట్రేషన్, ఓపి సేవలు, గైనకాలజీ సేవలు, ఆరోగ్యశ్రీ కేంద్రం, స్కానింగ్, ఆసుపత్రి పరిసరాలను నిశితంగా పరిశీలించిన కలెక్టర్, పరిసరాల పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఆర్ఓ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆర్.ఓ. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి లోని రోగులతో కలెక్టర్ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, ఆర్.ఎం.ఓ. డాక్టర్ శౌరయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**• పోటీ పరీక్షలకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి**

పోటీ పరీక్షల్లో విజయం సాధించే దిశగా విద్యార్థులు పకడ్బందీగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లాలోని గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రంథాలయంలో ఉన్న పుస్తక సామాగ్రి, సిబ్బందికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే అభ్యర్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని,



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పరీక్షల్లో ఒకసారి వైఫల్యం చెందితే నిరాశ పడకుండా తదుపరి ప్రయత్నం పకడ్బందీగా చేస్తే తప్పక విజయం సాధిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో ఏర్పరచుకున్న ఉన్నత లక్ష్యసాధన దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకొని ఎస్సై పోటీ పరీక్షలో అర్హత సాధించిన మహేష్ అనే యువకుడికి కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న విద్యార్థిని, విద్యార్థుల కోసం గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు, ఫర్నిచర్, ఇతర ఏర్పాట్లు చేశామని అన్నారు. అనంతరం కలెక్టర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో కలిసి నూతన గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, నిర్మాణ సమయంలో కల్పించాల్సిన మౌళిక వసతులు, ఇతర సౌకర్యాలను వివరంగా ప్లాన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు, సంబంధిత పాల్గొన్నారు.

## కొనొకార్పస్ చెట్లు పెంచితే నగర ప్రజల ప్రాణాలకే ముప్పు

• ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్



చెట్లను పరిశీలిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-గోదావరిఖని:**
కొనొకార్పస్ చెట్లు పెంచితే నగర ప్రజల ప్రాణాలకే ముప్పు ఉందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ అన్నారు. ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్, ఉపాధ్యక్షులు రేణికుంట్ల నరేంద్ర, హనుమండ్ల వెంకటేష్, అనిల్ కుమార్‌లు నగరంలోని కొనొకార్పస్ చెట్లను పరిశీలించి, అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతి అందజేశారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని డివైడర్ల మధ్యలో మరియు కొన్ని ప్రాంతాల్లో వాటి పక్కన ప్రమాదకరమైనటువంటి కొనొ కార్పస్ చెట్లను ఎలాంటి ప్రమాదం రాకముందే తొలగించాలని పర్యావరణానికి, మానవజీవకోటి మనుగడకు ప్రమాదకరంగా మారిన కోనో కార్పస్ చెట్లను సమూలంగా తొలగించాలని సంబందించిన అధికారులను కోరారు.

## డాక్టరేట్ పట్టా పొందిన రామయ్యపల్లివాసి

**నవతెలంగాణ-రామగిరి**
మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకురాలు స్వప్నకి హర్యాన రాష్ట్రంలోని ఎస్ఐఎల్ఎం యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం స్వప్న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాలెం ప్రభుత్వ ఆర్ట్స్అండ్‌సైన్స్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వప్న (AN ETHNOBOTANICAL STUDY ON MEDICAL PLANT USE AMONG THE PEOPLE OF MADHYA PRADESH)పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టాను పొందారు. స్వప్న డాక్టర్ నిర్మల్ శర్మ (గైడ్) దిశా నిర్దేశంలో ఈ పరిశోధనను కొనసాగించారు.



స్వప్న

## జేఎన్టీయూహెచ్‌లో హరితహారం

**నవతెలంగాణ-రామగిరి**
జెఎన్టీయు హైదరాబాద్ యూనివర్శిటీ ఆదేశాల మేరకు మేరీ మట్టి.. మేరా దేశ్ (నా నేల.. నా దేశం) కార్యక్రమంలో భాగంగా బుధవారం మంథని జేఎన్టీయూ హెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి మార్గ నిర్దేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్ దుర్గారావ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాధికారి ఆదిరెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగయ్య, పన్నూరు గ్రామపంచాయతీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమరైట్ ప్రొఫెసర్ జగన్నాథజెట్టి, సమన్వయకర్తలు సదానందం, తిరుపతి, శ్రీధర్, రవివర్మ సుమతి, హిరణ్మయి, వలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

**నవతెలంగాణ-రామగిరి**
రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు (స్కూల్ యూనిఫామ్‌లు) పంపిణీ చేశారు. ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, ఎంపీటీసీ ధర్మల రాజసంపత్‌లు అందచేశారు. 170 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున 340 డ్రెస్‌లు అందజేశామని హెచ్‌ఎం వేగోళపు సదానందం అన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ నగునూరి శ్రీనివాస్, సభ్యులు పీవీ రావు, ఉపాధ్యాయులు కనకం స్వామి, అటికం మురళి, మూల మంజుల, సలాకుల తిరుపతి పాల్గొన్నారు.

## ఉపయోగకరంగా రూమ్ టూ రీడ్

**నవతెలంగాణ-రామగిరి**
రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కార్యక్రమం చాలా బాగుందని ఎంఈఓ పల్లెపాటి సంపత్‌రావు, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్ అన్నారు. బుధవారం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి, రెండు, మూడవ తరగతి విద్యార్థులకు క్యాలెండర్లను, పాఠ్య పుస్తకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెగోలపు సదానందం, విద్యా కమిటీ చైర్మన్ నగునూరి శ్రీనివాస్, మేంబర్ పీవీ రావు, కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు కనకం స్వామి, అటికం మురళి, మూల మంజుల, సలాకుల తిరుపతి, కళ్యాణం సుజాత, శ్రీకాంత్, సదానందచారి పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం గడువు పెంచాలి



మంథనిలో ధర్నా చేస్తున్న దరఖాస్తుదారులు

**నవతెలంగాణ ఓదెల:**
మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ లక్ష్మీ పథకం గడువు పెంచాలని అంతేకాక అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాకేష్ ఉన్నారు.
**మంథని:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని, దరఖాస్తు గడువులను తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం మంథనిలోని మీసేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
గృహలక్ష్మి పథకం నాలుగు రోజుల గడువు పెట్టడం ఎంతవరకు సమంజసమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ అధికార ప్రతినిధి వేణి క్రాంతికుమార్ నాయకులు ఉన్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**నవతెలంగాణ-ముత్తారం:**
ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో పశు వైద్యశాల డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుంగాని సమ్మయ్య యాదవ్, ఎంపిటిసి దొడ్డ గీతారాణి కార్యక్రమాన్నిప్రారంభించారు. ప్రతీ ఒక్క రైతు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాను అందించాలనిఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు అశోక్, గోపాల మిత్రులు, పశు మిత్రలుతోపాటు రైతులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

**నవతెలంగాణ- పెద్దపల్లి**
డబుల్ బెడ్ రూం నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ కాంట్రాక్టర్ లను, సంభందిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ లతో రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్లాబ్, గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ స్థాయి నుండి లబ్ధిదారులకు ఇబ్బందులు రాకుండా ఇళ్లలో సౌకర్యాలు కల్పించి అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండే విధంగా పనులు పూర్తి చేయాలన్నారు. రెండు పడక గదుల నోడల్ అధికారి, ఈఈ- పిఆర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**పతెలంగాణ-ముత్తారం:**
ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన శంకరయ్యకు 21వేల రూపాయల, పుల్లూరి బాబుకు 8500 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా పెద్దపల్లి జడ్పి చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల సర్పంచ్ మేడగోని సతీష్ బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలువేరి భుమయ్య, గాదె స్వామి, నారాయణ, కుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.



చెక్కులు అందజేస్తున్న నాయకులు

## అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

**నవతెలంగాణ-గోదావరిఖని:**
కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ బుధవారం సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జిడికె 2వ గని, వర్క్‌షాప్‌లోని కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండి ముస్తఫా, నాయకులు తాళ్లపల్లి యుగేంధర్, ఉన్నారు.

## చికిత్సపొందుతూ ఒకరి మృతి

**నవతెలంగాణ ఓదెల:**
మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బోయిని కనకయ్య (48) మద్యానికి బానిసై అప్పుల బాధతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య గట్టవ్వ ఫిర్యాదు మేరకు పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కేసీఆర్ చిత్రపటానికి రేషన్ డీలర్ల పాలాభిషేకం

**నవతెలంగాణ-ధర్మారం:**
మండల కేంద్రంలోని అంబే ద్కర్ చౌరస్తాలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు దొనికెని తిరుపతిగౌడ్ ఆధ్వ ర్యంలో సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీష్‌రావు పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు కళ్లెం హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షులు కొమ్మ కనుకయ్యా సూరమల్ల భీమయ్య, తాల్లపెల్లి రమేష్, దేవి విజయకుమారి, పోచయ్య, పెర్క బానేష్, చంద హన్మండ్లు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## అగ్రిమెంట్లను అమలు చేయడంలో జాప్యం సరికాదు

• టీడీపీ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, సల్ల రవీందర్



మాట్లాడుతున్న టీడీపీ నియోజక వర్గ అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ

**నవతెలంగాణ-గోదావరిఖని:**
గత నెల రోజుల నుంచి ఎన్టిపిసి కాంటాక్ట్ కార్మికులు గత నాలుగు సంవత్సరాల క్రితం ఎన్‌టిపిసి యజమాన్యం చేసిన అగ్రిమెంట్ను అమలు చేయకుండా జాప్యం చేయడం సరికాదని టిడిపి రామగుండం నియోజక వర్గ అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, టిఎన్‌టియుసి పెద్దపల్లి పార్లమెంటరీ అధ్యక్షులు సల్ల రవీందర్ అన్నారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం యునైటెడ్ కార్మిక సంఘాల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్లను అమలు చేసేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం మెడలు వంచేందుకైనా కార్మికులు చేస్తున్న సమ్మెకు టిడిపి, టిఎన్‌టియుసి మద్దతుగా ఉండి పోరాటంలో పాల్గొంటుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు కోటగిరి పాపయ్య, ప్రధాన కార్యదర్శి సంగేపు రాజు, పార్టీ అధికార ప్రతినిధి రాజయ్య, సీనియర్ నాయకులు బొబ్బిలి మల్లయ్య తదితరులున్నారు.

## మిద్దె రాములు జయంతిని విజయవంతం చేయండి

**నవతెలంగాణ-ముత్తారం:**
ప్రముఖ ఒగ్గు కథ కళాకారులు మిద్దె రాములు 83వ జయంతి ఉత్సవాలను పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంథనిలో గురువారం నిర్వహిస్తున్నారని, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఒగ్గు కథ కళాకారులు నర్ర సతీష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలోకోరారు. మిద్దె రాములు ఆశయాలను కొనసాగిస్తూ వారి కళను కొనసాగిస్తున్న మిద్దె రాములు శిష్యులకు స్మారక పురస్కారంతోపాటు ఘనంగా సన్మానం చేయనున్నారని తెలిపారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి జెడ్పి చైర్మన్ పుట్ట మధుకర్, మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ,పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పుట్ట శ్రీహర్ష హాజరుకారున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలకు ముత్తారం మండలంలోని కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

## క్విట్ మోడీ, సేవ్ ఇండియా

• ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల పిలుపు

**నవ తెలంగాణ -పెద్దపల్లి**
క్విట్ మోడీ సేవ్ ఇండియా, అనే పేరుతో ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం క్విట్ ఇండియా డే సందర్భంగా ఉద్యోగ కార్మిక సంఘాల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను, జాతీయ వనరులను, వ్యవసాయ భూములను కార్పోరేట్ సంస్థలకు అమ్మేసి,దేశ ఆర్థిక స్వావలంబనను దెబ్బతీసే విధానాలను అనుసరిస్తుందన్నారు. నిరుద్యోగం విపరీతంగా పెరి గిందని, ఈ సమస్యలపై పోరాడుతున్న భారత ప్రజలను చీల్చడం కోసం మతోన్మాద కుట్రలకు పాల్పడుతుందని, అందుకే "క్విట్ మోడీ, సేవ్ ఇండియా" పేరుతో ఆగస్టు 9,10 తేదీల్లో దేశవ్యాప్తంగా మహా పడవు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శేఖర్, కడారి సునీల్, పూసాల రమేష్, తిరుపతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, సహాయ కార్యదర్శి జి, జ్యోతి,



మహాధర్నాలో పాల్గొన్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

తాండ్ర అంజయ్య, హెచ్ఎంఎస్ నాయకులు కే, సత్యనారాయణ, తోట వేణు, ఐ ఎఫ్ టి యు నాయకులు తోకల రమేష్ పాల్గొన్నారు.

**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం**

**గోదావరిఖని:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, టీఎన్‌టియుసీ అనుబంధ సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు పిలుపునిచ్చారు. 2023 ఆగస్టు 9,10 తేదీల్లో రాష్ట్ర వ్యాపితంగా జరిగే కార్మిక మహాధర్నాలలో బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఏఎస్‌ఎంల నిరసన ర్యాలీలో జేఏసీ కార్మిక సంఘాలతో కలిసి టీఎన్‌టియుసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంకె బోస్ పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టిఎన్టియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల పాల్గొని మాట్లాడారు.

# ఘనంగా ఆదివాసి దినోత్సవం




ఓదెలలో కేక్ కట్ చేస్తున్న ఉపసర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు నాగరాజు

**నవతెలంగాణ-ఓదెల**
మండలంలోని లంబాడి తండా గ్రామంలో బుధవారం మండల ఉప సర్పంచల ఫోరమ్ ఉపాధ్యక్షులు హరిపురం ఉప సర్పంచ్ గ్యారవేణి నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి గిరిజన ఆదివాసులకు శుభాకాంక్షలు తెలిపి సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి తండా ఉప సర్పంచ్ నిమ్మ,వేల్పుల ఐలయ్య, లింగేష్,మద్దేవెని రవి, కృష్ణ ఉన్నారు.
**గోదావరిఖని:** తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయం వద్ద ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె రమేష్ భారత రాజ్యాంగ నిర్మాత




గోదావరిఖనిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గొర్రె రమేష్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు భాజా వెంకటేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవంసందర్భంగా ప్రపంచములలోని ఆదివాసీలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో 12 శాతం ఉన్నటువంటి ఆదివాసుల హక్కులను అన్ని పార్టీలు అణచివేశాయని అన్నారు. వాళ్లను రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా ఉద్యోగ రంగాలలో ఎదగకుండా చేశాయని అన్నారు. ఆదివాసీయుల అభ్యున్నతికి అన్ని పార్టీలు కృషి చేయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. నాయకులు అల్లెపు తిరుపతి, కన్నం భాను చందర్, చెరుకు పైడి, జక్కం కవిత, రజిత, నూనె కనకలక్ష్మి, పెండ్లి కుమారి, అరకోటి పద్మ, కంకణాల సాగరిక ఉన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

**నవతెలంగాణ-మంథని**
సమాజ శ్రేయ లక్ష్యంగా ప్రతి యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పని చేయాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెమినీ గౌడ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల ప్రవీణ్ అన్నారు. బుధవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యూత్ కాంగ్రెస్ జెండాను బర్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, నాయకులు పాల్గొన్నారు.
**ముత్తారం:** మండల యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ముత్తారం మండల అధ్యక్షులు బియ్యని శివకుమార్ యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ అనేది కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటిదని అన్నారు. ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు వాజిద్ పాషా, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గాదం శ్రీనివాస్, నాయకులు లక్ష్మణ్ ఉన్నారు.



ముత్తారంలో జెండా ఎగరవేస్తున్న నాయకులు

# అమలు కాని కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్

• కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

**నవతెలంగాణ-గోదావరిఖని:**
2018 వ సంవత్సరంలో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన కాంట్రాక్టు కార్మికుల అగ్రిమెంట్ నేటి వరకు కూడా అమలు చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎన్టిపిసి ఉద్యోగుల మెయిన్ గేట్ ముందర కాంట్రాక్టు కార్మికుల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెలో బుధవారం పాల్గొని, వారి న్యాయమైన పోరాటానికి ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు తన జీవితాలు చీకటిమయంలో మగ్గిపోతున్న కూడా, దేశానికి వెలుతురును పంచుతున్న వారి కష్టానికి అభినందనలు తెలి పారు. ఇక్కడున్న ఎమ్మెల్యే చేతగానితనం వల్లనే డిమాండ్ల అగ్రిమెంట్ నేటివరకు అమలు కాలేదని, గతంలో ఎమ్మెల్యే కాంట్రాక్టు కార్మికులపై కపట ప్రేమ చూపిస్తూ, ఎన్టిపిసి యాజమాన్యంపై కార్మికుల డిమాండ్ల కోసమని ఒక్కరోజు ధర్నా అనే కార్యక్రమం ఒక డ్రామా అని అన్నారు. ఈ శాంతియుత నిరవధిక సమ్మెలో పాల్గొంటానని అన్నారు. సమ్మెలో కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు, పెద్ద ఎత్తున కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హాట్ హాట్ సూప్స్

చల్లని వాతావరణంలో వేడి వేడిగా కాఫీ, చాయ్, సమోసా, పకోడీ వంటి వాటిని తీసుకోవడానికి ఇష్టపడతాం. కానీ ప్రతిసారీ అవే టేస్ట్ చేస్తే రొటీన్‌గా అనిపిస్తుంటుంది కదా..! ఈ మధ్య కాలంలో టీ ఎక్కువ తాగినా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల వాటి స్థానంలో ఆరోగ్యం కోసం వేడివేడిగా సూప్ లాంటివి ఏవైనా తీసుకుంటే బాగుంటుంది కదా.! తక్కువ సమయంలో ఇంట్లోనే తయారు చేసుకునే ఈ సూప్‌లు తాగడం వల్ల ఆరోగ్యానికి ఆరోగ్యం... రుచికి రుచి...

## లెమన్ కొరియాండర్ సూప్



**కావలసిన పదార్థాలు :** క్యాబేజీ తరుగు - పావుకప్పు, క్యారెట్ తరుగు - పావుకప్పు, బీన్స్ తరుగు - పావుకప్పు, నిమ్మరసం, కొత్తిమీర తరుగు - రెండు చెంచాల చొప్పున, ఆలూముక్కలు - అరకప్పు (ఉడికించి, చిదిమిన పేస్టు), మిరియాలు- ఎనిమిది, ఉప్పు - తగినంత.

**తయారు చేసే విధానం :** తరిగిన కూరగాయ ముక్కలన్నింటినీ ఒక గిన్నెలో వేసి అవి మునిగే వరకు నీళ్లు పోసి ఉడికించాలి. దానిలో నీళ్లు సగమయ్యాక స్టవ్ ఆపేసి వడకట్టాలి. కూరగాయ ముక్కలు ఉడికించిన ఈ నీటిలో మిరియాలపొడి, ఉప్పు, కొత్తిమీర వేసి ఐదు నిమిషాల పాటు మరిగించాలి. చివరిగా నిమ్మ రసం, ఉడికించి పెట్టుకున్న ఆలూ ముక్కల పేస్టును ఈ నీటిలో కలపాలి. రెండు నిమిషాల పాటు ఉడికించి స్టవ్ ఆపేస్తే సరి లెమన్ కొరియాండర్ సూప్ రెడీ.

## మటన్ షోర్బా



**కావలసిన పదార్థాలు :** బోన్లెస్ మటన్- పావుకేజీ, మటన్ లెగ్ బోన్స్- అర కేజీ, పంచదార - చెంచా, పెరుగు- రెండు కప్పులు, మైదాపిండి- రెండు చెంచాలు, అల్లం- చిన్న ముక్క, దాల్చిన చెక్క- రెండు ముక్కలు, జీలకర్ర, ధనియాలు- రెండు చెంచాలు, లవంగాలు- నాలుగు, మిరియాలు - ఐదు, ఉప్పు - తగినంత.

**తయారు చేసే విధానం :** గిన్నెలో మటన్ ముక్కలు, బోన్స్, నీళ్లు, పంచదార, ఉప్పు, లంవంగాలు, మిరియాలు, ధనియాలు, జీలకర్ర, దాల్చిన చెక్క, అల్లం వేసి ఐదు కప్పుల నీళ్లు పోసి బాగా మరిగించాలి. మటన్ ముక్కలు ఉడికాక స్టవ్ ఆపేసి దానిలోని నీళ్లని వడకట్టాలి. మిగిలిన పదార్థాల్లోంచి మటన్ ముక్కలు, బోన్‌లను వేరు చేసి పెట్టుకోవాలి. మరొక గిన్నెలో పెరుగు, మైదాపిండి తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టిన నీళ్లలో కలిపి బాగా మరిగించాలి. తర్వాత మటన్ ముక్కలు, బోన్స్ కూడా దానిలో వేయాలి. నీళ్లు ఉడికిపోతూ పైకి బుడగలు వచ్చేటప్పుడు మంట తగ్గించి ఐదునిమిషాల అలా ఉంచేసి, తర్వాత స్టవ్ ఆపేయాలి. అంతే ఘుమఘుమలాడే మటన్ షోర్బా రెడీ.

## క్యారెట్ బెల్ పెప్పర్ సూప్

**కావలసిన పదార్థాలు :**
క్యారెట్ రెడ్ క్యాప్సికమ్, గ్రీన్ క్యాప్సికమ్, టొమాటో- అరకప్పు ముక్కల చొప్పున, ఎండు మిర్చి గింజలు, లవంగాలు, యాలకలు- అర చెంచా చొప్పున, మిరియాలు- పావు చెంచా, ఉప్పు- తగినంత.

**తయారు చేసే విధానం :**
ఒక గిన్నెలో క్యారెట్, క్యాప్సికం, టొమాటోలు ముక్కలు వేసి రెండు కప్పుల నీళ్లు పోసి అవి మెత్తగా అయ్యేవరకు ఉడికించాలి. స్టవ్ ఆపేసాక ముక్కల్ని మెత్తగా మెదపాలి. ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలోకి తీసుకొని ఎండుమిర్చి గింజలు, లవంగాలు, యాలకులు, ఉప్పు, మిరియాలు వేసి పావు కప్పు నీళ్లు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్నమంటపై రెండు నిమిషాల పాటు ఉడికించి స్టవ్ ఆపేయాలి. దీన్ని వేడి వేడిగా తింటే చాలా టేస్టీగా ఉంటుంది.



## చికెన్ కార్న్‌తో..

**కావలసిన పదార్థాలు :**
చికెన్- అరకేజీ, మొక్కజొన్న గింజలు- ఒక కప్పు, అల్లం పేస్టు- మూడు చెంచాల్లు, కొత్తిమీర తరుగు, జీలకర్ర- రెండు చెంచాల చొప్పున, పసుపు- అర చెంచా, వెల్లుల్లి - నాలుగు రెబ్బలు (తరిగి ఉంచుకోవాలి), ఉప్పు- తగినంత, నూనె- ఒక చెంచాలు, లవంగాలు, మిరియాలు- నాలుగు.

**తయారు చేసే విధానం :**
ఒక గిన్నెలో చికెన్ వేసి ముక్కలు మునిగేవరకు నీళ్లు పోసి, కొద్దిగా ఉప్పు, లవంగాలు, మిరియాలు వేసి మరిగించాలి. నీళ్లు సగానికి సగం అయ్యాక స్టవ్ ఆపేసి చికెన్ స్టాక్‌ను వడకట్టుకోవాలి. మొక్కజొన్న గింజలను మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేసి జీలకర్ర, అల్లం, వెల్లుల్లి వేసి వేయించాలి. వేగాక మొక్కజొన్న గింజల మిశ్రమం, పసుపు వేసి కొద్దిసేపు ఉడికించాక చికెన్ స్టాక్ పోయాలి. తర్వాత ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి రెండు నిమిషాలాగి స్టవ్ ఆపేస్తే సరి. చికెన్ కార్న్ సూప్ తయారవుతుంది.



## టొమాటో షోర్బా



**కావలసిన పదార్థాలు :**
శెనగపిండి- చెంచా, ఆవనూనె -చెంచా, జీలకర్ర - చెంచా, టొమాటో - ఎనిమిది (మీడియం సైజువి తరిగి పెట్టుకోవాలి), కరివేపాకు రెబ్బలు- నాలుగు, కారం - అర చెంచా, పంచదార, నిమ్మరసం- రెండు చెంచాల చొప్పున, నెయ్యి, కొత్తిమీర - ఒక్కో చెంచా చొప్పున.

**తయారు చేసే విధానం :**
శెనగపిండిలో ఒక కప్పు నీళ్లు పోసి బాగా కలపాలి. ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి టొమాటో ముక్కలు వేసి నాలుగు నిమిషాల పాటు మరిగించాలి. కొద్దిసేపటి తరువాత స్టవ్ ఆపేసి కరివేపాకు, కారం వేసి మెత్తగా చేయాలి. ఈ టొమాటో ప్యూరీని మరొక గిన్నెలోకి తీసుకొని, శెనగపిండి మిశ్రమం వేసి ఉడికించాలి. కొద్దిసేపటి తరువాత ఉప్పు, చక్కెర, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఐదు నిమిషాల పాటు సన్నటి మంటపై ఉడికించి స్టవ్ ఆపేయాలి. కొత్తిమీర చల్లి, నూనె, ఎండుమిర్చి, ఆవాలు, జీలకర్రతో తాలింపు వేసి దాన్ని టొమాటో షార్బాపై వేసి సర్వ్ చేయాలి.

## వెజిటేబుల్స్‌తో...

**కావలసిన పదార్థాలు :**
కారెట్ ముక్కలు - అరకప్పు, బఠానీ - అరకప్పు, ఉప్పు - రుచికి సరిపడా, స్వీట్ కార్న్ - అరకప్పు, ఆలూ - ఒకటి, క్యాబేజీ - అర కప్పు (తరిగినవి), బీన్స్ - అరకప్పు (తరిగినవి), అల్లం - రెండు చెంచాలు (తరిగి పెట్టుకోవాలి), మిర్యాలపొడి - అర చెంచా, కార్న్ ఫ్లోర్ - రెండు చెంచాలు

**తయారు చేసే విధానం :**
ఆలూ ముక్కలను మిక్సి జార్‌లో వేసి కొంచెం నీళ్ళు పోసి మెత్తని పేస్టులా చేసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొన్ని నీళ్ళు పోసి కారెట్ ముక్కలు, బఠానీ, స్వీట్ కార్న్, క్యాబేజీ, బీన్స్, అల్లం ముక్కలు అన్నింటినీ వేసి ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. బాగా ఉడికిన తర్వాత గిన్నెలో కార్న్‌ఫ్లోర్ తీసుకుని అందులో కొన్ని నీళ్ళు పోసి ఉండలు లేకుండా కలిపాలి. ఈ మిశ్రమాన్ని ఉడికించుకుంటున్న వెజిటేబుల్స్ గిన్నెలో పోయాలి. అందులోనే ఆలూ పేస్టును కూడా పోయాలి. సన్న మంట కలుపుకుంటూ ఉడికించుకోవాలి. ఇందులో రుచికి సరిపడా ఉప్పు వేసుకోని కలుపుని దించుకోవాలి. అంతే వెజిటేబుల్ సూప్ రెడీ.



# కండ్ల ఆరోగ్యానికి...

**ఈ రోజుల్లో చిన్న వయసులోనే కండ్ల సమస్యలతో బాధపడే వారు చాలా మంది ఉన్నారు. ఉద్యోగం చేసే చోట అదే పనిగా కంప్యూటర్ చూడటం, బయట తిరిగేపుడు దుమ్ము పడటం కండ్ల సమస్యలకు కారణం కావచ్చు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ సర్వసాధారణమైంది. ఫోన్ ఎక్కువగా వాడటం కూడా కండ్ల సమస్యలకు కారణం కావచ్చు. అందువల్ల కండ్ల కాపాడుకోవడం తప్పనిసరి. అందుకు ఏమేం చేయాలో చూద్దాం...**

- సాధారణంగా కంటి రెప్పలు మూసి తెరవటం చేస్తుంటాం. దీని వల్ల కండ్లు తాజాగా ఉంటాయి. కంటి అలసట నివారించేందుకు ఇది ఉపయోగపడుతుంది.
- కంప్యూటర్‌పై పని చేసేవారు కండ్ల రెప్పలు మూసి తెరవటం చాలా తక్కువగా చేస్తూ ఉంటారు. కాబట్టి వారు తమ కళ్ళను ప్రతి మూడు నాలుగు సెకన్లు ఒకసారి మూసి తెరుస్తూ వ్యాయామం చేయాలి.
- దగ్గరగా ఉన్న వస్తువుల వద్ద ఎక్కువ సమయం గడిపిన తర్వాత దూరపు వస్తువులను చూడటం ఒక అలవాటుగా పాటించాలి. వాకింగ్ లేదా కూర్చొని ఉండగా చుట్టూ దూరంగా ఉన్న వస్తువులను చూడటానికి ప్రయత్నిస్తూ ఉండాలి.
- కంటి చూపులో ఎలాంటి సమస్య అయినా కనీసం ఏడాదికి ఒకసారి చెకప్‌కు వెళ్లాలి. కంటి సంబంధిత రోగాలను గుర్తించడం, సరైన చికిత్సకు ఇలా చేయడం చాలా అవసరం.
- ఎయిర్ కండిషన్డ్ గాలి కండ్లలో తేమ లేకుండా చేస్తుంది. అందుకే ఏసీ ప్యానెల్‌ను కిందికి లేదా ముఖానికి దూరంగా ఉండేలా చూసుకోవాలి. ఎయిర్ కండీషనర్ గాలి కండ్లను పొడిబార్చడం, అంధత్వం తో పాటు ఇతర కంటి రుగ్మతలకు కారణం కావచ్చు.



- దుమ్ము, ధూళీ వంటి వాటితో కండ్లు పాడయ్యే అవకాశం ఉంది. కాబట్టి దుమ్ము, ధూళీ, రసాయనాలతో పని చేసేవారు తప్పనిసరిగా రక్షణకు కండ్లద్దాలు ధరించాలి.
- కండ్లు ఒత్తిడిగా ఉన్నాయని భావిస్తే చల్లటి నీటితో కడగాలి. దీనిని రోజువారీ పనిగా అలవాటు చేసుకోండి. నీటితో కండ్లను కడగటం వల్ల అధిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందటానికి, వాటిని తాజాగా ఉంచటానికి సహాయం చేస్తుంది.
- పడుకొనే ముందు కంటి మేకప్‌ను తొలగించుకోవాలి. రాత్రి కంటి మేకప్ తీయకపోతే ఇరిటేషన్ రావచ్చు. అంతేకాక ఆ మేకప్ కండ్లలోకి వెళ్ళే అవకాశం ఉంటుంది.
- నిద్ర లేకపోవడం వల్ల అలసట, తలనొప్పి, చూపు మసక బారేలా చేస్తుంది. చక్కటి నిద్ర మంచి చూపుకు, కంటి కండరాల విశ్రాంతికి సహాయం చేస్తుంది.
- తరుచూ గుడ్డు తీసుకోవడం వల్ల అందులోని పోషక పదార్థాలు చురుకైన చూపుకు సహాయపడతాయి. అలాగే వయసు సంబంధిత కంటి వ్యాధులను తగ్గిస్తాయి.
- ఆహారంలో కనీసం వారంలో రెండు సార్లు చేపలు ఉండేలా చూసుకోవాలి. చేపలలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు ఉండుట వల్ల డ్రై-ఐ సింద్రోం నివారించేందుకు ఉపయోగపడుతుంది.
- నీరు అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఉత్తమమైన నివారణ మార్గంగా చెప్పవచ్చు. తరచుగా మసకగా ఉన్న దృష్టి నిర్జలీకరణ వల్ల కావచ్చు. అందువల్ల నీటిని తాగుతూ ఉండాలి.
- ఆహారంలో పాలకూర ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. పాలకూర అనేక కంటి సంబంధిత సమస్యలను నిరోధించడానికి సహాయపడుతుంది.

# రేవంత్‌రెడ్డి.. తెలంగాణకు పట్టిన వ్యాధి

(మొదటిపేజీ తరువాయి)

సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీపై ఫైర్ అయ్యారు. హంతకుడే సంతాపం తెలిపినట్టుగా 50 ఏండ్ల నుంచి ఏమి అభివృద్ధి చేయకుండా ఇప్పుడు ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి అంటున్నాడని విమర్శించారు. మీ నాయకులంతా ఢిల్లీలో ఉంటారని, గల్లీలో ఏం జరిగినా మీరు ఢిల్లీకి వెళ్లాలని, కానీ బీఆర్ఎస్ పార్టీలో నాయకులు అందరూ గల్లీలోనే ఉంటారని, ఎవరికీ ఏ ఆపద వచ్చినా గల్లీ నాయకులను కలవచ్చని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఇవన్నీ ఒక్క కేసీఆర్ తోటే సాధ్యమయ్యాయన్నారు. నేటి పరిస్థితుల్లో కుంభకోణాల కాంగ్రెస్‌ను, మతోన్మాద బీజేపీని నమ్మొద్దని స్పష్టంచేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి జన్ ధన్ పేరిట దనాధన్ అకౌంట్ తీసి ప్రతిఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు పడతాయన్నారని.. ఏ ఒక్కరికైనా ఇంతవరకు పడ్డాయా.. అని ప్రశ్నించారు. పొద్దున లేచిన్నుంచి హిందూ ముస్లిం పంచాయతీ తప్ప ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.400 సిలిండర్ ధర ఉంటే పిరమాయే అన్న బీజేపీ.. ఇప్పుడు తమ ప్రభుత్వంలో రూ.1200లకు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా రూ.70 ఉన్న పెట్రోల్‌ను రూ.115కు పెంచారని, బ్యారెల్ ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ ధర పెంచారని, దాంతో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగాయని తెలిపారు. బీజేపీ వాళ్లు ఎవరైనా కలిస్తే.. ఈ తొమ్మిందేండ్లలో వారు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలు గల్లబట్టి నిలదీయాలని సూచించారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ తనకంటే వయస్సులో పెద్దవారైన, తండ్రితో సమానమైన సీఎం కేసీఆర్ గురించి చిల్లర మల్లరగా మాట్లాడుతున్నారని, ఇది పద్ధతేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని సంస్కారవంతంగా మాట్లాడే ప్రయత్నం చేయాలని, అరవింద్ ఎక్కడ పోటీ చేసినా డిపాజిట్ దక్కకుండా ఓడిస్తామని తెలిపారు.

# సంపదపై సమాన హక్కు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు పరం చేస్తున్నారన్నారు. బ్రిటీష్‌పాలకులపైనా, స్వతంత్ర్యం వచ్చాక మన పాలకులపైనా పోరాడి, కొట్లాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడానికి మోడీ ఎవరు? అని ప్రశ్నించారు. బ్రిటీష్ పాలకుల కంటే దుర్మార్గంగా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ ఓట్లు సాధించి గద్దెనెక్కడంపైనే బీజేపీ దృష్టి ఉందని ఆరోపించారు. మోడీ పచ్చి ఫాసిస్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హక్కుల గురించి, పాలకుల విధానాల గురించి ప్రశ్నించే మేధావులు, రచయితలు, కార్మిక, రైతు సంఘాల నేతలు, ప్రజాస్వామికవాదులను ఉపా చట్టం కింద నిర్బంధించి వారు జైల్లోనే మగ్గేలా చేస్తున్న మోడీ సర్కారు తీరును ఎండగట్టారు. వలస కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల వివరాలు కేంద్రం వద్ద లేవనటం దుర్మార్గమన్నారు. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నదనీ, అది యువతను పెడదోవ పట్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశభక్తి ముసుగేసుకున్న మోడీ సర్కారు కార్పొరేట్లకు దేశాన్ని అమ్మేస్తున్నదని విమర్శించారు. దేశ రక్షణకు సంబంధించిన డిఫెన్స్ రంగంలోకి విదేశీ పెట్టుబడులకు ఎలా అవకాశం ఇస్తారని నిలదీశారు. ఢిల్లీ రైతాంగ పోరాటం విరమణ సందర్భంగా మోడీ సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ సర్కారును గద్దె దింపాలంటే ఐక్యపోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మహాపడావ్‌లో ఆర్‌డీ చంద్రశేఖర్(ఐఎన్‌టీయూసీ), జె.వెంకటేశ్, ఎం.వెంకటేశ్ (సీఐటీయూ), ఎం.నర్సింహ్మ(ఏఐటీయూసీ), ఎం.శ్రీనివాస్ (ఐఎఫ్‌టీయూ), రెబ్బా రామారావు(హెచ్‌ఎంఎస్), వి.ప్రవీణ్(ఐఎఫ్‌టీయూ), అనురాధ(ఐఎఫ్‌టీయూ), వి.వి.రత్నాకర్‌రావు(టీఎన్‌టీయూసీ), ఆంజనేయులు (ఏఐయూటీయూసీ), కార్మిక సంఘాల నాయకులు బి.వెంకటేశ్, అజయ్‌బాబు, మల్లేశ్‌యాదవ్, ఏ.నాగేశ్వర్‌రావు(మెడికల్ రిప్స్), పావని, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయం కాదు.. బాధితులను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

మాకినేని బసవపున్నయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను అందించారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా పరిధి మొరంచపల్లి గ్రామంలో వరద బాధితులకు పార్టీ జిల్లా కమిటీతో పాటు మాకినేని బసవపున్నయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరదల్లో చనిపోయి, నష్టపోయిన సుమారు 170 కుటుంబాలకు రూ.1.20లక్షల ఆర్థిక సాయం అందజేశారు.



ఆ సందర్భంగా పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. బాధిత ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మోరంచపల్లిలో గత నెల 27న ఆకస్మాత్తుగా వచ్చిన వరదలతో గ్రామంలోని ప్రజలు సర్వం కోల్పోయారని తెలిపారు. నలుగురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు ఆయా పార్టీలు ఎంతో మంది సాయం చేశారని, కానీ ప్రభుత్వాలు మాత్రం ఇప్పటికీ స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుల చట్టం కింద ఈ గ్రామాన్ని దత్తత తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం దేవేందర్, వెలిశెట్టి రాజయ్య, ప్రీతి, శ్రీకాంత్, నాయకులు రవి, వంగాల లక్ష్మి, కోమల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ప్రాజెక్టునగర్ గ్రామంలో వరదలతో నష్టపోయిన 40 కుటుంబాలకు ప్రేరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను అందించారు. అలాగే గ్రామానికి చెందిన రెహమాన్ కుటుంబంలో ముగ్గురు వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందగా.. వారి కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. వరదలు ముంచెత్తి 15 రోజులు కావస్తున్నా ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పరిహారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగి ప్రజలు కష్టాల్లో ఉంటే.. సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ధర్నాలు, రాస్తారోకోలు, ప్రజా పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వరదల వల్ల నష్టపోయిన ప్రజల పక్షాన పోరాడుతున్నామని స్పష్టంచేశారు. వరదల నుంచి శాశ్వతంగా గ్రామానికి విముక్తి కలిగేలా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. పోడు భూములు సాగుచేసుకుంటున్న ప్రతి ఒక్కరికీ పట్టాలివ్వడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు.

అనంతరం ప్రాజెక్టునగం లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్టారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యులు పొదిల చిట్టిబాబు, అంబాల పోశాలు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గొంది రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు కొట్టెం కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడిన రాష్ట్రానికి తొమ్మిదేండ్లుగా కేంద్రం అన్యాయమే చేస్తోందని, రాష్ట్రంపై కేంద్రానికి ఎందుకంత వివక్ష అని ప్రశ్నించారు. బుధవారం అవిశ్వాసంపై జరిగిన చర్చలో నామా నాగేశ్వరరావు మాట్లాడారు. 'దేశం అంటే రాష్ట్రల సమూహం. ప్రధాని స్థానంలో ఉన్నవారికి చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, మద్దతిచ్చే రాష్ట్రం, మద్దతుగా లేని రాష్ట్రం అన్న వ్యత్యాసం ఉండరాదు. కానీ తెలంగాణను కేంద్రం విస్మరిస్తోంది. తొమ్మిదేండ్లుగా అన్యాయం చేస్తూనే ఉంది' అని దుయ్యబట్టారు. ఏపీ విభజన చట్టం ప్రకారం తెలంగాణకు స్టీల్‌ప్లాంట్, ఖాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, ఐఐఎం, ట్రైబల్ యూనివర్సిటీలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదన్నారు. మెడికల్ కళాశాలలు, నవోదయ విద్యాలయాలు ఒక్కటీ ఇవ్వకుండా తెలంగాణను విస్మరించిందన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు మంజూరైనా దాన్ని రద్దు చేశారని, దీనిపై కేంద్రం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నీళ్లు ఇస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణే అని కేంద్రం స్వయంగా మెచ్చుకుందని, అయితే ఈ ప్రాజెక్టుకు రూ.25 వేల కోట్ల సాయం అందించాలని నిటి ఆయోగ్ చెప్పినా కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు.

కేంద్రం ఏమాత్రం సహకారం అందించకున్నా, విద్యుత్ పంపిణీలో, తలసరి ఆదాయంలో రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వ 9ఏండ్ల హయాంలో దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఇక మణిపూర్ ఘటనలు సిగ్గుతో తలవంచుకోవాల్సిన విషయాలని, ఇలాంటి సంఘటనల వల్ల దేశం ప్రతిష్ట అంతర్జాతీయంగా దిగజారిందని అన్నారు. ఈ అన్ని అంశాల దృష్ట్యా అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తున్నట్టు తెలిపారు.

# గాంధీ మునిమనవడు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా వెల్లడించారు. 'ఆగస్టు 9న క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటి నుంచి బయలుదేరిన నన్ను స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా శాంత క్రూజ్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. తాతయ్యను బ్రిటీష్ పోలీసులు అరెస్టు చేసిన చారిత్రాత్మక తేదీనే నన్ను కూడా అరెస్టు చేసినందుకు గర్వ పడుతున్నాను' అని తుషార్ గాంధీ ట్వీట్ చేశారు. 'పోలీస్ స్టేషన్ నుంచి బయలుదేరడానికి నాకు అనుమతి లభించిన వెంటనే నేను ఆగస్టు క్రాంతి మైదాన్‌కు వెళ్తాను. ఆగస్టు కాంత్రి దిన్‌ను, అమరవీరులను స్మరించుకుంటాను' అని కూడా మరో ట్వీట్ చేశారు. మరికొద్ది సేపటి తరువాత తనకు అనుమతి లభించిందని, ఆగస్టు క్రాంతి మైదాన్‌కు వెళు తున్నట్టు తుషార్ గాంధీ ట్వీట్ చేశారు.

మరోవైపు, తీస్తా సెతల్వాద కూడా ఇదే విధంగా ట్వీట్ చేశారు. 'మహారాష్ట్రలో పోలీసు రాజ్యం. ఇరవై మంది పోలీసుల బృందం జుహూలోని నా ఇంటి బయట నిలబడి నన్ను జీజీ పారిఖ్ మోర్చాలో పాల్గొననీయకుండా అడ్డుకుంది' అని ట్వీట్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను కూడా పోస్ట్ చేశారు. 2002 గుజరాత్ అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు గత నెల 19న బెయిల్ మంజూరు చేయడంతో తీస్తా సెతల్వాద ప్రస్తుతం బయట ఉన్నారు. కాగా, తనపై నమోదైన 2002 గుజరాత్ అల్లర్ల కేసును కొట్టివేయాలని తీస్తా సెతల్వాద్ దాఖలు చేసిన పిటీషన్‌ను అత్యవసరంగా విచారించడానికి గుజరాత్ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. సాధ్యమైనంత త్వరగా పిటీషన్‌ను విచారిస్తామని జస్టిస్ సందీప్ భట్ నేతృత్వంలోని సింగిల్ జడ్జి ధర్మాసనం తెలిపింది. 2002 గుజరాత్ అల్లర్ల కేసులో అప్పటి గుజరాత్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులను ఇరికించేందుకు కుట్ర పన్నారని, నకిలీ సాక్ష్యాలను రూపొందించారనే ఆభియోగాలను తీస్తా సెతల్వాద్ ఎదుర్కొంటున్నారు.

## కేరళ కాదు..కేరళం

రాష్ట్రం పేరును మార్చాలని ఎందుకు కోరుతున్నామో సీఎం వివరించారు. 'మలయాళంలో రాష్ట్రం పేరును 'కేరళం' అని పిలిచేవారు. కానీ, ఇతర భాషల్లో మాత్రం కేరళ అని పిలుస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటం కాలం నుంచి మలయాళం మాట్లాడే వర్గాల కోసం ఐక్య కేరళను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ లో మన రాష్ట్రం పేరును కేరళ అని రాసి ఉంది. అందువల్ల రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం దీన్ని 'కేరళం'గా సవరించి, రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ లో పేర్కొన్న అన్ని భాషల్లో 'కేరళం'గా పేరు మార్చడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం' అని పినరయి విజయన్ వివరించారు.

## విచారణ నుంచి తప్పుకున్న సుప్రీంకోర్టు జడ్జి

అక్టోబర్‌లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు సైతం ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. దీంతో విద్యార్థి నాయకుడు ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ అంశం మే 18న మొదటిసారిగా సుప్రీంకోర్టు ముందుకు వచ్చిన తర్వాత, ఢిల్లీ పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి మరింత సమయం కోరడంతో గతనెల 12న ఒకసారి, ఆపై అదే నెల 24న మరోసారి వాయిదా పడింది.

జస్టిస్ మిశ్రా ఈ ఏడాది మే 19న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అల్లర్లకు సంబంధించిన కేసుల్లో కల్పిత సాక్ష్యాలపై గుజరాత్ పోలీసు ఎఫ్ఐఆర్‌లో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంపై జస్టిస్ ఎ.ఎస్ ఓకాతో విభేదించినందుకు ఆయన చివరిగా వార్తల్లో నిలిచారు. దీంతో ఈ కేసును త్రిసభ్య ధర్మాసనం విచారించగా ఆమెకు బెయిల్ మంజూరు చేసింది.

# ముస్లిం వ్యాపారాలపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. హర్యానాలోని 50 పంచాయతీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. హర్యానాలోని నూహ్ జిల్లాలో ఇటీవల మతపరమైన ఘర్షణలు జరిగాయి. ఇద్దరు హోంగార్డులతో సహా ఆరుగురు మరణించగా పలువురు గాయపడ్డారు. హింసాత్మక సంఘటనల నేపథ్యంలో నూహ్ జిల్లాకు పొరుగున్న ఉన్న రేవారి, మహేందర్‌గఢ్, ఝజ్జర్ జిల్లాలకు చెందిన పంచాయతీలు ఒకే విధమైన లేఖలు విడుదల చేశాయి.

మరోవైపు, హిస్సార్ జిల్లాకు చెందిన కొంతమంది పంచాయతీ సభ్యులు కూడా ఇలాంటి డిమాండ్లు చేశారు. ముస్లిం ఉద్యోగులను తొలగించాలంటూ అన్ని షాపులకు రెండు రోజులు గడువు ఇచ్చారు. అలా చేయని షాపులు, వ్యక్తులను తాము బహిష్కరిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు దీనిపై స్పందించారు. ముస్లిం వ్యాపారుల ప్రవేశాన్ని నిషేధిస్తూ లేఖలు జారీ చేసిన పంచాయతీలకు షోకాజ్ నోటీసులు పంపాలని బ్లాక్ కార్యాలయాలను నార్నౌల్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆదేశించారు.

హర్యానాలోని నూహ్ జిల్లాలో ఇటీవల మతపరమైన ఘర్షణలు చెలరేగాయి. గురుగ్రామ్, ఫరీదాబాద్, పల్వాల్, రేవారి, పానిపట్, భివానీ వంటి ప్రాంతాలకు ఇవి వ్యాపించాయి. ఈ హింసాత్మక సంఘటనలకు సంబంధించి 142 కేసులు నమోదయ్యాయి. అల్లర్లకు సంబంధించి పోలీసులు 312 మందిని అరెస్ట్ చేశారు. 106 మందిని అదుపులోకి తీసుకున్నారు.

## నోరు అదుపులో పెట్టుకో..

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ (ఎం) స్పష్టం చేసింది. ఈ విషయంపై ఒక వర్గం మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.

సీపీఐ(ఎం) రాజకీయ విధానాలు, సిద్ధాంతాలు తెరచిన పుస్తకంలా ఉంటాయన్నది వాస్తవం. అలాగే బీజేపీ హిందూత్వ, మతతత్వ భావజాలాన్ని సీపీఐ(ఎం) నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోందన్న విషయం కూడా వారికి బాగా తెలుసు. అందుకే ఈ విధంగా దుష్ప్రచారాన్ని నిర్వహిస్తోందని సీపీఐ(ఎం) ధ్వజమెత్తింది.



## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై..

# ఐక్యంగా పోరాడుదాం

**లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్**
**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 'క్విట్ మోడీ' కార్యక్రమం**

**నవతెలంగాణ- విలేకరులు**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ పిలుపు నిచ్చారు. బుధవారం క్విట్‌ఇండియా దినోత్సవం సందర్భంగా ఆ ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు జాతీయ కార్మిక, ఉద్యోగ సంఘాలు 9,10 తేదీల్లో మహా పడావ్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లాల్లోని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు.

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో చుక్క రాములు పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో కార్మికులు, ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. వేతనాల కోడ్‌తో కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి మంగళం పాడారని, పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాశారని, సామాజిక భద్రతా కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం-పని పరిస్థితుల కోడ్‌లతో పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ పాలనలో సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వంద శాతం వాటాలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో పక్క పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యవసరాల ధరల్ని పెరిగి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. మతం, కులం, భాష, ప్రాంతం పేరిట భావోద్వేషాలను రెచ్చగొడుతూ.. దేశ స్వావలంబనకే ముప్పు వాటిల్లేలా పరిపాలన చేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సమరశీలంగా పోరాడాలన్నారు.

ఖమ్మం ధర్నా చౌక్‌లోని పాత కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మోడీ పాలనలో స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తెచ్చారని, 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించి పని భారం పెంచారని విమర్శించారు. యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారని, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నదన్నారు. దాంతో ఆర్థిక అసమానతలు తీవ్రమౌతున్నాయని, ఆర్థిక మాంద్యం మరింత ఉధృతం అవుతుందని, ఉపాధి కల్పన స్తంభించి నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాల వల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఐక్య సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహా పడావ్ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా చేశారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో బస్టాండ్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. 'క్విట్ మోడీ.. సేవ్ ఇండియా' అంటూ నినాదాలు చేశారు.

## వీఆర్ఏలకు జూ.అసిస్టెంట్స్ హోదా వద్దు : హైకోర్టులో రిట్లు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని సుమారు 17 వేల మంది వీఆర్ఏలకు ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్స్ హోదా ఇవ్వాలన్న జీవో 81ని రద్దు చేయాలని కోరుతూ రెవెన్యూ శాఖలోని ఆఫీస్ అసిస్టెంట్లు హైకోర్టులో రిట్లు దాఖలు చేశారు. ఆదిత్య ,ఇతర ఆఫీస్ అసిస్టెంట్లు వేసిన ఈ రిట్‌ను గురువారం హైకోర్టు విచారించనుంది. వీఆర్ఏలకు ఇస్తే అభ్యంతరం లేదనీ, అయితే, చట్ట ప్రకారం ఆఫీస్ అసిస్టెంట్లకు ఇచ్చాకే ఇవ్వాలనీ, ప్రభుత్వ నిర్ణయం స్టేట్ మినిస్టీరియల్ సర్వీస్ రూల్స్, స్టేట్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్లకు వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు.



# 'గృహలక్ష్మి'ల గగ్గోలు

### మూడు లక్షల కోసం ముప్పు తిప్పలు

- దరఖాస్తుల కోసం తీరని వెతలు
- అందుబాటులో లేని తహసీల్దార్లు
- ఆదాయ సర్టిఫికెట్ కోసం అగచాట్లు
- నేటితో ముగియనున్న మూడురోజుల గడువు
- నిరంతర ప్రక్రియ అంటున్న అధికారపక్ష వర్గీయులు

**తేదీ పొడిగించాలని రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్లు**

మూడు లక్షల రూపాయల గృహలక్ష్మి పథకం కోసం మహిళలు ముప్పు తిప్పలు పడుతున్నారు. దరఖాస్తులకు మూడ్రోజులు మాత్రమే సమయం ఇవ్వడం.. గురువారం నాటితో గడువు ముగుస్తుండటంతో తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. చాలా మంది మహిళలకు ఆదాయ సర్టిఫికెట్ లేకపోవడంతో ఇప్పటికిప్పుడు దానిని తెచ్చేందుకు తంటాలు పడుతున్నారు. పలు మండలాల్లో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వకపోతే తమకు లబ్ది చేకూరు తుందో లేదోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, అధికారులు మాత్రం అందు బాటులో ఉన్న ధ్రువీకరణలతో దరఖాస్తు చేస్తే సరిపోతుందని, విచారణ సమయం నాటికి నిర్దేశిత సర్టిఫికెట్లు పొందాలని చెబుతున్నారు. మరోవైపు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 'గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియని, దరఖాస్తుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని' ప్రకటించారు. అయినప్పటికీ దరఖాస్తుదారుల్లో టెన్షన్ తగ్గడం లేదు. సకాలంలో దరఖాస్తు చేయకపోతే తమను ఎక్కడ అనర్హులుగా పరిగణిస్తారోనని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గడువు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఆందోళనలు జరుగుతున్నాయి. గడువు అంటూ ఏమీ లేదని, ఇదొక నిరంత ప్రక్రియ అని అధికారపక్ష వర్గీయులు అంటున్నారు.

**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో గృహలక్ష్మి పథకం దరఖాస్తులు వేసేందుకు బాక్స్‌లు ఏర్పాటు చేశారు. ఆరుబయట ఏర్పాటు చేసిన ఈ బాక్స్‌లకు ఎలాంటి భద్రతా లేదు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వందలాది దరఖాస్తుల తో రెండు పెట్టెలు నిండాయి. దరఖాస్తుదారుల అను మానాలు నివృత్తి చేయడం కోసం బాక్స్‌ల వద్ద ఉం డాల్సిన సిబ్బంది ఎక్కడ తిరుగుతున్నారో అర్థంకాని దుస్థితి. దీంతో దరఖాస్తుదారులు పలుచోట్ల గందర గోళానికి గురవుతన్నారు. కొన్ని తహసీల్దార్ కార్యాల యాల్లోనే ఈ ప్రక్రియ పకడ్బందీగా సాగుతోంది.

**అందుబాటులో లేని తహసీల్దార్లు :** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. నూతన తహసీల్దార్లు కొందరు ఇప్పటికీ బాధ్యతలు తీసుకోలేదు. బాధ్యతలు తీసుకున్నవారిలో కొందరు సెలవులు, ఎన్నికలు, జీవో 58 విచారణ తదితర పనుల నిమిత్తం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఆయా కారణాలతో తహసీల్దార్లు అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తుదారుల్లో అయోమయ స్థితి నెలకొంది. ముఖ్యంగా ఆదాయ సర్టిఫికెట్ విషయంలో ఆందోళన నెలకొంది. గృహలక్ష్మి పథకంపై వినతిపత్రం ఇచ్చేందుకు ఆయా మండలాల నేతలు తహసీల్దార్ కార్యాల యాలకు వస్తున్నారు. వారు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఖమ్మం రూరల్, కామేపల్లి, మరికొన్ని మండలాల్లో ఈ పరిస్థితి రెండ్రోజులుగా కొనసాగుతోంది. తహసీల్దార్లు లేనిచోట ఆర్ఐలైనా ఉండి సమాధానం చెప్పే పరిస్థితి లేదు.

**మార్గదర్శకాల విషయంలోనూ గందరగోళం**

మార్గదర్శకాలు, సర్టిఫికెట్ల విషయంలోనూ గందర గోళం నెలకొంది. ప్రభుత్వం, ప్రభుత్వాధికారుల నుంచి ఈ స్కీంపై పూటకో ప్రకటన ఇస్తుండటంతో దరఖాస్తుదారుల్లో గందరగోళ స్థితి నెలకొంది. తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎలక్షన్ ఓటర్ గుర్తింపు కార్డు ఉంటే చాలనీ, కుల, ఆదాయ ధ్రువీకరణలతో పనిలేదని కొందరు అధికారులు చెబుతు న్నారు. దరఖాస్తుదారుని ఇంటి వద్దకు విచారణ నిమిత్తం వచ్చినప్పుడు సమర్పిస్తే సరిపోతుందంటున్నారు. ఖాళీ స్థలం దస్తావేజులు, అదే గ్రామానికి చెందిన వారిగా నిరూపించుకునే ఆధారాలు ఉండాలంటు న్నారు. బుధవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రకటనలో మాత్రం గ్రామకంఠంలో ఉన్న పాత ఇండ్లు, స్థలాలకు దస్తావేజు పేపర్లు ఉండవని, ఇంటి నంబర్ లేకుంటే ఖాళీ స్థలం ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇలా ప్రభుత్వం, అధికారుల నుంచి వెలువడుతున్న అస్పష్ట ప్రకటనలతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు.

## నవచిత్రం

### ఆ.. యూనివర్సల్ ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది

చిరంజీవి నటిస్తున్న మాస్-యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 11న విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత అనిల్ సుంకర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు.

'చిరంజీవితో సినిమా చేయడం అనేది ఎవరికైనా ఒక కల.. ఆ కల ఇంత త్వరగా నెరవేరుతుందని ఊహించలేదు. చాలా మంది స్టార్స్‌తో సినిమాలు చేశాను. అయితే చిరంజీవి అనుభవం మా అందరికీ కలిసొస్తుంది. ఆయన చాలా చురుగ్గా ఉంటారు. మనతో మాట్లాడుతూనే .. సడన్ గా షాట్ రెడీ అయ్యిందని వాళ్ళు రాకముందే తెలుసుకొని వెళ్ళిపోతారు. ఆయన సమయపాలన అద్భుతం. 'వేదాళం' రీమేక్‌ను ఎఎం రత్నం చేద్దామని అనుకున్నారు. ఆయన నాకు బాగా క్లోజ్. వేరే వాళ్లకి అయితే ఇచ్చేవాళ్ళు కాదేమో. చిరంజీవితో సినిమా చేస్తున్నపుడు యూనిక్ సబ్జెక్ట్ కాకుండా రీమేక్ చేయడానికి కారణం 'భోళా శంకర్' సబ్జెక్ట్ నాకు చాలా ఇష్టం. ఈ సబ్జెక్ట్ వల్లే మాకు చిరంజీవి డేట్స్ వచ్చాయి. అలాగే చిరంజీవి ఈ సినిమా చేయడానికి మూలకారణం మెహర్ రమేష్. ఆయనకి కూడా ఈ సబ్జెక్ట్ చాలా ఇష్టం. రెండేళ్ళ క్రితమే ఈ సబ్జెక్ట్ చిరంజీవితో చెప్పారట. చిరంజీవికి చాలా బాగా నచ్చింది. ఈ సినిమా ఓపెనింగ్స్ విషయంలో మేము అనుకున్న ఓపెనింగ్స్ వస్తాయి. ఇదొక మాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అవుట్ పుట్ పై చిరంజీవి, మేము చాలా హ్యాపీగా ఉన్నాం. ఖచ్చితంగా వర్క్ అవుట్ అవుతుంది. ఆల్రెడీ వర్క్ అవుట్ అయిన ఫీలింగ్ ఉంది. బ్రదర్, సిస్టర్ ఎమోషన్ యూనివర్సల్. అందరికీ కనెక్ట్ బాగా అవుతుంది. ఇందులో సిస్టర్ పాత్రలో కీర్తి సురేష్ ఉండాలని ముందే నిర్ణయించుకున్నాం. మహతి సాగర్ ఆల్రెడీ ప్రూవ్ చేసుకున్నారు. పెద్ద స్టార్ సినిమా ఇస్తేనే నెక్స్ లెవల్‌కి వెళ్తారు. కొత్తవాళ్ళు పెద్ద మ్యూజిక్ డైరెక్టర్స్‌గా ఎదిగితే ఇండస్ట్రీకి కూడా మంచి పరిణామం. మహతి చాలా మంచి పాటలు ఇచ్చాడు. రీరికార్డింగ్ కూడా అద్భుతంగా చేశాడు. మహేష్ బాబుతో సినిమా చిత్రీకరణ చేసేటప్పుడు నేను ప్రతిరోజు సెట్‌లో వుంటాను. నాకు,మహేష్‌కి మధ్య ఆ బాండింగ్ ఉంటుంది. మిగతా సినిమా చిత్రీకరణలకు నేను ఉండను. అయితే భోళా శంకర్ చేసేటప్పుడు 'ఒక హీరోగా చెబుతున్న. ప్రతిరోజు మీరు సెట్‌లో ఉండాలి. నిర్మాత సెట్‌లో ఉంటే చిరంజీవి చాలా ఆనందపడతారు' అని మహేష్ చెప్పారు. 120 వర్కింగ్ డేస్‌లో దాదాపు 40 రోజులు చింజీవితో ఉన్నాను. ఇది చాలా మెమరబుల్ జర్నీ. మా 14 రీల్స్‌లో నెక్స్ ప్రాజెక్ట్‌గా బెల్లంకొండ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేస్తున్నాం' అని తెలిపారు.


అనిల్ సుంకర





Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.